


www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI




సోమవారం | 12-8-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 118 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి ఉ. 7.55 తదుపరి అష్టమి; నక్షత్రం: స్వాతి ఉ. 8.33 తదుపరి విశాఖ; వర్జ్యం: మ. 2.39-4.24; దుర్ముహూర్తం: మ.12.45-1.35, మ. 3.16-4.07; అమృతఘడియలు: రా. 1.07-2.52; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 6.01; సూర్యాస్తమయం: 6.38 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru





| దేశం | స్వ | ర | కా | మొ |
|---|---|---|---|---|
| అమెరికా | 40 | 44 | 42 | 126 |
| చైనా | 40 | 27 | 24 | 91 |
| జపాన్ | 20 | 12 | 13 | 45 |
| ఆస్ట్రేలియా | 18 | 19 | 16 | 53 |
| ఫ్రాన్స్ | 16 | 26 | 22 | 64 |
| నెదర్లాండ్స్ | 15 | 7 | 12 | 34 |
| బ్రిటన్ | 14 | 22 | 29 | 65 |
| కొరియా | 13 | 9 | 10 | 32 |
| ఇటలీ | 12 | 13 | 15 | 40 |
| జర్మనీ | 12 | 13 | 8 | 33 |
| న్యూజిలాండ్ | 10 | 7 | 3 | 20 |
| కెనడా | 9 | 7 | 11 | 27 |
| ఉజ్బెకిస్థాన్ | 8 | 2 | 3 | 13 |
| హంగేరి | 6 | 7 | 6 | 19 |
| స్పెయిన్ | 5 | 4 | 9 | 18 |
| స్వీడన్ | 4 | 4 | 3 | 11 |
| కెన్యా | 4 | 2 | 5 | 11 |
| నార్వే | 4 | 1 | 3 | 8 |
| ఐర్లాండ్ | 4 | 0 | 3 | 7 |
| బ్రెజిల్ | 3 | 7 | 10 | 20 |
| 71 భారత్ | 0 | 1 | 5 | 6 |

గమనిక: స్వ=స్వర్ణం, ర=రజతం, కా=కాంస్యం, మొ=మొత్తం.

### స్వీడన్‌కు బీచ్ వాలీబాల్ టైటిల్

బీచ్ వాలీబాల్ స్వర్ణాన్ని స్వీడన్ జోడీ డేవిడ్-జొనాటన్ సొంతం చేసుకొంది. పురుషుల ఫైనల్లో స్వీడన్ 2-0తో జర్మనీపై విజయం సాధించింది. కతార్‌పై 2-0తో గెలిచిన నార్వే కాంస్య పతకాన్ని దక్కించుకొంది. హ్యాండ్‌బాల్ టైటిల్‌ను డెన్మార్క్ ఎగరేసుకు పోయింది. పురుషుల ఫైనల్లో డెన్మార్క్ 39-26తో జర్మనీని ఓడించింది. ఉత్కంఠభరితంగా జరిగిన కాంస్య పోరులో స్పెయిన్ 23-22తో స్లొవేనియాపై గెలిచింది.

# స్వర్ణాలలో సమం!

## ఓవరాల్‌గా అగ్ర పీఠంపై అమెరికా • చైనాకు రెండో స్థానం



(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

ఒలింపిక్స్ ముగిశాయి. రెండు వారాలకుపైగా..వేలాదిమంది అథ్లెట్లు తమ అద్భుత నైపుణ్యాలను ప్రదర్శించి విశ్వవ్యాప్తంగా కోట్లాదిమందిని అలరించారు. ఏ ఆటగాడైనా..ఏ జట్టయినా..ఎంత బాగా ఆడారన్నది అంతిమంగా వారు సాధించే పతకాన్ని చూసి నిర్ధారిస్తారు. ఒకప్పుడు ప్రపంచ రాజకీయాల్లో మాదిరే అమెరికా, సోవియట్ రష్యా విశ్వక్రీడల్లోనూ నువ్వా..నేనా..అనేలా ఢీకొనేవి. కానీ కాలం మారింది. ప్రస్తుతం అగ్రదేశం అమెరికాకు అన్ని రంగాల్లో చైనా సవాలు విసురుతోంది. ఆ క్రమంలో ఒలింపిక్స్‌లోనూ అమెరికాతో సై అంది. దాంతో ఈసారి స్వర్ణ పతకాలకోసం రెండు దేశాలు హోరాహోరీగా తలపడ్డాయి. శనివారం పోటీలు ముగిసే సరికి 39 స్వర్ణాలతో చైనా ఆధిపత్యం చెలాయించింది. అమెరికా ఒకటి తక్కువగా అంటే..38 పసిడి పతకాలతో రెండో స్థానంలో నిలిచింది. దాంతో ఆఖరి రోజు..ఆదివారం జరిగే ఈవెంట్లపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. చైనాను దాటేసి అమెరికా పతక రేస్‌లో 'అగ్ర' స్థానంలో నిలుస్తుందా..లేదంటే డ్రాగన్ ఆధిపత్యం కొనసాగుతుందా..అనే విషయమ్మై జోరుగా చర్చలు. చివరి రోజు వెయిట్ లిఫ్టింగ్ మహిళల 81+కిలోల విభాగంలో లీ వెన్ వెన్ స్వర్ణం సాధించడంతో చైనా పతకాల సంఖ్య 40కి చేరింది. అయితే సైక్లింగ్ మహిళల ఓమ్నియమ్ కేటగిరీలో జెన్నిఫర్ వాలెంటె తన పసిడి పతకాన్ని నిలబెట్టుకుంది. దాంతో అమెరికా స్వర్ణాల సంఖ్య 39కి చేరింది. ఈనేపథ్యంలో మహిళల బాస్కెట్‌బాల్ స్వర్ణ పతక పోరుపై ఆసక్తి పెరిగిపోయింది. అందుకుతగ్గట్టుగానే..అమెరికా మ్యాచ్‌లో తగ్గేదేలె అన్నట్టు ఆడాయి. పాయింట్ (67-66)తో జయకేతనం వేసిన అమెరికా బంగారు పతకం చేజిక్కించుకుంది. దాంతో అమెరికా, చైనా చెరో 40 స్వర్ణ పతకాలతో సమంగా నిలిచాయి. ఆఖరి రోజు అమెరికా మొత్తం ఐదు పతకాలు తన ఖాతాలో వేసుకుంది. బాస్కెట్‌బాల్, సైక్లింగ్ స్వర్ణాలుగా, రెజ్లింగ్ మహిళల 76 కిలోలు, మహిళల వాలీబాల్‌లో రజతాలు, పురుషుల వాటర్ పోలోలో కాంస్య పతకం సొంతం చేసుకుంది. కాగా..అమెరికా కాంస్య పతకాలలో ఆదివారంనాడు ఒకటి తగ్గింది. జిమ్నాస్టిక్స్ మహిళల ఫ్లోర్ ఫైనల్లో అమెరికాకు చెందిన జోర్డాన్ చైల్స్ అందుకున్న కాంస్యాన్ని..రుమేనియా జిమ్నాస్ట్ అనాకు ప్రకటించారు. అంతర్జాతీయ ఆర్బిట్రేషన్ కోర్టు తీర్పు మేరకు పారిస్ క్రీడల నిర్వాహకులు ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇక..మొత్తం 126 (40-44-42) మెడల్స్‌తో అమెరికా తనకు తిరుగులేదని మరోసారి నిరూపించుకుంది. టోక్యో విశ్వక్రీడల పసిడి పతకాల్లోనూ అమెరికా (39)దే పైచేయి. అప్పుడూ చైనా (38) రెండో స్థానంతో సరిపెట్టుకుంది. రియోలో అయితే అమెరికా (46 స్వర్ణాలు) ప్రత్యర్థులకు అందనంత ఎత్తులో నిలిచింది.

చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా 117 మంది అథ్లెట్లతో పయనం.. ఈసారి రెండంకెల పతకాలు ఖాయమని అంచనాలు.. తీరా చూస్తే టోక్యో గేమ్స్‌కన్నా ఒకటి తక్కువగా ఆరు మెడల్స్‌తోనే సరిపెట్టుకోవాల్సి వచ్చింది. కచ్చితంగా పోడియంపై నిలబడతారనుకున్న అథ్లెట్లు నిరాశపరిచారు. మరి పారిస్ గేమ్స్‌ను ఏ విధంగా చూడాలి? ఒక్క స్వర్ణం కూడా లేకుండా వెనుదిరిగిన మనోళ్లు విజయవంతమైనట్టా.. లేదా? ఏ దేశ క్రీడా ప్రతిభ అయినా ఒలింపిక్స్ పతకాల పట్టిక చూస్తే తెలుస్తుంది. టోక్యోలో 48వ స్థానంతో మురిపిస్తే.. ఈసారి పతకాలు సాధించిన 91 దేశాల్లో మనది 71వ స్థానం. అయితే ఆరుగురు అథ్లెట్లు నాలుగో స్థానంలో నిలిచి భవిష్యత్‌పై భరోసా పెంచగలిగారు. ఈ నేపథ్యంలో తాజా ఒలింపిక్స్‌లో భారత ప్రస్థానం గురించి విశ్లేషించుకుంటే..

# కొస్త మోదం.. ఇంకొస్త ఖేదం

## ఆరు పతకాలతో సంతృప్తి

### గురి తప్పని షూటర్లు

పారిస్ గేమ్స్‌లో భారత పతకాల పరువు కాపాడింది మాత్రం కచ్చితంగా షూటర్లే. రియో, టోక్యోల్లో ఒక్క పతకం కూడా తేలేకపోయిన వీరు.. పారిస్‌లో మాత్రం అభిమానులను ఖుషీ చేస్తూ ఏకంగా మూడు మెడల్స్‌ను ఖాతాలో వేసుకున్నారు. ఒకే గేమ్స్‌లో భారత్‌కు గతంలో ఇన్ని పతకాలు ఏ క్రీడాంశంలోనూ రాకపోవడం గమనార్హం. పోటీల రెండో రోజే స్టార్ షూటర్ మను భాకర్ 10మీటర్ల వ్యక్తిగత ఎయిర్ పిస్టల్ విభాగంలో కాంస్యంతో బోణీ చేసింది. అనంతరం మిక్స్‌డ్ ఈవెంట్‌లో సరబ్‌జోత్‌తో కలిసి మను మరో కాంస్యం దక్కించుకుంది. ఇక రైఫిల్ 3 పొజిషన్‌లో ఎలాంటి అంచనాలూ లేని స్వప్నిల్ కుశాలె కంచు పతకంతో వహ్వా అనిపించుకున్నాడు.



### అంచనాలు తప్పారు..

పారిస్‌కు ముందు చివరి మూడు ఒలింపిక్స్‌లోనూ బ్యాడ్మింటన్‌లో భారత్‌కు పతకాలు వచ్చాయి. కానీ ఈసారి ఎక్కువగా నిరాశపరిచిన విభాగం ఇదే. రియోలో రజతం, టోక్యోలో కాంస్యంతో ఆకట్టుకున్న స్టార్ షట్లర్ పీవీ సింధు అంచనాలతో బరిలోకి దిగి గ్రూప్ దశను మాత్రమే దాటగలిగింది. అటు డబుల్స్‌లో స్వర్ణం సాధిస్తారనుకున్న సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి ఓటమి అందరికీ షాక్‌ను కలిగించింది. ఇక బాక్సర్లు కూడా ఊహించని విధంగా రిక్తహస్తాలతోనే వెనక్కి రావాల్సి వచ్చింది. ఈ విభాగం కూడా భారత్‌కు గత మూడు ఒలింపిక్స్‌లో పతకాలను అందించింది. ఎప్పటిలాగే ఆర్చరీలో తొలి ఒలింపిక్ మెడల్ ఇంకా ఊరిస్తూనే ఉంది.

### వీరికి లక్కు లేకపాయె..

తాజా ఒలింపిక్స్‌లో పతకాల సంఖ్యను పక్కనబెడితే..మన ఆటగాళ్ల ప్రదర్శన మరీ తీసికట్టుగా భావించలేం. ఓవిధంగా గతంకంటే మిన్నగా ఉందనే చెప్పుకోవాలి. ఎందుకంటే ఆరు ఈవెంట్లలో భారత్ నాలుగో స్థానంలో నిలిచి కొస్తలో కాంస్య పతకాలను చేజార్చుకుంది. పురుషుల 10మీ. ఎయిర్ పిస్టల్‌లో అర్జున్ బబుత, మహిళల 25మీ. ఎయిర్ పిస్టల్‌లో మను భాకర్ ఇలా పతకాలు పోగొట్టుకున్నవారే. అలాగే ఇదే విభాగం మిక్స్‌డ్ స్కీట్ టీమ్‌లో అనంత్‌జీత్ సింగ్, మహేశ్వరి కేవలం ఒక పాయింట్‌తో చైనాకు కాంస్యం కోల్పోయారు. ఇక యువ షట్లర్ లక్ష్య సేన్ పురుషుల బ్యాడ్మింటన్ చరిత్రలో భారత్‌కు పతకం అందించే అవకాశాన్ని త్రుటిలో చేజార్చుకున్నాడు. సెమీస్‌లో తొలి గేమ్‌ను గెలిచినా ఆ ఊపు కొనసాగించలేకపోయాడు. టోక్యోలో రజతం అందుకున్న వెయిట్ లిఫ్టర్ మీరాబాయి చాను కేజీ బరువు తేడాతో నాలుగో స్థానంతో సరిపెట్టుకుంది. అలాగే ఆర్చరీ మిక్స్‌డ్ టీమ్‌లో అంకిత-ధీరజ్ కాంస్య పతక పోరులో వెనుకబడి అపూర్వ అవకాశాన్ని కోల్పోయారు. అన్నింటికీ మించి రెజ్లర్ వినేశ్ ఫొగట్ వ్యవహారం ఎంతో బాధాకరం. ఇక్కడైతే భారత్‌కు కనీసం రజతం ఖాయంగా కనిపించింది. కానీ నిర్ణీత బరువు కంటే ఆమె 100 గ్రాములు ఎక్కువగా ఉండడంతో అనర్హత వేటు పడింది. ఒకవేళ 13న అనుకూలంగా తీర్పు వస్తే భారత్ ఖాతాలో మరో రజతం చేరుతుంది. తద్వారా టోక్యోతో సమానంగా ఏడు పతకాలను అందుకున్నట్టవుతుంది.

### పారిస్‌లో పతక వీరులు

| అథ్లెట్ | క్రీడాంశం | పతకం |
|---|---|---|
| మను భాకర్ | షూటింగ్ | కాంస్యం |
| మను భాకర్, సరబ్‌జోత్ సింగ్ | షూటింగ్ | కాంస్యం |
| స్వప్నిల్ కుశాలె | షూటింగ్ | కాంస్యం |
| పురుషుల హాకీ జట్టు | హాకీ | కాంస్యం |
| నీరజ్ చోప్రా | జావెలిన్ త్రో | రజతం |
| అమన్ సెహ్రావత్ | రెజ్లింగ్ | కాంస్యం |

### రికార్డుల మోతతో..

పతకాలు తక్కువగానే వచ్చినా కొందరు మాత్రం రికార్డులతో తమ పేరును చిరస్మరణీయం చేసుకున్నారు. ఈసారి దేశం నుంచి పతకం సాధించిన ఏకైక మహిళా అథ్లెట్‌గా షూటర్ మను భాకర్ నిలిచింది. ఒకే గేమ్స్‌లో రెండు పతకాలు సాధించిన తొలి స్వతంత్ర భారత అథ్లెట్‌గానూ చరిత్రకెక్కింది. 2008 ఒలింపిక్స్ నుంచి కనీసం ఇద్దరు మహిళలైనా మెడల్స్ అందుకున్నారు. 2012, 2016లలో ఇద్దరేసి, 2021లో ముగ్గురు పతకంతో మెప్పించారు. పారిస్‌లో ఆ చాన్స్ మనుకు దక్కింది. ఇక నీరజ్ చోప్రా కూడా ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో రెండు పతకాలు సాధించిన భారత అథ్లెట్‌గా నిలిచాడు. అంతేకాకుండా భారత ఒలింపిక్స్ చరిత్రలో స్వర్ణం, రజతం అందుకున్న ఏకైక అథ్లెట్ చోప్రానే. వీరికి తోడు 21 ఏళ్ల యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్ భారత్ నుంచి ఒలింపిక్ మెడల్ సాధించిన అత్యంత పిన్నవయస్కుడిగా రికార్డులకెక్కాడు. భారత హాకీ జట్టు 52 ఏళ్లలో తొలిసారి రెండు వరుస ఒలింపిక్ పతకాలు అందుకుని క్రీడా ప్రేమికులను సంతోషంలో ముంచెత్తింది.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

# బాస్కెట్‌బాల్‌లో యూఎస్ 'డబుల్'



పారిస్: బాస్కెట్‌బాల్ ఆధిపత్యం చెలాయిస్తున్న అమెరికా పురుషుల జట్టు.. వరుసగా ఐదో స్వర్ణాన్ని సొంతం చేసుకుంది. మరోవైపు యూఎస్ మహిళల జట్టు కూడా పసిడిని దక్కించుకొంది. ఎన్‌బీఏ స్టార్ స్టీఫెన్ కర్రీ 24 పాయింట్లతో విజృంభించడంతో.. ఫైనల్లో అమెరికా 98-87తో ఫ్రాన్స్‌ను ఓడించింది. కాంస్య పోరులో సెర్బియా 93-83తో జర్మనీపై నెగ్గింది. హోరాహోరీగా సాగిన మహిళల తుది పోరులో అమెరికా 67-66తో ఫ్రాన్స్‌పై గెలిచింది. బెల్జియాన్ని 85-81తో ఓడించిన ఆస్ట్రేలియా కాంస్యం దక్కించుకొంది.

### ఆన్‌లైన్ వేధింపులపై ఖలెఫ్ ఫిర్యాదు

పారిస్: తన లింగత్వం విషయంలో ఆన్‌లైన్‌లో ఎదురైన ట్రోలింగ్, తప్పుడు విమర్శలపై అల్జీరియా బాక్సర్ ఇమాని ఖలెఫ్ చట్టప్రకారం ఫిర్యాదు చేసింది. ఆమెలో పురుష జన్యువులు ఎక్కువగా ఉన్నాయని.. ఖలెఫ్ ట్రాన్స్‌జెండర్ అనే వాదనలు వినిపించాయి. దీంతో మహిళల 66 విభాగంలో పాల్గొనకుండా ఇమానిపై అనర్హత వేటు వేయాలనే డిమాండ్‌లు భారీగా వినిపించాయి.

### సైక్లింగ్ స్ప్రింట్ విజేత ఎలిస్

సైక్లింగ్ స్ప్రింట్ మహిళల స్వర్ణాన్ని ఎలిస్ ఆండ్రూస్ (న్యూజిలాండ్) సొంతం చేసుకొంది. లియా ఫ్రెడ్రిస్ (జర్మనీ) రజతం, ఎమ్మా ఫినుకెన్ (జర్మనీ) కాంస్యం దక్కించుకొన్నారు. మహిళల ఓమ్నియమ్ పాయింట్ల రేస్‌లో జెన్నిఫర్ వాలెంటీ (అమెరికా) పసిడి నెగ్గగా.. డారియా పికులిక్ (పోలెండ్), అల్లీ వాలెస్టన్ (న్యూజిలాండ్) రజత, కాంస్య పతకాలు సొంతం చేసుకొన్నారు. పురుషుల కీరెన్ ఈవెంట్‌లో హ్యారీ లెవెర్సన్ (నెదర్లాండ్స్) స్వర్ణాన్ని సాధించగా.. ఆస్ట్రేలియా అథ్లెట్లు రిచర్డ్‌సన్, గ్లెట్జర్‌లు రజత, కాంస్య పతకాలు దక్కించుకొన్నారు.



### ఇటలీకి వాలీబాల్ స్వర్ణం

డిఫెండింగ్ చాంప్ అమెరికాను ఓడించిన ఇటలీ మహిళల వాలీబాల్ స్వర్ణాన్ని కైవసం చేసుకొంది. ఫైనల్లో ఇటలీ 3-0తో అమెరికాను చిత్తు చేసింది. బ్రెజిల్ 3-1తో టర్కీపై గెలిచి కాంస్యం సాధించింది.

### సెర్బియాకు పసిడి

వాటర్ పోలో స్వర్ణాన్ని సెర్బియా పురుషుల జట్టు గెలుచుకొంది. ఫైనల్లో సెర్బియా 13-11తో క్రొయేషియాపై గెలిచింది. కాంస్య పోరులో అమెరికా 15-8తో హంగేరిపై నెగ్గింది.




# జమైకా జోరుకు గండి

పారిస్: ఒలింపిక్స్‌లో ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లు ప్రత్యేక ఆకర్షణ. ఇక, ట్రాక్‌పై జమైకా స్ప్రింటర్లదే హవా. అయితే, ఇదంతా పారిస్ ఒలింపిక్స్‌కు ముందు. గత నాలుగు ఒలింపిక్స్‌లో మహిళల 100 మీటర్లలో అందుబాటులో ఉన్న 12 పతకాల్లో పది మెడల్స్ జమైకావే. ఇక, టోక్యో క్రీడల్లో అయితే క్లీన్ స్వీప్ చేశారు. గత ఐదు 200 మీటర్ల ఈవెంట్లలో అమెరికా నుంచి గట్టిపోటీ ఎదురైనా జమైకా అథ్లెట్లు నాలుగు నెగ్గారు. కానీ, 2024 ఒలింపిక్స్‌కు వచ్చేసరికి పరిస్థితి తారుమారైంది. రియోలో 11 పతకాలు, టోక్యోలో 9 మెడల్స్ సాధించిన జమైకా.. పారిస్‌లో మాత్రం ఆరు పతకాలతో సరిపెట్టుకొంది. ఎలేనా థాంప్సన్ హెరా, షెల్లీ అన్ ఫ్రేజర్ ప్రైస్, జాక్సన్‌లు గాయాలు, తదితర కారణాలతో వైదొలగడం జమైకా ఆధిపత్యానికి గండికొట్టింది. ఒక్క జమైకా అథ్లెట్ కూడా పోడియం ఫినిష్ చేయలేకపోవడం 1988 తర్వాత ఇదే తొలిసారి. 4X400 రిలేలో పూర్తిగా చేతులెత్తేశారు. పురుషుల విషయానికొస్తే కిషేన్ థాంప్సన్ వెంట్రుక వాసిలో 100 మీటర్ల స్వర్ణాన్ని కోల్పోయాడు. 110 మీ. హర్డిల్స్‌లో రషీద్ బ్రాడ్‌బెల్ కాంస్యం సాధించగా.. 4X100 రిలే జట్టు ఫైనల్ కూడా అర్హత సాధించలేకపోయింది. అయితే, డిస్కస్ త్రోలో రోజ్ స్టోనా, షాట్‌పుట్‌లో క్యాంప్‌బెల్ తొలిసారి పతకాలు అందించడం కొంత ఊరటనిచ్చే అంశం.

# శభాష్ సిఫాన్



- నెదర్లాండ్స్ అథ్లెట్‌కు మహిళల మారథాన్ స్వర్ణం
- ఒలింపిక్ రికార్డుతో కైవసం
- ఇప్పటికే 5, 10వేల మీ.లలో కాంస్యాలు

పారిస్: ఒక ఒలింపిక్స్‌లో ఒక పతకం గెలవడమే కష్టం. అందునా సుదీర్ఘ పరుగులైన ఐదు, పది వేల మీటర్లతోపాటు వీటికంటే ఇంకా సంక్లిష్టమైన మారథాన్‌లోనూ మెడల్ అందుకోవడం ఆషామాషీకాదు. కానీ అలాంటి ఘనత సాధించింది నెదర్లాండ్స్ రన్నర్ సిఫాన్ హసన్. పారిస్ క్రీడల్లో ఇప్పటికే మహిళల ఐదు, పదివేల మీటర్ల పరుగులో కాంస్య పతకాలు దక్కించుకొన్న ఆమె..ఆఖరి ఈవెంట్ మారథాన్‌లో ఏకంగా పసిడి పతకం కొల్లగొట్టి అబ్బురపరిచింది. ఆదివారం జరిగిన మారథాన్ రేస్‌ను రెండు గంటల 22 నిమిషాల 55 సెకన్ల కొత్త ఒలింపిక్ రికార్డు సమయంతో పూర్తి చేసిన సిఫాన్ టాప్‌లో నిలిచింది. కాగా..చెక్ రిపబ్లిక్‌కు చెందిన దిగ్గజ అథ్లెట్ ఎమిల్ జటోపెక్ (1952 హెల్సింకీ గేమ్స్) తర్వాత ఇలా మూడు సుదీర్ఘ విభాగ పోటీల్లో పతకాలు కైవసం చేసుకున్న తొలి ప్లేయర్‌గా సిఫాన్ రికార్డుల కెక్కింది. వాస్తవంగా పారిస్‌లో ఈ మూడు విభాగాలతోపాటు 1500 మీ. పరుగులోనూ బరిలో దిగాలని సిఫాన్ తొలుత భావించినా..తర్వాత వద్దనుకుంది. ఇక టోక్యో ఒలింపిక్స్‌లో హసన్ ఐదు, 10వేల మీటర్లలో స్వర్ణాలతోపాటు 1500 మీ.లలో కాంస్య పతకం తన ఖాతాలో వేసుకుంది.

# 'హై'వోల్టేజ్ జంప్

### జంప్ ఆఫ్‌లో కివీస్‌కు స్వర్ణం






సెయింట్ డెనిస్ (పారిస్) : పారిస్ ఒలింపిక్స్ పురుషుల హైజంప్ ఫైనల్ హోరాహోరీగా సాగింది. నిర్ణీత మూడు ప్రయత్నాలు ముగిసే సరికి న్యూజిలాండ్‌కు చెందిన హామిష్ కెర్, అమెరికా జంపర్ మెక్‌ఎవెన్ షెల్బీ ఇద్దరూ సమంగా 2.36 మీ. లంఘించారు. దాంతో విజేతను తేల్చేందుకు జంప్ ఆఫ్‌ను ఆశ్రయించాల్సి వచ్చింది. మొదటి రౌండ్ జంప్ ఆఫ్‌లో కెర్, మెక్‌ఎవెన్ 2.38 మీ. దూరానికి యత్నించి ఫెయిలయ్యారు. ఆపై 2.36 మీ.లను కూడా వారు లంఘించలేకపోయారు. చివరకు 2.34 మీ. దూరాన్ని 27 ఏళ్ల కెర్ లంఘించి స్వర్ణం దక్కించుకోగా, మెక్‌ఎవెన్ మిస్సయి రజతంతో సరిపెట్టుకున్నాడు. డిఫెండింగ్ చాంపియన్ ముతాజ్ బార్షిమ్ (ఖతార్) కాంస్య పతకం సాధించాడు. వాస్తవంగా..నిర్ణీత ప్రయత్నాలు ముగిసే సరికి ఇద్దరు జంపర్లు సమంగా ఉంటే..పరస్పర అంగీకారంతో ఇద్దరూ స్వర్ణ పతకాన్ని సంయుక్తంగా అందుకోవచ్చు. టోక్యో ఒలింపిక్స్ హైజంప్ ఫైనల్లో ఇలానే జరిగింది. కానీ ఈసారి సంయుక్తంగా స్వర్ణాలు అందుకునేందుకు షెల్బీ నిరాకరించాడు. ఒకవేళ అతను అంగీకరించివుంటే అతనికి స్వర్ణం వచ్చేది...మరోవైపు అమెరికా పసిడి పతకాల సంఖ్య 41కి పెరిగి..చైనాను దాటేసివుండేది.



### 16 ఏళ్ల చిన్నోడికి రికార్డు స్వర్ణం

పారిస్: ట్రాక్ అండ్ ఫీల్డ్‌లో స్వర్ణం సాధించిన పిన్న వయసు అమెరికా అథ్లెట్‌గా 16 ఏళ్ల క్విన్సీ విల్సన్ రికార్డులకెక్కాడు. 4 X400 రిలేలో అమెరికా పసిడి పతకం నెగ్గింది. తొలి రౌండ్‌లో ఫస్ట్ లెగ్‌లో పాల్గొన్న విల్సన్‌కు ఫైనల్లో పరిగెత్తే అవకాశం దక్కలేదు. కానీ, జట్టు సభ్యుడిగా అతడికి కూడా బంగారు పతకం లభించింది.

www.andhrajyothy.com

విజయవాడ సిటీ**

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 12-8-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

## కాబోయే అల్లుడు ఆరడుగులు ఉంటాడనుకున్నా!

5.55 అడుగుల సచిన్‌ను చూసి ఆశ్చర్యపోయా


మీ అమ్మాయిని పెళ్లి చేసుకుంటా అని చెప్పాడు

అప్పటికి అతడికి 19 ఏళ్లే.. రెండేళ్లు ఆగమన్నాం..

ఈ వ్యవధిలో మా ఇంటికి తరచూ వచ్చేవాడు

మీడియా అంతా అంజలి ఫొటో కోసం వెతికింది

క్రికెట్ దిగ్గజం సచిన్ అత్త అనాబెల్ మెహతా!



'మై పాసేజ్ టు ఇండియా' పుస్తకంలో ఆసక్తికర అంశాలు 9





తుంగభద్రలో కొట్టుకుపోయిన గేటు వద్ద భారీగా పోతున్న నీళ్లు

# 65 టీఎంసీలు కడలిపాలు

## కొట్టుకుపోయిన తుంగభద్ర గేటు

శనివారం రాత్రి డ్యాంలో 19వ గేటు ఎత్తుతుండగా తెగిన చైన్‌లింక్

వరద ప్రవాహంలో గేటు గల్లంతు.. హుటాహుటిన డ్యాం వద్దకు డీసీఎం శివకుమార్

ఏపీ ఎమ్మెల్యేలు కాల్వ, విరూపాక్ష, నిపుణులు కన్నయ్యనాయుడు, రాజేశ్ కూడా

స్టాప్‌లాక్ లేకనే ప్రమాదం.. నిల్వ 40 టీఎంసీలకు తగ్గితేనే కొత్త గేటు అమర్చే చాన్స్

దీంతో 65 టీఎంసీల విడుదలకు నిర్ణయం.. ఇప్పటికే నిండిపోయిన శ్రీశైలం, సాగర్..

పులిచింతల, ప్రకాశం బ్యారేజ్ కూడా.. పై నుంచి వచ్చే నీరు ఇక సముద్రంలోకే!

తీర గ్రామాల్లో ప్రమాద హెచ్చరికలు.. అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు ఆదేశం

మంత్రి నిమ్మల, అధికారులతో సమీక్ష.. ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలు సిద్ధం

### ఆంధ్ర సహా 3 రాష్ట్రాల రైతుల ఆనందం ఆవిరి

కర్నూలు/బళ్లారి/బెంగళూరు/అనంతపురం/అమరావతి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాలకు సాగు, తాగునీటి ప్రదాయిని తుంగభద్ర డ్యాం ఇప్పుడు ఖాళీ అవుతోంది. శనివారం రాత్రి డ్యాం 19వ గేటును ఎత్తుతుండగా చైన్‌లింక్ తెగిపోవడంతో గేటు కొట్టుకుపోయింది. దీంతో వరద నీరంతా వృథాగా పోతోంది. సదరు

మిగతా 12వ పేజీలో...

### నాగార్జున సాగర్ గేట్లు భద్రమేనా?

# సూపర్ డ్రామాలు

## నాడు వైసీపీ పెద్దలకు ఊడిగం.. నేడు కూటమి సర్కారుకు భజన

### టీడీపీకి వీరభక్తులమంటూ బురిడీ.. మేమూ వైసీపీ బాధితులమేనంటూ గగ్గోలు



### నకిలీ లెటర్లతో నమ్మించే యత్నాలు

కీలక పోస్టుల కోసం మేలిముసుగు

వేధింపుల నాటకాన్ని రక్తికట్టిస్తున్న వైనం

ఇప్పటికే కొందరికి ప్రాధాన్య పోస్టులు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

వైసీపీ నేతలతో అంటకాగిన కొందరు అధికారులు రాష్ట్రంలో అధికారం మారగానే కొత్త రంగు పులుముకుంటున్నారు. టీడీపీ, జనసేన నాయకులకు దగ్గర కావడానికి వీరు ఎంచుకున్న డ్రామా 'న భూతో న భవిష్యతి' అన్నట్లుగా ఉంది. గత ప్రభుత్వం, వైసీపీ నాయకులు తమను తీవ్రంగా వేధించారని, వారు చెప్పిన పనులు చేయలేదని తమపై ఉన్నతాధికారులకు, తాడేపల్లి ప్యాలె‌స్‌కు ఫిర్యాదులు చేశారని కొన్ని ఫేక్ లేఖలు, ఫిర్యాదు కాపీలను పుట్టించి వాటిని తమకు బాగా పరిచయమున్న టీడీపీ నేతల ద్వారా ఉన్నత స్థాయి నాయకత్వానికి పంపిస్తున్నారు. పెద్దల సానుభూతి పొందడం ద్వారా కీలక పోస్టింగ్‌లు దక్కించుకోవడమే లక్ష్యంగా పక్కా ప్రణాళిక అమలు చేస్తున్నారు. సాటి

మిగతా 11వ పేజీలో...

నిన్న మొన్నటి వరకూ వైసీపీ పెద్దలకు ఊడిగం చేశారు. వారి అడుగులకు మడుగులొత్తుతూ, వారు చెప్పిన దాని కల్లా తలూపారు. 'మీ మాటే మాకు శిరోధార్యం' అంటూ తు.చ. తప్పకుండా పాటించారు. వైసీపీ నేతల కళ్లల్లో ఆనందం చూడటం కోసం ప్రతిపక్ష నేతలను నానా హింసలు పెట్టారు. తీరా ఎన్నికల ఫలితాలు వచ్చి రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో ఇప్పుడు ప్లేటు ఫిరాయించి సరికొత్త డ్రామాకు తెరతీశారు. టీడీపీకి వీరభక్తులమనే ముసుగు వేసుకోవడంతో పాటు తాము కూడా వైసీపీ బాధితులమేనని, గత ప్రభుత్వంలో నానా అగచాట్లు పడ్డామని నమ్మబలుకుతున్నారు. తమపై టీడీపీ ముద్రవేసి వేధించారంటూ టీడీపీ నేతలను బురిడీ కొట్టించి కీలక పోస్టుల కోసం పైరవీలు చేస్తున్నారు. వీరిలో కొందరి ప్రయత్నాలు ఫలించి వారు కోరుకున్న పదవులు దక్కడంతో మిగిలిన వారు కూడా రెట్టించిన ఉత్సాహంతో కార్యరంగంలోకి దిగిపోతున్నారు. వీరిని చూసి 'ఏ ఎండకు ఆ గొడుగు పట్టడం అంటే ఇదేనేమో' అని సీనియర్ అధికారులు ముక్కున వేలేసుకుంటున్నారు.



ప్రమాదంలో ధ్వంసమైన కారు

## అతి వేగానికి ఐదుగురు బలి

తమిళనాట ఘోర ప్రమాదం

ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్న కారు

మృతుల్లో నలుగురు ఏపీ విద్యార్థులు 10

తీవ్ర గాయాలపాలైన మరో ఇద్దరు

తమిళనాడు విద్యార్థి కూడా దుర్మరణం

## మాణిక్కం ఠాగూర్‌తో షర్మిల భేటీ 11

కాంగ్రెస్ కమిటీల నియామకంపై చర్చ

నేడు, రేపు ఢిల్లీలోనే ఏపీ చీఫ్ మకాం

సోనియా, రాహుల్‌తో సమావేశం

## దువ్వాడ ఎపిసోడ్‌లో మరో ట్విస్ట్!

ఆగి ఉన్న కారును ఢీకొట్టి మాధురి ఆత్మహత్యాయత్నం

విశాఖపట్నం కేజీహెచ్‌కు, అక్కడి నుంచి అపోలోకు తరలింపు 7

మొదట పలాస ఆస్పత్రిలో హైడ్రామా

పోలీసులు ఇబ్బంది పెట్టారంటూ ఆరోపణ

# 'బ్యాండ్' వేసినా చర్యలేవీ?

వైసీపీ హయాంలో టీడీఆర్ బాండ్ల స్కాం

అప్పటి ఉన్నతాధికారి నేతృత్వంలో దోపిడీ

పట్టణ మాస్టర్ ప్లాన్ మాటున మస్కా..

భూసేకరణ జరగకుండానే బాండ్లు జారీ

కప్పిపుచ్చుతున్న అప్పటి అధికారులు

వైసీపీ నేతల అడ్డగోలు దోపిడీపై మౌనం

కొత్త సర్కారు వచ్చినా వారిపై చర్యలు శూన్యం

సమగ్ర విచారణ చేయిస్తే మరిన్ని వెలుగులోకి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

టీడీఆర్ బాండ్ల జారీ.. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అతిపెద్ద కుంభకోణాల్లో ఇది కూడా ఒకటి! ఈ టీడీఆర్ బాండ్ల పేరుతో వైసీపీ నేతలు పురపాలక, నగరపాలక సంస్థల్లో భారీ అవినీతికి పాల్పడ్డారు. విశాఖపట్నం, కాకినాడ, విజయవాడ, గుంటూరు, తిరుపతి, తణుకు పట్టణాల్లో టీడీఆర్ బాండ్ల జారీ పేరిట జరిగిన దోపిడీలు వెలుగులోకి వచ్చాయి. అప్పటి ఉన్నతాధికారి నేతృత్వంలో జరిగిన ఈ భారీ దోపిడీపై కొత్తగా ఏర్పాటైన

మిగతా 7వ పేజీలో...

## ఆర్టీఏలో దుష్ట చతుష్టయం!

కేంద్రం చెక్ పోస్టులు తీయించేసినా చెక్‌పాయింట్ల పేరుతో ఆ నలుగురి స్కెచ్

సంపద తరలిపోతోందంటూ ఒప్పించే ఎత్తు.. దోపిడీకి మాస్టర్ ప్లాన్ సిద్ధం

అవినీతికి బ్రేకులేస్తామంటున్న మంత్రి.. నేడు సీఎం సమీక్ష తర్వాత కీలక నిర్ణయం

ఆ నలుగురిలో ఒకరు సీమలో పెద్దిరెడ్డి కుడిభుజం.. మరొకరు భారతి విధేయుడు

గోదారిలో ఏసీబీ కేసులున్న అధికారి, మంత్రిపేషీలో యువ ఉద్యోగి.. 11

# జేపీసీతో నిగ్గు తేల్చాలి

సెబీ చైర్‌పర్సన్‌పై హిండెన్‌బర్గ్ ఆరోపణల మీద దర్యాప్తు జరపాలి

మాధవి రాజీనామా చేయాలి: విపక్షాలు

సుప్రీం సుమోటోగా స్వీకరించాలి: ఖర్గే

జేపీసీ అంటే మోదీకి భయం: రాహుల్

తక్షణం దర్యాప్తు జరిపించాలి: ఏచూరి

ఆర్థిక వ్యవస్థల హైజాక్: ఆర్జేడీ

ఇదంతా విదేశీ క్రుట.. విపక్షాలు వారికి సహకరిస్తున్నాయి: బీజేపీ

### ఆరోపణలు పచ్చి అబద్ధాలు

మా ఆర్థిక వ్యవహారాలు తెరిచిన పుస్తకం

అదానీ గ్రూప్‌లో పెట్టుబడుల్లేవ్: సెబీ చీఫ్



న్యూఢిల్లీ, ఆగస్టు 11: సెబీ చైర్‌పర్సన్ మాధవి బుచ్‌కు, ఆమె భర్త ధావల్ బుచ్‌కు విదేశాల్లో ఉన్న అదానీ కంపెనీల్లో వాటాలు ఉన్నాయంటూ అమెరికా షార్ట్‌సెల్లింగ్ సంస్థ హిండెన్‌బర్గ్ తాజాగా చేసిన ఆరోపణలపై దర్యాప్తునకు సంయుక్త పార్లమెంటరీ కమిటీని (జేపీసీ)ని ఏర్పాటు చేయాలని విపక్షాలు ముక్తకంఠంతో డిమాండ్ చేశాయి. స్వయంగా తన మీదే ఆరోపణలు వచ్చినందున మాధవి సెబీ చైర్‌పర్సన్ పదవి నుంచి వైదొలగాలని పేర్కొన్నాయి. ఈ భారీ

మిగతా 9వ పేజీలో...

## నవలా శిల్పం

తెలుగు వచన సాహిత్యం గత రెండు దశాబ్దాలుగా కథా ప్రక్రియ చుట్టూనే తిరుగుతున్నప్పటికీ, కొందరు రచయితలు ప్రత్యేకంగా నవల మీద కూడా కృషి చేస్తున్నారు. వారి చేత నవలా రచనలో ఉండే ఆర్ట్ క్రాఫ్ట్ అంశాలపై మాట్లాడించేందుకు ఉద్దేశించినదే ఈ 'నవలా శిల్పం' శీర్షిక. - వివిధ

# గొప్ప నవలలు రాసినట్టుండవు. పుట్టినట్టు ఉంటాయి.

- మధురాంతకం నరేంద్ర



నాకు కథ రాయడం శ్రమ. రాసేసిన తర్వాత గొప్ప రిలీఫ్ దొరుకుతుంది. నవల రాసేటప్పుడు చాలా సంతోషంగా ఉంటుంది. నవల రాస్తున్నంతసేపూ విశాల మైదానంలో అరేబియన్ గుర్రం ఎక్కి దౌడు తీసినట్టుగా ఉంటుంది.

"శాస్త్రవేత్తలు, చరిత్రకారుల వద్ద లేని ఆయుధాలు సాహిత్యకారుల వద్ద ఉన్నాయి. అవి సృజనాత్మక ఆయుధాలు. అందుకే శాస్త్రవేత్తలు, చరిత్రకారులు చేయలేని పనిని వాళ్ళు సమర్థవంతంగా చేయగలరు. తమ రచనల ద్వారా జీవన సత్యాల్ని చెప్పగలరు" అంటారు మధురాంతకం నరేంద్ర. ఐదు దశాబ్దాల సాహితీ ప్రయాణంలో కథలు, నవలలు, నాటికలు, వ్యాసాలను సృజించారు. రచయిత కన్నా రచన గొప్పదనే సూత్రాన్ని పాటిస్తూ సాహితీ వ్యాసంగాన్ని కొనసాగిస్తున్నారు. ఇది ఆయన నవలా రచన గురించి జరిపిన సంభాషణ.

**ఇన్నేళ్ల సాహితీ ప్రయాణంలో పదుల సంఖ్యలో కథలు రాశారు. నవలలు మాత్రం ఆరే రాశారు. కారణం?**

సాహితీ ప్రక్రియల్లో కథ, నవల అక్కచెల్లెళ్ళ లాంటివి. అయితే రెండింటికీ చాలా భేదం ఉంది. 50 ఏళ్లలో 100 దాకా కథలు రాశాను. నవలలు తక్కువ రాయడానికి కారణం సమయం లేకపోవడం. నవల రాయాలంటే రాసే అంశం గురించి చాలా తెలుసుకోవాలి. చాలా ఫోకస్డ్‌గా ఉండాలి. ఆ పాత్రలతోపాటు ప్రయాణించాలి. మమేకం కావాలి. ఇదంతా కుదిరినప్పుడే నవలా రచన ముందుకు సాగుతుంది. కొన్ని రచనలు యాక్సిడెంటల్‌గా జరుగుతాయి. 'మనోధర్మపరాగం' అలాంటిదే! ఆ నవల రాయడానికి ఆరునెలల ముందు అలాంటి నవలను రాయగలనని నాకూ తెలియదు. ఆ నవల రాయడానికి నాకు ఏడాది పట్టింది. ఆ సమయంలో పరిశోధన ద్వారా ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. అంతేగాదు, నాదైన జీవితంలోంచీ, మా ప్రాంతాన్ని గురించీ విషయాల్ని తోడి తీసుకోగలిగాను. కొత్త కొత్త వివరాలు తెలిసినప్పుడు చాలా ఆనందపడ్డాను. నవలలోని 30 అపురూపమైన స్త్రీ పాత్రలతో అంతకాలం కలిసి జీవించడమనే అవకాశాన్ని పొందాను.

**నవల, కథ.. రెండింటిలో ఏది రాయడంలో మీకు సంతృప్తి?**

నవలైనా, కథైనా జీవితం కరుణిస్తేనే రాయగలం. జీవితం ముందు మనమెంత? నాకు కథ రాయడం శ్రమ. రాసేసిన తర్వాత గొప్ప రిలీఫ్ దొరుకుతుంది. నవల రాసేటప్పుడు చాలా సంతోషంగా ఉంటుంది. నవల రాస్తున్నంతసేపూ విశాల మైదానంలో అరేబియన్ గుర్రం ఎక్కి దౌడు తీసినట్టుగా ఉంటుంది. అయితే ఆ గుర్రం పక్కదారులు పట్టకుండా సరైన దారిలో ప్రయాణించేలా చూసుకోవడం రచయిత పని. రచయిత ప్రాథమిక బాధ్యత కథ చెప్పడం. కథ సరిగ్గా చెప్తున్నామా, ఎక్కడైనా దారి తప్పుతోందా అనే స్పృహ రచయితకు ఉండాలి.

**మీరు రాసిన 'భూచక్రం' 'కొండకింద కొత్తూరు' లాంటి నవలల్లో అంశాలు సార్వజనీనమైనవి, కథ మాత్రం చిత్తూరు జిల్లాలోనే నడుస్తుంది. ఎందుకలా?**

అదేమీ కొత్త విషయం కాదు. అనేకమంది రచయితలు చేసిందే! ప్రపంచంలోని ప్రతి రచయితా ప్రాంతీయ రచయితే. టాల్‌స్టాయ్, దోస్తోవ్‌స్కీ, హెమ్మింగ్వే లాంటి వాళ్ల రచనల్లోకూడా వాళ్ల ప్రాంతీయతే కనిపిస్తుంది. ఆ రచనలే విశ్వవ్యాప్తం అవుతాయి. సృజనాత్మక రచయితకు ప్రాంతీయత బలం. Provincialism is a Strength to Writer.

**గొప్ప నవల ఎలా ఉండాలని మీ అభిప్రాయం?**

నేను చదివిన గొప్ప నవలలన్నీ రాసినట్టుండవు. పుట్టినట్టు ఉంటాయి. శరత్ నవలలు ఇందుకు మంచి ఉదాహరణ. ఆయన ఏ రచనా నిరుపయోగంగా రాయలేదు. తెన్నేటి సూరి రాసిన 'చంఘీజ్‌ఖాన్', వడ్డెర చండీదాస్ 'హిమజ్వాల', చలం 'జీవితాదర్శం', కేశవరెడ్డి 'మూగవాని పిల్లనగ్రోవి' నవలలు రాసినట్టు ఉండవు, పుట్టినట్టు అనిపిస్తాయి. గొప్ప క్లాసిక్‌గా మిగిలే పుస్తకాలు ఒక మీడియంగా మారి, మనల్ని మనం పరిశీలించుకునేందుకు ఉపయోగపడతాయి. ఒక్కోసారి గొప్ప నవల రాసేసిన రచయిత ఆ తర్వాత మళ్లీ అంత స్థాయిలో రాయలేక ఇబ్బంది పడే అవకాశం కూడా ఉంది. William Golding అనే రచయిత 'Lord of the Flies' అనే నవల రాశారు. అది ఆయన తొలి నవల. దానికే ఆయనకు నోబెల్ బహుమానం వచ్చింది. ఆ తర్వాత మళ్లీ ఆ స్థాయిలో మరో నవల రాయలేక ఆయన చాలా ఇబ్బందిపడ్డారు.

**ఇటీవల విడుదలైన మీ నవల 'దాయాదుల తోట'కు నేపథ్యం ఏమిటి?**

నేను పుట్టి పెరిగిన ప్రాంతంలోని సామాజిక జీవనం గురించి చెప్పాలని ఒక కథ రాశాను. చెప్పవలసిన అంశాలు కథలో ఇమడకపోవడంతో దాన్ని విస్తృతం చేయవలసి వచ్చింది. ముందుగా సర్వసాక్షి కోణంలో నవల రాశాను. పూర్తయ్యాక చదివితే వస్తువిస్తృతి పెరిగిపోయి కొంత కలగాపులగంగా కూడా తోచింది. ఆ తర్వాత మళ్లీ మొత్తం భిన్నమైన దృక్కోణంలో తిరగరాశాను. నవలలో మొత్తం 10 పాత్రలు. ఎవరి కథ వాళ్ళు చెప్పుకుంటారు.

**ఈ నవలలో మీ ప్రాంతంతోపాటు ఇంకా చాలా ప్రాంతాలు వస్తాయి కదా?**

నవలలో ఒక ప్రాంతం గురించే రాయాలనుకున్నాను. చిత్తూరు జిల్లా గురించీ, తొండనాడు గురించీ. తిరుపతి గురించి రాయాలంటే చుట్టుపక్కల ప్రాంతాల గురించి రాయాలి. ఇక్కడుండే వారికి మిగిలిన ప్రాంతాలతో తప్పకుండా సంబంధం ఉంటుంది. ముఖ్యంగా కడప జిల్లాతో. అలా నవలలోకి కడప వచ్చింది. ఆ తర్వాత అనంతపురం, కర్నూలు వచ్చాయి. కర్నూలు దాకా వచ్చిన కథ హైదరాబాదును కూడా చేరింది. ఇటువైపు చెన్నై, తిరువణ్ణామలై, బెంగళూరు, హోసూరు ప్రాంతాలు కూడా నవలలోకి వచ్చేశాయి.

**తెలుగు సాహితీ విమర్శ గురించి మీ అభిప్రాయం?**

Objective Study అనేది లేకపోతే రచయితలకు చాలా ప్రమాదం. విమర్శ అంటే కేవలం తిట్టడం, పొగడటం కాదు, ఒక రచనను విమర్శనాత్మకంగా చూడటం. రవీంద్రనాథ్ ఠాగూర్‌ని విశ్వకవి అంటే సరిపోదు. ఆయన కథకుడిగా, నాటక రచయితగా చాలా గొప్పవాడు. ఆయన రచనలు చదివి ఆ విషయం చెప్పాలి. విదేశాల్లో కొందరు ప్రముఖ రచయితలు బతికుండగానే వాళ్ల రచనల మీద '20th Century Interpretations' అంటూ పుస్తకాలు వచ్చాయి. అక్కడి విమర్శకులు రచయితల్ని పూజించే పీఠంపైన కూర్చోబెట్టరు. వీలైనంతగా వారి రచనల్ని విమర్శించి, మరింత మెరుగ్గా మార్చేందుకు ప్రయత్నిస్తారు. మన దగ్గర అలాంటి సాధన జరగాలి. రచయిత తనకు తెలిసిన సత్యాన్ని రచన ద్వారా ధైర్యంగాచెప్పాలి. ఏమాత్రం మొహమాటం లేకుండా విమర్శను స్వీకరించాలి. దానికి తొందరపడి సమాధానం ఇచ్చేయకుండా స్థిమితంగా ఆలోచించాలి.

**కొత్తగా రాస్తున్నవారు మెరుగ్గా రాయాలంటే?**

బాగా చదవాలి. అదే అతి ముఖ్యమైన విషయం. సాగుతున్న జీవితాన్ని అప్రమత్తతో గమనిస్తూ ఉండాలి. సాహిత్యంలో పెద్ద ప్రమాదం ఏంటంటే, చదవకుండా మాట్లాడటం. ఏ రచననైనా ఓపెన్ మైండ్‌తో చదవాలి. చదవకముందే ఏ అభిప్రాయానికీ రాకూడదు. కొన్ని నవలలు ఒక వయసులో అర్థం కావు. మరికొన్ని ఒక వయసు దాటాక అర్థమవుతాయి. మంచి పుస్తకం పాఠకుడి పరిపక్వతను కొలిచే సాధనం. ఒకే పాఠకుడికి అది వివిధ దశల్లో వేర్వేరు రకాలుగా అర్థమవుతుంది.

ఇంటర్వ్యూ: ■ విశీ (వి. సాయివంశీ)
✆ 9010866078



## మాయమైన బ్రతుకులు

అట్టుగ దులుపుతున్నప్పుడు
పాతబడిపోయిన..
నాగలి, నక్కు, కత్తి, పార కనబడి
గతం గుర్తుకొస్తుంది
ఒకప్పుడు మేమూ రైతులమేనని..

త్రోవంట వెళ్తున్నప్పుడు
ఎక్కడో దూరాన పొలంలో
పిల్ల జల్లా శ్రమైక్య సౌందర్యంతో కనబడి
గతం కళ్ళముందు మెదలాడుతుంది
ఒకప్పుడు మేమూ ఇంతేనని

ఒక్కోసారి టీవీలో, ఏదో ఒక సినిమాలో
పచ్చని పొలాలు, పట్టెడు సంసారం చూపిస్తే
ఉన్నపళంగా ఉసురుమనిపిస్తుంది
ఇదంతా మా నుండి
ఎప్పుడు లాక్కుపోయారోనని

కడుపు కాలి షాపింగ్ మాల్‌కు వెళ్తే
అక్కడ కనిపిస్తుంది..
మోసపోయింది ఇక్కడేనని!
మాయమైనవన్నీ మార్కెట్లో బంధీ అని!

■ వినోద్ కుత్తుం
✆ 9634314502

సోమవారం 12 ఆగస్టు 2024

వివిధ

vividha@andhrajyothy.com

సాహిత్య వేదిక


బొమ్మలు: అక్బర్

## చదువు ముచ్చట

# చదివినవే మళ్ళీ మళ్ళీ చదువుతూ వుంటాను

■ ఎం.ఎస్.కె. కృష్ణజ్యోతి





"తాడి ప్రకాష్ 'ఏలూర్ రోడ్' ఒక తరానికి చెందిన చరిత్ర గమనాన్ని సూక్ష్మంగా పట్టి ఇస్తుంది."

**ఆఖరుగా ఏ పుస్తకాన్ని చదివి బాగా ఇష్టపడ్డారు?**

ఇటీవలి కాలంలో రకరకాల పుస్తకాలు చదువుతూవున్నాను. వాటిలో, తాడి ప్రకాష్ 'ఏలూరు రోడ్' నాకు బాగా నచ్చింది. ఇందులో నాకు నచ్చిన విషయాలు, ప్రకాష్ వచనం చదువరులను మంత్రముగ్ధులను చేస్తుంది. ఈ పుస్తకశీర్షిక, విజయవాడతో పాటు ఏలూరుని కూడా స్ఫురణకు తెస్తుంది. ఈ రెండు ప్రాంతాలతో నాకు అనుబంధం వుండటం రెండో ఆకర్షణ. ఏలూరు నా స్వస్థలం. విజయవాడ నేను కోరిసాధించిన మజిలీ. ఏలూర్ రోడ్, ఒక తరానికి చెందిన చరిత్ర గమనాన్ని సూక్ష్మంగా పట్టి ఇస్తుంది. చరిత్ర అధ్యాపకురాలిగా, ఆ కోణంలో కూడా ఏలూర్ రోడ్ పుస్తకం నాకు బాగా నచ్చింది.

**బాల్యంలో మొదటిసారి ఏ పుస్తకాన్ని ఇష్టంగా చదవటం గుర్తుంది?**

స్కూల్‌లో చేరకముందు, గురజాడ పుత్తడిబొమ్మా పూర్ణమ్మ విని నేర్చుకున్నాను. రెండో తరగతి పూర్తి అయేపాటికి మా నాన్నగారు చదవడం నేర్పించారు. మూడో తరగతి నుంచీ ఎక్కువ నిడివి వున్న కథలు చదవడం ప్రారంభించాను. నాలుగో తరగతిలో పిల్లల కోసం వచ్చే బుల్లి నవలలు చదివాను. ఎనిమిదో తరగతికి వస్తూనే సీరియస్ సాహిత్యం అంటుకుంది. బాలజ్యోతిలో, 'తీపి రొట్టెలు' అని ఒక కథ నాకు బాగా జ్ఞాపకం వున్న నా మొదటి పెద్ద పఠనం. బహుశా అది 1982-83 మధ్యకాలంలో ఏదో ఒక బాలజ్యోతి పుస్తకంలో ప్రచురితం అయింది. అరబ్ దేశ వ్యాపారి, ఒక అందమైన మంత్ర గత్తె, ఆమె దగ్గర చెక్క పెట్టెలో చిన్నచిన్న బొమ్మలు రాత్రిపూట నేలని దున్ని క్షణాల్లో గోధుమలు పండించి రొట్టెలు చెయ్యడం, ఆ రొట్టెలు తిన్న వ్యాపారులు గుర్రాలుగా మారిపోవడం, ఇలా సాగే కథ అది. నాకు భలే అద్భుతంగా అనిపించింది. ఇప్పటికీ ఆ కథ నాకు నచ్చుతుంది. యవ్వనంలో చలం మ్యూజింగ్స్ నిత్య పారాయణ గ్రంథం!

**మీ పఠనాభిరుచి కాలంతోపాటు ఎలా మారింది?**

నా పఠనాభిరుచి కాలంతోపాటు పెద్దగా మారలేదు. చదివినవే మళ్ళీ మళ్ళీ చదువుతూ వుంటాను. తీపి రొట్టెలు కథ ఎంజాయ్ చేసిన పాపతనమే ఇప్పటికీ వుంది. ఆర్కే. నారాయణ్ స్వామీ అండ్ హిస్ ఫ్రెండ్స్, నామిని మిట్టూరోడి కథలు, ఖదీర్ పోలేరమ్మ బండలాంటి పిల్లలు ప్రధాన భూమిక పోషించే పుస్తకాలు ఎక్కువ నచ్చుతాయి. సీరియస్ లిటరేచర్ విషయంలో మొదటి నుంచీ క్లాసిక్స్ ఇష్టపడతాను.

**మీ నమ్మకాల్ని, దృక్పథాన్ని ప్రభావితం చేసిన రచయిత?**

చలం, కొడవటిగంటి కుటుంబ రావు యవ్వనంలో నా ఆలోచనని ప్రభావితం చేశారు. మార్క్ ట్వైన్, ఆస్కార్ వైల్డ్ రచనల ద్వారా మనిషి స్వభావం, పరిమితుల గురించి సాక్షాత్కారం కలిగింది.

**సాహిత్యంలో మీకు బాగా నచ్చిన పాత్ర ఏది? ఎందుకు?**


హకల్ బెరిఫిన్ నాకు ఎప్పటికీ నచ్చే పాత్ర. తోటి మనిషిని ప్రేమించడం, ఘోర భీకర పరిస్థితులను సైతం ధైర్యంగా ఎదుర్కొని నిలబడటం, మూస మానవ ధోరణికి భిన్నంగా ఆలోచించడం హకల్ బెరిఫిన్ ప్రత్యేకతలు.

**ఏ గత కాలం రచయితనైనా కలిసి మాట్లాడగలిగితే ఎవరితో, ఏం మాట్లాడతారు?**

టైం మెషీన్‌లో లేదా ఏ ఇతర విధంగానో వెనక్కివెళ్లి మాట్లాడే అవకాశం వస్తే, నేను బెంగాలీ రచయిత శరత్ చంద్రని కలవడానికి ఇష్టపడతాను. అలాంటి రచయిత ఎవరైనా దొరికితే, పెళ్లి చేసేసుకోవాలి అనుకునేదాన్ని చిన్నప్పుడు! సాధారణమైన మధ్యతరగతి కుటుంబ విషయాలని ఆయన ఎంతో ఆసక్తికరమైన కథల్లాగా మౌల్డ్ చేసేవారు. మానవ సంబంధాల గురించి అంత విస్తృతంగా రాయడానికి కావలసిన సరంజామా ఆయన ఎక్కడినుంచి సేకరించారో నాక్కూడా చెప్పమని అడుగుతాను. ప్రేమచంద్‌ను కూడా కలవాలి. ఆయన చేతులు ఒకసారి పట్టుకుని కళ్ళ కద్దుకుని దణ్ణం పెట్టుకోవాలి. ఆయన రచనలు, ఉదాహరణ నిర్మల లాంటివి చదివి ఆ వాతావరణంలోకి మానసికంగా వెళ్ళిపోయి, రెండు మూడు రోజులు తీవ్ర విచారంలో మునిగి పోయేదాన్ని; ఆయన హాస్య కథలు అంతే ఆనందం కలిగించాయి; రెండు పరస్పర విరుద్ధ భావావేశాలని ఒకే మనిషి ఒకే పెన్నుతో ఎలా సృష్టించారు అని అడిగి వచ్చేస్తాను.

**రచన విషయంలో మీకు దొరికిన మంచి సలహా, మీరు ఎప్పుడూ పాటించేది?**

ప్రత్యేకంగా ఒక సలహా అని కాదు కానీ, పూర్వ రచనలు, మంచి సమకాలీన రచయితల నుంచి నేను నేర్చుకున్న కిటుకు, చెప్పే విషయం ఏదైనా, సులువైన పదాల్లో, చమత్కారంగా చెప్పాలి. గంభీరంగా వుండే వ్యక్తీకరణలు, వాక్యాలు చదివేవారి ఆసక్తిని చంపేస్తాయి. ■



AKBAR

## సమయం

ఆ వెన్నెల రాత్రి ఆకాశంలో చుక్కల్లా
మా పొలంలో వడ్ల రాశి
చెట్లు ఆలకించే సమయం
అప్పుడు
మేము ఇలా పాటయ్యామ్

కురిసిన వానకు, నిండిన చెరువు
చేపల దాహం తీరాక
మిగిలిన నీళ్లే పంటకు ఉగ్గుపాలు

మెల్లగా వెన్నెల అందుకున్న చంద్రుడు
మా గుండెల్లా వెలుగుతున్నాడు
అటు ఇటు చెక్కర్లు కొట్టే పేరు తెలియని పక్షి
పొడుపు కథలా అరుస్తోంది
ఎక్కడో
జనక జనక జజ్జనక సవారీ దెబ్బ
మోగుతున్న తప్పెటకు
పాదం కింద సెగ
అప్పుడే మేం ఆటయ్యామ్

ఏ దుఃఖం
కల్లం వైపు రాలేదు
ఏ కష్టమూ లోపల కదలడం లేదు
ఏ సూచీకలు అంచనా కట్టలేని సంతోషం
మనిషి ఇట్టే ఉండాలి, మనసు ఇట్టే ఉండాలి

మాయలేదు, మరణం లేదు
ముసురుకునే చీకటి లేదు
అప్పుడు మేం
మనుషులవుతున్నాం

■ గోపాల్ సుంకర
✆ 94926 38547

## మూడు ప్రశ్నలు

# యువతరాన్ని భ్రమల వాతావరణంలోకి నెడుతున్నారు

■ గూండ్ల వెంకటనారాయణ



**యువ రచయితలపై సాహితీ పెద్దలు చాదస్తాన్ని రుద్దుతున్నారు అన్న అర్థంలో ఈమధ్య మీరు ఫేస్‌బుక్‌లో ఒక పోస్ట్ రాశారు. ఏమిటి మీ దృష్టిలో ఈ చాదస్తం?**

ఆ మాట అనటానికి కారణం వాళ్లింకా 50, 60ల్లోనే బతుకుతున్నారని నాకనిపించటం. ఎందుకంటే- మొదటగా వాళ్ళ కాలంలో శ్రీశ్రీ, చలం, బుచ్చిబాబు వంటి రచయితలు గొప్ప రచయితలుగా పేరు సంపాదించేశారు. వాళ్ళ టైమ్‌కి అందరి నోళ్లలో నానుతూ ఉన్నారు. దానివల్ల ఇప్పటి పెద్దవాళ్ళు అయిన అప్పటి పిల్లలు వాళ్ళనే చదివి తరించి వాళ్ళ జాడ్యం లోనే ఉన్నారు. ఆ జాడ్యం అంటువ్యాధిలా ఇప్పటి తరానికి కూడా అందిస్తున్నారు.

ఇప్పటి తరం ముఖ్యంగా ఎదుర్కొంటున్న విమర్శల్లో ఒకటి వాళ్ళు గత సాహిత్యాన్ని చదవటం లేదూ అన్నది. కానీ ఇప్పటి తరం ఏ గత సాహిత్యాన్ని చదవటం లేదనీ వీళ్ళ బాధ? వీళ్ళు ఎవరినైతే ఆరాధించారో వాళ్ళని ఈ తరం ఆరాధించటం లేదని. తర తరానికి సాహిత్య పద్ధతులు మారతాయి. ఆలోచనలు మారతాయి. వీళ్ళ మనసులో ఉన్న అసలు ఉద్దేశం ఏమిటంటే వీళ్ళ పుస్తకాలు చదివి, వీళ్ళని గురువులుగా భావించాలి అని. ఇంకప్పుడు సాహిత్యం మిగలదు. గురు శిష్యుల కోలాటం మాత్రమే ఉంటుంది. కొత్త తరం విమర్శ తీసుకోదూ అనే ఇంకో మాటను వింటూ ఉంటా. అసలు ముందు ఈ మాట వాడేవాళ్లు విమర్శ తీసుకుంటే కదా కొత్త తరం తీసుకునేదీ లేనిదీ!

ఇంకో సమస్య శైలీ, శిల్పం అనేవాటి గురించి. ఈ శైలీ, శిల్పం అంటే ఏమిటి? వల్లంపాటి కథాశిల్పం పుస్తకాన్ని ఫాలో కావటమా? లేకపోతే కథలు ఎలా రాస్తారనే ఇతర విశ్లేషణా పుస్తకాలని ఫాలో కావటమా? నేను ఇల్యా ఎహ్రెన్‌బర్గ్ రాసిన 'రచయితా శిల్పమూ' అనే పుస్తకమూ, రాల్ఫ్ ఫాక్స్ రాసిన 'నవల - ప్రజలు' అనే పుస్తకాలు చదివాను. అందులో రష్యన్, యూరోపియన్ సాహిత్యం గురించి మంచి విమర్శ ఉంటుంది. ఇవి కదా మనం మాట్లాడాల్సింది.

**"వీళ్ళ పుస్తకాలు చదివి వీళ్ళను గురువులుగా భావించలన్న" ఉద్దేశం... ఇలాంటి వాతావరణం నిజంగా ఉన్నదా?**

ఉన్నది. వివిధ ప్రాంతాల నుంచి, వివిధ కులాల నుంచి కొత్తగా రచయితలు రావటం మనం చూస్తున్నాం. అయితే ఇప్పుడు ఉన్న మన వాతావరణం వాళ్ళకి తప్పుడు అభిప్రాయాలను ఎక్కిస్తున్నది: 'యువ పురస్కారం', లేకపోతే ఏదైనా అవార్డు, లేదా పెద్ద సంకలనాలలో రచన రావటం.. ఇవే ముఖ్యమైన విషయాలన్న భ్రమ కల్పిస్తున్నది. కొత్త తరం ఇలాంటి వాటికి స్టక్ అయిపోయి- వీటిని పొందాలంటే ఎవరో ఒకరి ఆశ్రయం కావాలి కాబట్టి, అందుకోసం అప్పటికే సాహిత్యంలో స్థిరపడినవాళ్ళ దగ్గరకు వెళ్తున్నారు. వారేమో ప్రోత్సహిస్తున్నాం అన్న పేరుతో కొత్తగా రచన చేస్తున్నవారిని వాళ్ళ భజనపరులుగా మార్చుకుంటున్నారు. అందరూ ఇలా చేయకపోవచ్చు. కానీ జరుగుతున్నది ఇదే. పెద్దవాళ్ళకి వాళ్ళ రచనలు చదివి పొగిడేవాళ్ళు కావాలి. ఈ కాలంలో అంత తీరిక ఎవరికుంది. అందుకని గ్రామ్ ఫోన్ రికార్డు లాంటి కొత్త తరం కావాలి. నేనేం అనుకుంటానంటే- రచయిత మొదట స్వతంత్రుడు అయ్యాక సాహిత్యం రాయాలి.

**శిల్పం, శైలి... వీటిపై మీ మాటల్లో వ్యతిరేకత ఎందుకు వ్యక్తమవుతుంది?**

ఒక రచన గురించి మాట్లాడుతూ ఉన్నప్పుడు ఏ కొలతల్లో పాత్ర చిత్రీకరణ ఉండాలి, ఏ కొలతల్లో వాతావరణ చిత్రణ ఉండాలి అన్నట్లు శైలీ శిల్పాల గురించి ప్రస్తావిస్తేనే నాకు నచ్చదు. మనమేమన్నా తూనికరాళ్లతో వ్యాపారం చేస్తున్నామా? ఈ శైలి, శిల్పం అనే వాటిని అర్థం చేసుకోవటానికి చాలా పుస్తకాలు చదివాను. కానీ అదేదో మిథ్‌లాగా నాకిప్పటికీ వీటి వ్యవహారం బోధపడలేదు.

నిజానికి కథ రాస్తున్నప్పుడు రచయిత మనసులో తను ఏ విషయం గురించి రాస్తున్నారో స్పష్టత ఉంటే చాలు. అది లేనప్పుడే ఈ గందరగోళం అంతా ఏర్పడుతుంది. నేనో వ్యక్తి గురించి రాసేటప్పుడు అతని జీవితం మొత్తం నాకు తెలిసిందై ఉండాలి. కాసేపు ఉండే పాత్రయినా... జీవితం నా చేతిలో ఉన్నాక కథ ఎలా ఏర్పడుతుందో తెలీకుండా ఉంటుందా!? శైలి, శిల్పం అనేవి పరిశోధక విద్యార్థులకీ, కథలు ఎలా రాయాలో నేర్పించాలి అనుకునేవాళ్లకీ అవసరం. రచయితకు కాదు. ■

### బాలల నవలలకు ఆహ్వానం

తానా-మంచి పుస్తకం ఆధ్వర్యంలో బాలల నవలలకు ఆహ్వానం పలుకుతున్నాం. ఈ రచనలు నవల, సచిత్ర నవల లేదా కామిక్ స్ట్రిప్/ గ్రాఫిక్ నవల, కథా గుచ్ఛం రూపంలో ఉండాలి. (కథా గుచ్ఛంలో పాత్రలు మారకుండా కథలు స్వతంత్ర ఎపిసోడ్‌లలాగ ఉండాలి). మోడ్రన్ డే అడ్వెంచర్, మిస్టరీ, హాస్యం, సైన్స్ ఫిక్షన్, కమింగ్ ఆఫ్ ఏజ్ అంశాలను తీసుకుని రాయవచ్చు. నవంబర్ 30, 2024లోపు అందేలా రచనలు పంపాలి. యూనికోడ్/ అను ఫాంట్‌లలో టైప్‌చేసిన ప్రతుల్ని tana.mp.balalanavalalu2025@gmail.comకు పంపాలి. రాతప్రతులను చిరునామా: మంచి పుస్తకం, 12-13-439, వీధి నెం.1, తార్నాక, సికింద్రాబాద్ 500017కు పంపాలి. వివరాలకు: పి భాగ్యలక్ష్మి 94907 46614, వాసిరెడ్డి నవీన్ 98493 10560కు ఫోన్ చెయ్యవచ్చు. ఎంపికైన రచనలను తానా - మంచి పుస్తకం కలిసి ప్రచురిస్తాయి.

జంపాల చౌదరి

### మద్దూరి నగేష్ బాబు సమగ్ర కవిత్వం

ఖాజా, కోయి కోటేశ్వర రావు సంపాదకత్వంలో బహుజన కెరటాలు ప్రచురించిన మద్దూరి నగేష్ బాబు సమగ్ర కవిత్వం ఆవిష్కరణ మద్దూరి జయంతి సందర్భంగా ఆగస్ట్ 15 సా.5గంటలకు ఒంగోలు, మల్లయ్య లింగం భవన్‌లో జరుగుతుంది. అధ్యక్షత ఆత్మకూరి బాలచెన్నయ్య, ముఖ్య అతిథి యం.యం. వినోదిని, వక్తలు కత్తి కళ్యాణ్, ఎజ్రా శాస్త్రి, నూకతోటి రవికుమార్, శ్రీరామకవచం సాగర్, సజ్జా వెంకటేశ్వర్లు, గంగవరపు సునీత తదితరులు.

పల్నాటి శ్రీరాములు

### 'విమర్శకునితో ఒక సాయంత్రం'

కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో ఆగస్ట్ 17 సా.6 గంటలకు విజయవాడలో విమర్శకులు జి. లక్ష్మీనర్సయ్యతో 'విమర్శకునితో ఒక సాయంత్రం' కార్యక్రమం జరుగుతుంది. విజయవాడ బుక్ ఫెస్టివల్ సెమినార్ హాల్‌లో జరిగే ఈ ముఖాముఖి కార్యక్రమానికి సాహిత్యాభిమానులు అందరూ ఆహ్వానితులే.

సి. మృణాళిని

### 'పాయిదరువులు' నవల

కె.వి. మేఘనాథ్ రెడ్డి రాసిన 'పాయిదరువులు' నవల ఆవిష్కరణ సభ ఆగస్ట్ 17 ఉ.10గంటలకు తిరుపతిలోని ఛాంబరాఫ్ కామర్స్ లో జరుగుతుంది. సభలో మధురాంతకం నరేంద్ర, పలమనేరు బాలాజీ, ఆర్.సి.కె రాజు, సి.ఎస్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొంటారు.

భాగ్య

### 'యాదొంకీ బారాత్' ఆవిష్కరణ


వారాల ఆనంద్ తన జ్ఞాపకాలను 'యాదొంకీ బారాత్' పుస్తకంగా రాసారు. ఈ పుస్తకావిష్కరణ ఆగస్ట్ 18 సా.4గంటలకు హైదరాబాద్ ఉస్మానియా యునివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో జరుగుతుంది.

ఇందిరా రాణి

### కవి సంధి

సాహిత్య అకాడెమీ ఆధ్వర్యంలో 'కవి సంధి' కార్యక్రమంలో నగ్నముని తన కవితలను చదివి, పాఠకులతో సంభాషిస్తారు. ఈ కార్యక్రమం ఆగస్ట్ 21 సా.5గంటలకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది.

సాహిత్య అకాడెమీ



కృష్ణాజిల్లా సహకార కేంద్ర బ్యాంకు జనం సొమ్మును అక్రమార్కులపాలు చేస్తోంది. అక్రమాలను సక్రమం చేసే ప్రయత్నాలు సాగిస్తోంది. గతంలో వెలుగులోకి వచ్చిన రూ.31.50 కోట్ల రుణాల వ్యవహారంలో ఈ ప్రయత్నాలు ముమ్మరం చేసింది. అప్పట్లో తప్పులకు పాల్పడిన అధికారులను రక్షించేందుకు తాజాగా బ్యాంకు అధికారులు నానాపాట్లు పడుతున్నారు. ఈ రుణస్కాంలో మాజీ మంత్రి జోగి రమేశ్ సన్నిహితులు కీలకంగా ఉండటంతో విచారణాధికారి నివేదిక ఇచ్చినా గత ఐదేళ్లలో ఎలాంటి చర్యలూ సహకారశాఖ అధికారులు తీసుకోలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా అక్రమార్కులపై చర్యలు ఉంటాయని ఆశించినా అది జరిగే పరిస్థితి కనిపించడం లేదు. పైగా అక్రమాలను సక్రమం చేసే పని మరింత వేగవంతం కావడం గమనార్హం. - (విజయవాడ - ఆంధ్రజ్యోతి)



గతంలో వేలం వేసిన పొలం




రేపు పొలం వేలం వేస్తున్నట్టు ప్రకటించిన నోటీసు



# కేడీసీసీబీలో జోగి జమానా!

- జనం సొమ్ము అక్రమార్కులపాలు
- సహకార బ్యాంకులో మరోసారి అదే దందా
- రూ. 2 కోట్ల భూమిని రూ. 8 కోట్లకు జమ చేసేందుకు సన్నాహాలు

- పెడన - బంటుమిల్లి బైపాస్‌లో 1.25 ఎకరాలకు రేపు వేలం
- ఆ భూమిని రూ.4 కోట్లకు జమ వేసుకున్న అధికారులు
- 2019 రుణ స్కాం సూత్రధారులను రక్షించేందుకే ఈ తంతులు
- 10 రోజుల క్రితం ఇదే ప్రాంతంలో 65 సెంట్లు వేలం
- మరోసారి అదే తప్పు చేసేందుకు నానా తంటాలు
- జోగి రమేశ్ కనుసన్నల్లో అక్రమాలను సక్రమం చేసే పని

### అక్రమం ఎలా మొదలైంది?

పెడన కేడీసీ బ్యాంకులో 2016లో జరిగిన రుణ కుంభకోణంపై 2020 మార్చి 10న అప్పటి కేడీసీసీ బ్యాంకు డీజీఎం పీజేఎస్ ప్రభాకర్ పెడన పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మచిలీపట్నం కేడీసీసీ బ్యాంకులో ఏజీఎంగా చేస్తున్న కాగిత రామకృష్ణ, పెడన కేడీసీసీబీ బ్రాంచి మేనేజర్‌గా చేస్తున్న ఎం.ఆంజనేయులు, పెడన బ్రాంచిలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న కె.సుధీర్‌తోపాటు ముక్కు రత్నపులాకర్ రావు, ముక్కు వెంకటేశ్వరమ్మపై ఆయన ఫిర్యాదు చేశారు. వీరందరూ కలిసి 2016 ఫిబ్రవరి నుంచి ఆగస్టు వరకు పెడన బ్రాంచిలో మోసపూరితంగా జరిగిన రూ.4.25 కోట్లు రుణ కుంభకోణంలో భాగస్వాములనేది ఆ ఫిర్యాదు సారాంశం.

### రుణం ఎలా తీసుకున్నారంటే..

రుణం తీసుకునేందుకు సర్వే నంబరు 700, 710లో ఉన్న 1.25 ఎకరాల వ్యవసాయ భూమిని ఇళ్ల స్థలాలుగా చూపి 6050 గజాలకు రూ.4.25 కోట్లు రుణం తీసుకున్నారు. రుణం మంజూరు చేసే సమయంలో అప్రూవ్డ్ ప్లాన్ లే అవుట్ లేకపోయినా సర్వే నంబరు 700, 701లోని భూమిని ఇళ్ల స్థలాలుగా పరిగణించి రుణం మంజూరు చేశారు. జాతీయ రహదారి 214ఏలో ఉన్న సర్వే నంబరు 700, 710లోని భూమికి సుమారు 2 కిలోమీటర్ల దూరంలోని కప్పలదొడ్డి పైడమ్మ ఆలయం వద్ద ఉన్న డోర్ నంబరుతో మార్కెట్ వ్యాల్యూ సర్టిఫికెట్ తీసుకుని అప్పట్లో ఆ భూమి విలువను గజం రూ.8 వేలుగా చూపి రూ.4.25 కోట్లు రుణం తీసుకున్నారు. వాస్తవానికి అప్పట్లో సర్వే నంబరు 700లో ఎకరా మార్కెట్ వ్యాల్యూ రూ.72,60,000 మాత్రమే. 710లో ఉన్న భూమి మార్కెట్ విలువ రూ.96,80,000 మాత్రమే. దీని ప్రకారం కేవలం రూ.6 లక్షలు రుణం మంజూరు చేయాల్సి ఉన్నా రూ.4.25 కోట్లు రుణం మంజూరు చేశారు. దీనిపై పెడన పోలీసు స్టేషన్‌లో క్రిమినల్ నంబరు 74/2020 కింద కేసు నమోదైంది. ఈ కేసు విచారణను అనంతర కాలంలో సీబీసీఐడీకి అప్పగించారు.

### ఇప్పుడేం చేస్తున్నారంటే..

సర్వే నంబరు 710, 700లో ఉన్న 1.25 ఎకరాను ఈ నెల 13న కేడీసీసీ బ్యాంకు అధికారులు వేలం వేస్తున్నారు. దీని విలువను రూ.8.63 కోట్లుగా చూపారు. సర్వే నంబరు 710లో ఉన్న 1210 గజాలు - మిగతా 4లో



వెంచర్ల కోసం కాలువను పూడ్చి.. వేసిన రహదారి

## కాలువ పూడ్చి.. దారి వేసి..

వెంచర్ల కోసం రియల్టర్ల అడ్డగోలు వ్యవహారం

- నీటి ప్రవాహం లేక ఎగదన్నుతున్న వరద నీరు
- నీట మునుగుతున్న పంట పొలాలు
- లబోదిబోమంటున్న రైతన్నలు

**పాయకాపురం, విజయవాడ రూరల్, ఆగస్టు 11 :** విజయవాడ నగర శివారుల్లోని రూరల్ గ్రామాల్లో ఇబ్బడిముబ్బడిగా వెలుస్తున్న ప్రైవేట్ వెంచర్ల కారణంగా సమీప రైతులు తీవ్ర నష్టాన్ని ఎదుర్కొంటున్నారు. వెంచర్లకు దారి ఏర్పాటు పేరుతో పొలాల వెంబడి ఉన్న కాలువలను పూడ్చేస్తున్నారు. దీనివల్ల వర్షాకాల సమయంలో వరదనీరు ఎగదన్ని పంట పొలాలు నీట మునుగుతున్నాయి. పాయకాపురం శివారుల్లోని బుడమేరు కరకట్టను ఆనుకుని ఉన్న పలు పంచాయతీల్లో ఈ దుస్థితి నెలకొంది.

### కాలువ పూడ్చివేత ఇలా..

బుడమేరు ముంపు నివారణలో భాగంగా జనావాసాల మధ్యకు వరద నీరు రాకుండా కట్టడి చేసేందుకు మూడు దశాబ్దాల క్రితం ఇటు పాయకాపురం అటు గ్రామాల మధ్య కరకట్ట ఏర్పాటు చేశారు. అజిత్‌సింగ్‌నగర్ నుంచి పాయకాపురం మీదుగా కండ్రిక కాలనీ వరకు బుడమేరు కరకట్టను అప్పట్లోనే నిర్మించారు. కరకట్ట నిమిత్తం - మిగతా 4లో

## గిరిజన యువతిపై లైంగిక దాడి

6లో..

# కృష్ణమ్మ కడలిపాలు



ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద నీరు

## ఈ ఏడాది 86.14 టీఎంసీలు వృథా

ఏటా సముద్రంలోకి వందలాది టీఎంసీలు
- నిల్వ చేసుకుంటే రైతులకు పంటే
- మినీ బ్యారేజీలు నిర్మిస్తేనే సాధ్యం
- పట్టించుకోని గత ప్రభుత్వం
- కూటమి ప్రభుత్వంపైనే ప్రజల ఆశలు

కృష్ణమ్మ పరుగులు తీస్తోంది. ఎగువ ప్రాంతంతోపాటే దిగువ భాగంలోనూ జలకళ కనిపిస్తోంది. ఇదంతా ఆనందం కలిగించే అంశమే అయినా అది నాణేనికి ఒకవైపే. రెండో వైపున ఆవేదన వి ంగులుతోంది. ఎగువ ప్రాంతం నుంచి ఎప్పుడు వరదలు వచ్చినా ప్రకాశం బ్యారేజీ నుంచి నీరు వృథాగా పోతోంది. వందల టీఎంసీలు సముద్రంలో కలుస్తోంది. ఈ ఏడాది ప్రకాశం బ్యారేజీకి వరదలు ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటి వరకు 86.14 టీఎంసీల నీరు సముద్రంలోకి వృథాగా పోయింది. 2019లో 501 టీఎంసీలు, 2020లో 439.19 టీఎంసీలు, 2021లో 332 టీఎంసీల నీరు కడలిలో కలిసింది.

**(ఆంధ్రజ్యోతి - విజయవాడ) :** ప్రకాశం బ్యారేజీ పూర్తిస్థాయి సామర్థ్యం 3.07 టీఎంసీలు. ఈ పరిమాణానికి వి ంచి చుక్క నీటినీ నిల్వ చేసుకునే పరిస్థితి లేదు. బ్యారేజీ వద్ద 11 అడుగుల నీటి మట్టాన్ని కొనసాగిస్తూనే, 3.07 టీఎంసీల నీటి నిల్వను నిర్వహించాలి. దీనికి ఎగువన పులిచింతల, నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు ఉన్నాయి. శ్రీశైలం గేట్లు ఎత్తితే ఆ నీరు నాగార్జున సాగర్‌కు చేరుతుంది. అక్కడి నుంచి పులిచింతలకు వస్తుంది. ఇక్కడ నీటి సామర్థ్యం పూర్తిస్థాయిలో ఉంటే వి ంగిలిన నీరు మొత్తం ప్రకాశం బ్యారేజీకి వస్తోంది. ఇది కాకుండా పాలేరు, మధిర, కట్టలేరు, కీసర వాగుల నుంచి వర్షాల సమయంలో నీరు వస్తోంది. ఇలా వచ్చిన నీటిని పొదుపు చేసుకునే మార్గం నదీ పరివాహ ప్రాంతంలో లేకపోయింది. ప్రకాశం బ్యారేజీకి ఎగువన పులిచింతల మాత్రమే ఉంది. ఇక దిగువన ఎలాంటి వసతులూ లేవు.

### ఏటా 6 లక్షల క్యూసెక్కులు కడలిపాలు

ప్రతి ఏడాదీ వరదల సమయంలో 5-6 లక్షల క్యూసెక్కుల నీరు సముద్రంలో కలుస్తోంది. వరదలు లేని సమయంలోనూ నీరు వృథాగా సముద్రంలోకి పోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2020లో బ్యారేజీకి ఎలాంటి వరద ప్రవాహమూ లేకపోయినా 439.19 టీఎంసీల నీరు వృథాగా వెళ్లిపోయింది. దీనికి ప్రధాన కారణం పులిచింతల వద్ద ఉన్న విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో తెలంగాణ విద్యుత్ ఉత్పత్తిని ఆరంభించడమే. ప్రకాశం బ్యారేజీ వరకు నీటి పొదుపు ఉన్నప్పటికీ దానికి దిగువన మాత్రం ఎలాంటి అదుపూ లేదు. ప్రతి ఏడాదీ వందల టీఎంసీల నీరు వృథాగా సముద్రంలో కలుస్తుంటే ఎంతో ఆవేదన కలుగుతుందని రైతులు చెబుతున్నారు. బ్యారేజీకి దిగువన నీటిని పొదుపు చేసుకునే సదుపాయాలను అందుబాటులోకి తీసుకొస్తేనే వృథాగా కడలిలో కలుస్తున్న నీటిని కట్టడి చేయగలమని అభిప్రాయపడుతున్నారు.

### 'మినీ'లా... మార్పులా...

నీరు ఇలా వృథా సముద్రంలోకి వెళ్తుండడంతో బ్యారేజీకి 20 కిలోమీటర్ల దిగువన చోడవరం వద్ద ఒక బెలూన్ బ్యారేజీని నిర్మించాలని గతంలో తెలుగుదేశం ప్రభుత్వం సంకల్పించింది. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చోడవరం వద్ద ఒక మినీ బ్యారేజీని, దీనికి దిగువన శ్రీకాకుళం వద్ద మరో మినీ బ్యారేజీని నిర్మించాలని నిర్ణయించింది. ఒక్కొక్క మినీ బ్యారేజీ నీటి సామర్థ్యం 4.05 టీఎంసీలు. కొత్తగా మినీ బ్యారేజీలను నిర్మిస్తే మొత్తం 11.17 టీఎంసీలు నిల్వ ఉంటుంది. రెండు మినీ బ్యారేజీలకు ఒకేసారి ఆమోదం తెలపడంతో నిర్మాణం ఒకేసారి ప్రారంభమవుతుందని రైతులు, ప్రజలు భావించారు. తర్వాత రెండింటికీ కాకుండా ఒక బ్యారేజీ నిర్మాణానికి మాత్రమే పరిపాలన ఆమోదం ఇచ్చింది. చోడవరం వద్ద నిర్మించబోయే బ్యారేజీని పెండింగ్‌లో పెట్టి శ్రీకాకుళం వద్ద బ్యారేజీని తొలుత నిర్మించాలని భావించింది. శ్రీకాకుళం వద్ద సముద్రం ఆటుపోటుల సమయంలో నీరు సమీప గ్రామాల్లోకి చొచ్చుకు వస్తోంది. దీంతో ఇక్కడ భూగర్భ జలాల పరిస్థితి మరింత ప్రమాదకరంగా ఉన్నందున రెండో బ్యారేజీ నిర్మాణం చేపట్టాలని వైసీపీ ప్రభుత్వం భావించినా ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. ప్రకాశం బ్యారేజీ ఎగువ ప్రాంతాన్ని మినహాయిస్తే దిగువన నదీ పరివాహక ప్రాంతంలో చుక్క నీరు కూడా ఉండడం లేదు.

### ఎక్కడ చూసినా ఉప్పు నీరే..

కృష్ణా నది పెనమలూరు మండలంలోని గ్రామాలను ఆనుకుని సముద్రం సరిహద్దు వరకు ప్రవహిస్తోంది. చోడవరం, ఆ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు బోర్లు తవ్వినప్పుడు వచ్చే జలాల్లో స్వచ్ఛత ఉండడం లేదని ఆయా ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోపిదేవి, అవనిగడ్డ చుట్టుపక్కల ప్రాంతాల్లో పరిస్థితి మరోలా ఉంది. పోటు సమయంలో సముద్రపు నీరు నదిలోకి వచ్చి చేరుతుంది. ఇక అల్పపీడనాల సమయంలోనూ సముద్రపు నీరు రోజుల తరబడి నదిలో ఉంటోంది. ఈ కారణంగా ఆ పరిసర ప్రాంతాల్లోని భూములు చౌడు బారిపోతున్నాయి. ఇక్కడ ఏ ప్రదేశంలో బోర్లు వేసినా ఉప్పు నీరు తప్ప స్వచ్ఛమైన నీరు పైకి రావడం లేదు. ప్రకాశం బ్యారేజీ - చోడవరం బ్యారేజీ - మోపిదేవి బ్యారేజీల మధ్య ఏడాది పొడవునా నీరు నిల్వ ఉండేలా చేస్తే ఈ పరిస్థితులు మారతాయని జలవనరుల శాఖ అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం మినీ బ్యారేజీలను ముందుకు తీసుకెళ్తుందా? కొత్తగా మార్పులు చేర్పులు చేస్తుందా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

## వరద తగ్గుముఖం

పులిచింతల ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో 2.66 లక్షల క్యూసెక్కులు

- బ్యారేజీ ఇన్‌ఫ్లో 1.98 లక్షల క్యూసెక్కులు

**విజయవాడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) :** ఎగువ నుంచి ప్రకాశం బ్యారేజీకి వస్తున్న వరద తగ్గుముఖం పడుతోంది. పులిచింతలకు వస్తున్న నీటిని మొత్తాన్ని కిందికి వదిలేస్తున్నారు. నాగార్జునసాగర్ నుంచి పులిచింతలకు 2 లక్షల 66 వేల 201 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. 2 లక్షల 66 వేల 200 క్యూసెక్కుల నీటిని దిగువకు వి డుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీకి ఎగువ నుంచి లక్షా 98 వేల 471 క్యూసెక్కుల నీరు వస్తోంది. బ్యారేజీ నుంచి 2 లక్షల 53 వేల 702 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదులుతున్నారు. బ్యారేజీ 35 గేట్లను ఆరు అడుగులు, మరో 35 గేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తారు. ఉదయం ఆరు గంటలకు 3 లక్షల 23 వేల 176 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయగా, సాయంత్రం ఆరు గంటలకు 2 లక్షల 53 వేల 702 క్యూసెక్కులకు చేరింది. కాల్వలకు 22,377 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. కేఈబీకి 1601, బందరు 801, ఏలూరు 1404, రైవస్ 4619, కేఈ మెయిన్ 8425, కేడబ్ల్యూ 5527 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

### అక్విడెక్ట్‌ను తాకిన వరద నీరు



అక్విడెక్ట్ అంచును తాకుతూ వెళుతున్న వరద నీరు

**అవనిగడ్డ :** ప్రకాశం బ్యారేజీ నుంచి వచ్చే వరదతో పులిగడ్డ అక్విడెక్ట్ వద్ద ప్రవాహ మట్టం 13 అడుగులకు చేరింది. శనివారం వరద నీరు పులిగడ్డ అక్విడెక్ట్‌ను తాకుతూ ప్రవహిస్తోంది. శనివారం విడుదల చేసిన 3 లక్షల 20 వేల క్యూసెక్కుల వరద నీటికి తోడు, ఆదివారం 2.64 లక్షల క్యూసెక్కులు దిగువకు ప్రవహిస్తోంది. మరో రెండు రోజులపాటు వరద తీవ్రత కొనసాగే పరిస్థితి ఉందని ఇరిగేషన్ డీఈ రావెళ్ల రవికిరణ్ తెలిపారు. వరదలను దృష్టిలో ఉంచుకుని నాగాయలంక మండలం టి.కొత్తపాలెం, హంసలదీవి, పిట్టలంక గ్రామాల వద్ద బలహీనంగా ఉన్న కరకట్టల వద్ద ఇసుక మూటలు వేసి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశామని డీఈ తెలిపారు.




## వెంకయ్యకు ఆత్మీయ సంగమం

మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు 75 సంవత్సరాలు నిండిన సందర్భంగా పోరంకి మురళీ రిసార్ట్స్‌లో ఆదివారం ఆత్మీయ సంగమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకయ్య జీవిత విశేషాల పుస్తకాన్ని అతిథులకు అందించారు. అనంతరం ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజాప్రతినిధులు ఆయనను ఘనంగా సత్కరించారు.

## ఆర్టీసీలో ఖాళీలు భర్తీ చేయాలి

3 వేలకు పైగా కొత్త బస్సులు కొనాలి

- పీటీడీ ఈయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశం
- విలీనానంతర సమస్యలపై ఏకరువు

4లో

## కొండంత భక్తితో..

దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

- ఒక్కరోజే యాభైవేల మంది భక్తుల రాక
- జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్

6లో..




ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ

# కొండంత భక్తితో..

- దుర్గమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు
- ఒక్కరోజే యాభైవేల మంది రాక
- జాతీయ రహదారిపై స్తంభించిన ట్రాఫిక్
- నగరవాసులకు తీరని ట్రాఫిక్ కష్టాలు



**వన్‌టౌన్, ఆగస్టు 11 :** దుర్గామల్లేశ్వర దేవస్థానంలో దుర్గమ్మ దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సాయంత్రం వరకు సుమారు 50 వేలమందికి పైగా భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్టు ఆలయ వర్గాల అంచనా. శ్రావణమాసం ఆదివారం సప్తమి తిథిని పురస్కరించుకుని అమ్మవారి దర్శనానికి భక్తులు తరలిరావటంతో ప్రాంగణాలు కిక్కిరిశాయి. ఉచిత దర్శనానికి సుమారు 2 గంటల సమయం పట్టింది. ఖడ్గమాలార్చన, చండీహోమం, ప్రత్యేక కుంకుమార్చన, శ్రీచక్ర నవావరణాచర్చన సేవల్లో భక్తులు పాల్గొన్నారు. మల్లేశ్వరాలయం, ఉపాలయాల వద్ద భక్తులు కిటకిటలాడారు.

**ఫ్లై ఓవర్ ఉన్నా తీరని ట్రాఫిక్ కష్టాలు..**



దుర్గగుడి వద్ద ఫ్లై ఓవర్ నిర్మించినప్పటికీ నగరవాసులకు ట్రాఫిక్ కష్టాలు తీరడం లేదు. కొండ దిగువన ఘాట్ రోడ్డుకు వెళ్లే మార్గంలో మెయిన్ రోడ్డుపై ట్రాఫిక్ నిలిచిపోతోంది. శుక్ర, శని, ఆదివారాల్లో భక్తుల రద్దీ అధికంగా ఉంటోంది. ఘాట్ రోడ్డు పైకి కార్లను అనుమతించినా, పార్కింగ్ స్థలంలో సుమారు 50 కార్లే పట్టే పరిస్థితి ఉంది. ఆలయ ఉద్యోగులు, అర్చకులు, సిబ్బంది ద్విచక్ర వాహనాలలో వస్తుంటారు. కనకదుర్గానగర్‌లో అభివృద్ధి పనులు జరుగుతుండటంతో కార్లను పార్కింగ్ చేసుకునే సదుపాయం లేదు. కొండ దిగువన చైనా వాల్ రోడ్డులో ఆటోలు, హాకర్లు ఆక్రమిస్తున్నారు. ఇరుకు రోడ్డు కావటంతో దుర్గగుడి ఘాట్ రోడ్డు వద్ద కొండపైకి వెళ్లే బస్సులు, కార్లు తిరుగుతున్న సమయంలో ట్రాఫిక్ నిలిచిపోతోంది. పోలీసులకు ఇది సవాల్‌గా మారింది. ఫ్లై ఓవర్ దిగువన లోకల్ ట్రాఫిక్ మరింత పెరగటంతో ఫ్లై ఓవర్ నిర్మించినా ట్రాఫిక్ కష్టాలు తీరని పరిస్థితి ఉంది.


చల్లపల్లి మండలం నిమ్మగడ్డ వద్ద పసుపుతోటలోకి వచ్చిన వరదనీరు

# వీడని వరద.. చేలల్లోకి నీరు

**చల్లపల్లి, ఆగస్టు 11 :** వరద నీటి ప్రవాహం పెరగటంతో పల్లపు ప్రాంతాల్లో పొలాల్లోకి నీరు చేరుతోంది. ప్రకాశం బ్యారేజీ నుంచీ మూడు లక్షలకుపైగా క్యూసెక్కుల నీటిని వదలటంతో కృష్ణానదిలో నీటిమట్టం పెరిగింది. దీంతో పరీవాహక ప్రాంతాల్లో నదికి ఆనుకుని ఉన్న వ్యవసాయ భూముల్లోకి నీరుచేరుతోంది. చల్లపల్లి మండల పరిధిలోని నడకుదురు, నిమ్మగడ్డలలో రేవులోకి వెళ్లే రోడ్డువరకూ వరదనీరు రాగా, రేవు పక్కనే ఉన్న పసుపు తోటల్లోకి నీరు చేరింది. సోమవారం నాటికి వరద తగ్గే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

## వరద తాకిడికి దెబ్బతిన్న కట్లేరు-వైరా లో లెవల్ చప్టా



**వీరులపాడు/నందిగామ రూరల్ :** వల్లంపల్లి సమీపంలో కూడలి వద్ద ఉన్న వైరా-కట్లేరు వాగుపై దాములూరు కూడలి వద్ద లో లెవల్ చప్టాపై వరదనీరు పొంగి ప్రవహిస్తోంది. కూడలి-పల్లెంపల్లికి వెళ్లే కాజ్‌వే వరద నీటికి కొంత భాగం పూర్తిగా దెబ్బతినటంతో గుంతలు పడ్డాయి. విషయం తెలుసుకున్న పోలీస్, రెవెన్యూ శాఖాధికారులు పరిశీలించి రాకపోకలను నిలుపుదల చేశారు. వాహనదారులు రాకపోకలు సాగించకుండా రహదారిపై బండరాళ్లను ఏర్పాటు చేశారు.

## ప్రభుత్వం మారినా పనిభారంలో మార్పులేదు

- ఉపాధ్యాయ సంఘాల సమన్వయ సమావేశంలో అభిప్రాయం

**వన్‌టౌన్, ఆగస్టు 11 :** రాష్ట్రంలో ప్రభుత్వం మారినా ఉపాధ్యాయుల పనిభారంలో ఏమాత్రం మార్పు రాలేదని విజయవాడ ఎన్జీవో హోమ్‌లో జరిగిన సమన్వయ సమావేశం అభిప్రాయపడింది. ఎమ్మెల్సీలు అశోక్‌బాబు, చిరంజీవిరావు, మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణలు ఉపాధ్యాయ సంఘాలతో చర్చించేందుకు ఆదివారం సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులకు సంబంధించిన అనేక సమస్యలు ప్రస్తావనకు వచ్చాయి. జీవో 117 రద్దు, బోధనేతర కార్యక్రమాల్లో ఉపాధ్యాయులను నియమించే అంశం తొలగింపు, తెలుగుమాధ్యమం కొనసాగింపు, ఉపాధ్యాయులపై పనిభారం, తెలుగు మాధ్యమంలో పదో తరగతి పరీక్షల నిర్వహణపై స్పష్టత తీసుకురావటం, పురపాలక ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు, పోస్టుల ఉన్నతీకరణ, జీపీఎఫ్ సౌకర్యం, విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో ఎస్‌జీటీ పోస్టుల ఉన్నతీకరణ, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు చేయటం, స్పౌస్ మ్యూచువల్‌తో పాటు సాధారణ ఉపాధ్యాయులకు అంతర్ జిల్లాల బదిలీలు, తదితర అంశాలు ప్రస్తావనకు వచ్చాయి. ఇదే సమయంలో 1998, 2008 డీఎస్సీ ఎంటీఎస్ ఉపాధ్యాయుల సమస్యలు ఎంఈవో 1, 2కు సమాన అధికారాలు, ప్లస్ టూ పాఠశాలల సమస్యలు, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకే తల్లికి వందనం వర్తింపు, సర్వీసు రూల్స్, జేఎల్ పదోన్నతులు, పని సర్దుబాటులోని లోపాలు, సిలబస్, పరీక్షా విధానం, బోధనేతర సిబ్బంది సర్దుబాటు, జిల్లా యూనిట్‌గా కారుణ్య నియామకాలు, ఆదర్శ పాఠశాలల ఉపాధ్యాయులకు పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాల అమలు, కేజీబీవీ సమస్యలు.. ఇంకా అనేకం చర్చకు వచ్చాయి. మరోవైపు ఉద్యమాల సందర్భంగా పెట్టిన కేసుల ఉపసంహరణ వంటి అంశాలపై సమావేశంలో కూలంకషంగా చర్చించారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడిచినప్పటికీ, విద్యాశాఖ మంత్రి సమస్యలపై సమావేశం ఏర్పాటు చేయలేదని, ప్రభుత్వం మారినప్పటికీ ఉపాధ్యాయుల పనిభారంలో ఏమాత్రం మార్పులేదని, వ్యతిరేకత మొదలైందని తెలుపుతూ కొందరు అభిప్రాయం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీలు మాట్లాడుతూ, విద్యాశాఖ మంత్రితో త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఉపాధ్యాయ సంఘాలు తమ సమస్యల పరిష్కారం కోసం స్పష్టమైన విధానంతో రావాలని చెప్పారు. జీవో 117 తప్పక రద్దు చేస్తామని, తెలుగు మాధ్యమాన్ని కొనసాగిస్తామని తెలిపారు. ఆయా సంఘాల పక్షాన రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

## గిరిజన యువతిపై లైంగిక దాడి

**విజయవాడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) :** మ్యాట్రిమోని వెబ్‌సైట్‌లో ప్రొఫైల్ చూసి పెళ్లి చేసుకుంటానని ఓ గిరిజన యువతిని నమ్మించాడు. ఇద్దరం కలిసి మాట్లాడుకోవాల్సిన విషయాలు ఉన్నాయని చెప్పి హోటల్‌కు తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. దీనిపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. అల్లూరి సీతారామ రాజు మన్యం జిల్లా రంపచోడవరం మండలం పెద్దగెద్దాడ రెడ్డిపేటకు చెందిన 25 ఏళ్ల గిరిజన యువతి మొదట్లో ఓ యువకుడిని ప్రేమించింది. అతడు ఆమెను తల్లిని చేసి వదిలి వెళ్లిపోయాడు. తర్వాత ఆమె మ్యాట్రిమోనిలో తన ప్రొఫైల్ పోస్టు చేసింది. పటమటలోని పూజిత అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్న దూదేకుల అక్బర్ బాషా ఆమె ప్రొఫైల్ చూశాడు. ఫోన్ నెంబర్ తెలుసుకుని ఆమెతో పరిచయం పెంచుకున్నాడు. తాను పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. కొద్దిరోజుల క్రితం ఆమెకు ఫోన్ చేసి కొన్ని విషయాలు మాట్లాడాలని చెప్పి విజయవాడ రప్పించాడు. స్నేహితుడు శేషం జయసాయి కేశవరావుతో కలిసి హోటల్‌కు తీసుకెళ్లాడు. కేశవరావును బయటపెట్టి ఆమెపై లైంగికదాడికి పాల్పడ్డాడు. తర్వాత పెళ్లి చేసుకోనని మాట మార్చాడు. దీనిపై ఆమె మాచవరం పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శనివారం రాత్రి కేసు నమోదు చేశారు.

# ఆక్వా రంగాన్ని ఆదుకుంటాం

- మడ అడవుల పరిరక్షణకు చర్యలు
- మత్స్య సంపద కాపాడేందుకు అధ్యయనం
- సాగరమాల ద్వారా రహదారుల అభివృద్ధి
- కేంద్ర బృందంతో గిలకలదిండి హార్బర్‌ను పరిశీలించిన మంత్రి కొల్లు రవీంద్ర


కేంద్రబృందంతో మాట్లాడుతున్న మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) :** ఆక్వారంగాన్ని అన్నివిధాల ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్ ఆఫ్‌ది యునైటెడ్ నేషన్ (ఎఫ్ఏవో), బృందం 'సస్టెయినబుల్ ఆక్వాకల్చర్ ఇన్ ఏపీ' అంశంపై అధ్యయనం నిమిత్తం వచ్చిన కేంద్ర బృందంతో కలిసి మచిలీపట్నంలోని గిలకలదిండి హార్బర్‌ను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కేంద్ర బృందం ఆక్వాసాగు రైతులతో, మత్స్యకారులతో మాట్లాడి ఇక్కడి అనుకూల, ప్రతికూల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక వాతావరణ పరిస్థితులు, గిలకలదిండి హార్బర్‌నుంచి మత్స్యసంపద ఎగుమతులు తదితర అంశాలను మంత్రి కేంద్ర బృందానికి వివరించారు. సముద్రంలో అరుదైన చేపల జాతులు అంతరించి పోతున్నాయని, వాటిని సంరక్షించే విషయంలో పూర్తిస్థాయి అధ్యయనం జరిగేలా ప్రతిపాదన చేయాలని మంత్రి కోరారు. చేపలు, రొయ్యల సంతానోత్పత్తికి మడ అడవులు ఆవాసంగా ఉన్నాయన్నారు. మడఅడవుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలన్నారు. సముద్రంలో చేపలవేటకు సోలార్ సోనాబోట్‌లను అత్యంత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో అందుబాటులోకి తెచ్చి మత్స్యకారులు తక్కువ ఖర్చుతో చేపలవేట కొనసాగించేందుకు అవకాశం ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. సాగరమాల ద్వారా తీరప్రాంత రహదారులను అభివృద్ధి చేయాలని కోరారు. నేడు కేంద్రమంత్రి గడ్కరీని కలిసి ఈ అంశంపై వినతి పత్రం అందజేయనున్నట్టు మంత్రి తెలిపారు.

**ఆక్వా ఉత్పత్తుల్లో ఏపీది కీలకస్థానం**

ఆక్వా ఉత్పత్తుల్లో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఉందని ఎఫ్ఏవో ప్రాజెక్టు జాతీయ కో-ఆర్డినేటర్ డాక్టర్ కొండా చవ్వా అన్నారు. కేంద్ర ప్రాజెక్టు ద్వారా స్థిరమైన ఆక్వా కల్చర్ ఉత్పత్తులను ప్రోత్సాహించడానికి తమబృందం అధ్యయనం చేస్తోందని తెలిపారు. అక్వాకల్చర్‌కు అనువైన వాతావరణం ఏపీలో ఉందని, ఆక్వాసాగులో శాస్త్రీయత, సాంకేతికపరమైన అంశాలను జోడిస్తే మరింత నాణ్యమైన ఉత్పత్తులకు అవకాశం ఉంటుందన్నారు. ఎఫ్ఏవో జాతీయ కో-ఆర్డినేటర్ సీమాభట్ మాట్లాడుతూ, ఆక్వారంగంలో రసాయనాల వినియోగం తగ్గించి సాగు చేయగలిగితే విదేశాలకు ఎగుమతుల్లో ఎలాంటి ఇబ్బందులు ఉండవని తెలిపారు. పర్యటనలో బృందం సభ్యులు మురళీధరన్, విష్ణుభట్, నీల్‌కాంత్‌విశ్రా, సలోమియేసుదాస్, జనసేన మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ స్థానిక మత్స్యకారులు, ఆక్వా రైతులు పాల్గొన్నారు.

**కలెక్టర్‌తో సమావేశం**

కేంద్రబృందం సభ్యులు కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో డీకే బాలాజీతో సమావేశమయ్యారు. బృందం సభ్యులు పరిశీలించిన అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. జిల్లాలో ఆక్వాసాగు, సముద్ర ఉత్పత్తులు ఎగుమతులు, మార్కెటింగ్, తదితర అంశాలపై తీసుకోవాల్సిన అంశాలపై చర్చ జరిగింది. సమావేశంలో రాష్ట్రమత్స్యశాఖ కమిషనర్ తమ్ము డోలాశంకర్, అదనపు డైరెక్టర్ అంజలి, జిల్లామత్స్యశాఖ జేడీ ఎ.చంద్రశేఖర్, జిల్లా అటవీశాఖ అధికారి కె.రాజశేఖర్ పాల్గొన్నారు.

# ఆత్మవిశ్వాసం పెంచడమే అసలైన సంక్షేమం

భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు

**ఆకలితో ఉన్న వ్యక్తికి చేపలు ఇస్తే అప్పటికి తృప్తి చెందుతాడని, అదే వ్యక్తికి చేపలు పట్టడం నేర్పిస్తే తాను ఎప్పుడు కావాలంటే అప్పుడు చేపలు పట్టుకోగలడని, ఇదీ అసలైన సంక్షేమమని వెంకయ్య అన్నారు.**


వైద్యశిబిరంలో వృద్ధులతో ముచ్చటిస్తున్న వెంకయ్య నాయుడు

**ఉంగుటూరు, ఆగస్టు 11 :** యువతకు ఉచితంగా నైపుణ్య శిక్షణ అందించి తమ కాళ్లపై తాము నిలబడేలా, ఆత్మవిశ్వాసంతో జీవించేలా చేయడమే అసలైన సంక్షేమమని, ప్రజలకు విద్య, వైద్యం ఉచితంగా అందిస్తే చాలని, ఉచిత పథకాలు అవసరం లేదని భారత మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం, ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్(విజయవాడ చాప్టర్)లో ఆదివారం గుడివాడకు చెందిన ఈవీఆర్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటుచేసిన ఉచిత వైద్యశిబిరానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించారు. అనంతరం వెంకయ్య మాట్లాడుతూ, ఓట్ల కోసం, తాత్కాలిక రాజకీయ లబ్ధి కోసం ప్రభుత్వాలు అవసరంలేని ఉచితపథకాలు తీసుకొస్తున్నాయని, దీనివల్ల ప్రజలకు దీర్ఘకాలికంగా లాభంకంటే నష్టమే ఎక్కువ జరుగుతుందన్నారు. ప్రజలు చేయిచాచే పరిస్థితిలో లేకుండా ఆత్మగౌరవంతో జీవించేలా చేయడంపై పాలకులు దృష్టి సారించాలని సూచించారు.

మంచి ఆహారపు అలవాట్లు, జీవనశైలితో ఆరోగ్యం యువతరం పాశ్చాత్య జీవనశైలిపై మోజును విడనాడి మంచి ఆహారపు అలవాట్లు ఆరోగ్యకర జీవన విధానాన్ని అలవర్చుకుంటే డాక్టర్లతో పనివుండదని వెంకయ్య స్పష్టంచేశారు. ప్రతి నిత్యం శారీరక శ్రమ చేయటం, సంప్రదాయ వంటలు తినడం ద్వారా ఆరోగ్యం చేకూరుతుందన్నారు. వైద్యుల నుద్దేశించి మాట్లాడుతూ, వైద్యసహాయం కోరి వచ్చే పేషెంట్లకు సరైన వైద్యసేవలు అందించడంతోపాటు భారతీయ జీవనవిధానం, ఆహారపు అలవాట్లు, ఆరోగ్యకర జీవనశైలి పట్ల అవగాహన కల్పించడం బాధ్యతగా గుర్తించాలన్నారు. మెడికల్ క్యాంపుకు వచ్చిన వృద్ధులను ఆప్యాయంగా పలకరించి వారి యోగక్షేమాలు, ఆరోగ్యపరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వైద్యశిబిరంలో వివిధ విభాగాల్లో వైద్యసేవలందించిన ఈవీఆర్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యనిపుణుల బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సీఈవో శరత్‌బాబు, డైరెక్టర్ పరదేశి, వైద్యనిపుణులు రాజ్యలక్ష్మీ, రాజేంద్ర, రేవంత్‌కుమార్ రాఘవేంద్ర, అమృత, రఘువర్మ, సుమన్‌కుమార్, జయశ్రీ, ప్రశాంతి, గౌతమి, నీలిమ, అనూష, శ్రీనివాస్, పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాలువ పూడ్చి.. దారి వేసి..

(3వ పేజీ తరువాయి)

విజయవాడ రూరల్ మండలం గ్రామాలైన పి.నైనవరం, అంబాపురం, పాతపాడు పంచాయతీల పరిధిలోని పొలాలకు ఉపయోగపడే విధంగా కరకట్టను ఆనుకుని గ్రామాలవైపు కాలువను ఏర్పాటు చేశారు. కరకట్ట ఏర్పాటుతో పాయకాపురం, అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతాలకు ముంపు భారం తప్పడంతో పాటు అటు గ్రామాల్లోని పంట పొలాలకు నీరు అందించేలా కాలువ ఉపయోగపడింది. భారీ వర్షాలు, వరదల సమయంలో పంట పొలాలు ముంపునకు గురికాకుండా ఇదే కాలువ నుంచి వరదనీరు దిగువ ప్రాంతాలకు వెళ్లేది.

**కాలువను మూసివేస్తున్న రియల్టర్లు**

ప్రస్తుతం నగర శివారుల్లోని పంచాయతీల పరిధిలో పలు వెంచర్లు ఇబ్బడిముబ్బడిగా వెలిశాయి. వెంచర్లలోకి దారి కోసం రైతులకు ఎంతగానో ఉపయోగపడే కాలువను మూసివేస్తున్నారు. నీటి పారుదల కోసం అంటూ తూతూ మంత్రంగా రియల్టర్లు వేస్తున్న పైపులైన్లు పూడిపోయి సామర్థ్యం సరిపోక వర్షపు నీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. దీంతో వర్షపు నీరు పారే దారిలేక వరదనీరు పంట పొలాలకు ఎగదన్నడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు అంబాపురం, పి.నైనవరం, పాతపాడు పంచాయతీల పరిధిలో కరకట్టను ఆనుకుని ఉన్న పలు పొలాల్లో రైతులు నాట్లు వేసి ఉన్నారు. కాలువ పూడిపోయి నీరు ఎగదన్నడంతో ఆ పంట పొలాల్లోని నాట్లు నీటమునిగి కుళ్లిపోయే పరిస్థితులు తలెత్తాయి. అధికారులు స్పందించి రియల్టర్ల కారణంగా పూడ్చివేసిన కాలువలో నీరు సక్రమంగా పారుదల జరిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు రైతులు కోరుతున్నారు.


సదస్సులో ప్రసంగిస్తున్న అఖిల భారత శాంతి సంఘీభావ సంఘ ప్రధాన కార్యదర్శి అరుణ్‌కుమార్

## పాలస్తీనాపై ఇజ్రాయెల్ దాడులు నిలుపు చేయాలి

- అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం

**గవర్నర్‌పేట, ఆగస్టు 11 :** పాలస్తీనాపై ఇజ్రాయెల్ చేస్తున్న పాశవిక దాడిని నిలుపు చేయాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో సంఘం రాష్ట్ర సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శులు ఆర్.అరుణ్‌కుమార్, హరిచంద్‌సింగ్ భట్ మాట్లాడుతూ, పాలస్తీనాలో పోరాడుతున్న ప్రజలకు సంఘీభావం తెలిపారు. ఇజ్రాయెల్ దాడులను తీవ్రంగా ఖండించారు. జనావాసాలు, పాఠశాలలు, ఆసుపత్రులు, సహాయక చర్యలకు వచ్చిన స్వచ్ఛంద సంస్థలపై ఇజ్రాయిల్ బాంబుల వర్షం కురిపిస్తుండటం అమానుషమన్నారు. యుద్ధాన్ని వెంటనే నిలుపుచేయాలని, శాంతిని పునరుద్ధరించాలని, ప్రపంచ శాంతి కోసం ప్రజలంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సదస్సుకు సంస్థ రాష్ట్ర కన్వీనర్ మహంకాళి సుబ్బారావు అధ్యక్షత వహించారు. యాదవరెడ్డి, ఆలిండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయ కార్యదర్శి బుడ్డిగ జమిందార్, సంఘ సభ్యులు తదితరులు ప్రసంగించారు. సమావేశాల్లో నూతన కన్వీనింగ్ కమిటీని ఎన్నుకున్నారు. రాష్ట్ర కన్వీనర్లుగా మహంకాళి సుబ్బారావు, నరమాల సతీష్‌కుమార్, నాగిరెడ్డి, రఫీ ఎన్నికయ్యారు.

## కేడీసీసీబీలో జోగి జమానా!

(3వ పేజీ తరువాయి)

జాతీయ రహదారి పక్కనే ఉంటుంది. సర్వే నంబరు 700లోని 4840 (ఎకరా) గజాలు 710 సర్వే నంబరు వెనుక ఉన్న కాల్వను ఆనుకుని ఉంటుంది. ఇక్కడ జాతీయ రహదారి పక్కన ఎకరా గరిష్ఠంగా రూ.3 కోట్లు పలుకుతుంది. లోపల ఉన్న పొలం గరిష్ఠంగా రూ.కోటి విలువ ఉంటుంది. అంటే మొత్తం మీద 1.25 ఎకరా విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.2 కోట్లు మాత్రమే ఉంటుంది. కానీ కేడీసీసీ బ్యాంకు అధికారులు ఐదేళ్ల క్రితం అక్రమార్కులు ఏదైతే తప్పు చేశారో ఇప్పుడు మళ్లీ అదే తప్పును తాము చేస్తున్నారు.

**గజం రూ.11,500 చొప్పున ధర సృష్టించి మోసం**

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ఈ భూమిని ఇళ్ల స్థలాలుగా పేర్కొంటూ గజం రూ.11,500 చొప్పున మార్కెట్ వ్యాల్యూ సర్టిఫికెట్ తీసుకుని 6050 గజాలకు రూ.7 కోట్లు మార్కెట్ విలువ చూపించే ప్రయత్నం చేస్తున్నారు. ఇళ్ల స్థలాలుగా పరిగణించాలంటే 1.25 ఎకరంలో 40 శాతం భూమిని మౌలిక వసతుల కల్పనకు తీసేయాల్సి ఉంటుంది. అంటే కేవలం 3650 గజాలకు మాత్రమే గజం రూ.11500 చొప్పున లెక్క వేయాలి. అప్పుడు ఆ భూమి విలువ గరిష్ఠంగా రూ.4 కోట్లు అవుతుంది. అలా కానీ పక్షంలో 1.25 ఎకరాకు అప్రూవ్డ్ లే అవుట్ చూపాల్సి ఉంటుంది. కానీ ఈ రెండింటినీ కేడీసీసీ బ్యాంకు అధికారులు ఉద్దేశపూర్వకంగా విస్మరిస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో గరిష్ఠంగా రూ.2 కోట్లు.. రిజిస్ట్రార్ ఆఫీసు ధరల ప్రకారమే అప్రూవ్డ్ లే అవుట్‌గా పరిగణించి చూసినా గరిష్ఠంగా రూ.4 కోట్లు చేయని భూమిని రూ.8 కోట్లకు జమ వేసుకునేందుకు సిద్ధం చేస్తుండటం గమనార్హం. 10 రోజుల క్రితం పెడన -బంటుమిల్లి బైపాస్‌లోనే సర్వే నంబరు 662/4సిలో ఉన్న 65 సెంట్ల భూమిని వేలం వేసి, దాన్ని 3146 గజాలుగా చూపుతూ సుమారు రూ.4 కోట్లకు జమ వేసుకున్నారు.

**అక్రమార్కులను కాపాడేందుకేనా?**

వ్యవసాయభూమిని గజాల్లో చూపి కోట్లాది రూపాయలు రుణం తీసుకుని ఎగ్గొట్టిన వ్యవహారంలో కీలకపాత్రధారులు అంతా మాజీ మంత్రి వైసీపీ నాయకుడు జోగి రమేశ్‌కు అత్యంత సన్నిహితులు. ఈ కారణంగానే వారిపై గత ఐదేళ్లలో ఎలాంటి చర్యలూ తీసుకోలేదు. రాష్ట్రంలో ప్రభుత్వం మారినా కేడీసీసీ బ్యాంకులో మాత్రం జోగి హవా నడుస్తోందని బ్యాంకు సిబ్బందే వ్యాఖ్యానిస్తున్నారు. ఈ కారణంగానే రుణ కుంభకోణంలో కీలకమైన వారిని రక్షించేందుకు గతంలో అప్పు మంజూరు చేయటానికి పెంచినట్లే మళ్లీ ఎక్కువ విలువ చూపి బ్యాంకుకు తనఖా ఆస్తిని సెట్‌ఆఫ్ చేయటానికి ప్రయత్నాలు చేస్తున్నారు.

## అథ్లెటిక్స్‌లో మెరిసిన కార్తీక



**రైల్వేస్టేషన్, ఆగస్టు 11 :** ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలిలో ఈనెల 9 నుంచి 11వ తేదీ వరకు జరిగిన 89వ జాతీయస్థాయి అంతర్ రైల్వే అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో విజయవాడ రైల్వే కమర్షియల్ విభాగం సూపరింటెండెంట్ జి.కార్తీక 6.26 మీటర్ల లాంగ్‌జంప్‌లో ద్వితీయ స్థానం సాధించింది. ట్రిపుల్ జంప్‌లో తృతీయ స్థానం పొందింది. ఈ సందర్భంగా విజయవాడ డివిజన్ రైల్వే మేనేజర్ నరేంద్ర ఎ.పాటిల్ ఆమెకు అభినందనలు తెలిపారు. ఆమె విజయంతో క్రీడాకారులను మరింత ప్రోత్సహించే బాధ్యత తమపై ఉందని ఆయన పేర్కొన్నారు. రైల్వే ఉన్నతాధికారులు, సహచర ఉద్యోగులు ఆమెను అభినందించారు.


మద్యం సీసాలు, నిందితులతో ఎస్ఈబీ సీఐ

## తెలంగాణ మద్యం స్వాధీనం

**జగ్గయ్యపేట రూరల్, ఆగస్టు 11 :** జాతీయ రహదారిపై చిల్లకల్లు టోల్‌ప్లాజా సమీపంలో తెలంగాణా నుంచి అక్రమంగా తరలిస్తున్న రూ. 1,12,470ల విలువ చేసే 163 తెలంగాణా మద్యం సీసాలను ఎస్ఈబీ సీఐ మణికంఠరెడ్డి స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం గుంటూరుకు చెందిన జల్లెడ మణికంఠ, షేక్ ఇలియాస్ రామాపురం క్రాస్‌రోడ్డులోని పలు దుకాణాల్లో 750మి.లీ 163 సీసాలను ప్యాసింజర్ ఆటోలో తరలిస్తుండగా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు. ఆటో, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నామన్నారు.


స్వాధీనం చేసుకున్న పీడీఎస్ బియ్యం వాహనాలు

## రేషన్ బియ్యం పట్టివేత

**గంపలగూడెం, ఆగస్టు 11 :** అక్రమంగా సేకరించిన 8.5 టన్నుల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా ఆదివారం పోలీసులు కాపు కాసి పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. ఖమ్మం జిల్లా కల్లూరులో 8.5 టన్నుల రేషన్ బియ్యాన్ని వీరులపాడు మండలం జయంతి గ్రామానికి చెందిన కాజ సత్యం అక్రమంగా సేకరించి రెండు మినీ వ్యాన్లలో కల్లూరు నుంచి జయంతి గ్రామానికి తరలిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు మార్గమధ్యలో ఊటుకూరు వీరాంజనేయస్వామి విగ్రహం వద్దకు రాగానే రెండు వాహనాలను పట్టుకున్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. కాజ సత్యం, రెండు వాహనాల డ్రైవర్లు కల్లూరుకు చెందిన ఇనపనూరు పున్నారావు, జయంతికి చెందిన మర్రిబోయిన తిరుపతిరావుపై క్రిమినల్ కేసు నమోదు చేసినట్టు ఎస్సై శ్రీనివాసరావు తెలిపారు.

# ఆర్టీసీలో ఖాళీలు భర్తీ చేయాలి

- పీటీడీ ఈయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశం
- విలీనానంతర సమస్యలపై ఏకరువు
- ఖాళీగా పది వేల పోస్టులు!
- 3 వేలకు పైగా కొత్త బస్సులు కొనాలి



ఈయూ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ప్రసంగిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదరరావు

**విజయవాడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) :** రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ)లో ఉద్యోగుల ఖాళీలను భర్తీ చేయటంతో పాటు, కొత్త బస్సుల సంఖ్య పెంచాలని ఏపీపీటీడీ ఈయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదరరావు, జీవీ నరసయ్యలు కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం విజయవాడలోని ఈయూ రాష్ట్ర కార్యాలయంలో సంఘ కార్యవర్గ సమావేశాలు జరిగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లలో కారుణ్య నియామకాలు తప్ప ఏ కేటగిరీలో కూడా ఒక్క ఉద్యోగిని కూడా నియమించుకోవటానికి అనుమతులు ఇవ్వలేదని అన్నారు. కొత్త బస్సుల కొనుగోలుకు వైసీపీ ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందలేదన్నారు. ప్రస్తుత అవసరాలను దృష్టిలో ఉంచుకుని చూస్తే తక్షణం 3 వేలకు పైగా కొత్త బస్సులు కొనుగోలు చేయాలని పేర్కొన్నారు. ప్రజా రవాణాను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా బస్సులను పెంచటమే కాకుండా ప్రస్తుతం సంస్థలో డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ సిబ్బంది, ఇతర కేటగిరీ ఉద్యోగులు కలిపి పదివేల పోస్టుల వరకు ఖాళీగా ఉన్నాయన్నారు. ఖాళీల భర్తీకి, కొత్త బస్సులు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సహాయం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. విలీనం అనంతరం ఆర్టీసీ ఉద్యోగులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, వీటిపై ప్రభుత్వం దృష్టి సారించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ ఉద్యోగులకు అమలు చేస్తున్న ఈహెచ్‌ఎస్ వల్ల సరైన వైద్యసేవలు అందటం లేదన్నారు. మెడికల్ అన్‌ఫిట్ అవుతున్న పీటీడీ సిబ్బందికి గతంలో విధానం ప్రకారం ప్రత్యామ్నాయ ఉద్యోగాలు కల్పించాలన్నారు. విలీనానికి ముందు చనిపోయిన ఉద్యోగులలో పలు కారణాలతో ఇంకా కారుణ్య నియామకాలు పొందని వారికి ఉద్యోగాలు కల్పించాలన్నారు. విలీనం అనంతరం పెండింగ్‌లో పెట్టిన పదోన్నతులకు అనుమతులు ఇవ్వాలన్నారు. క్యాడర్ స్ట్రెంగ్త్ వల్ల ఇబ్బందులు పడుతున్న ఉద్యోగుల సమస్యలను తక్షణం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా అప్పట్లో ఇచ్చిన సర్క్యులర్ నెంబర్ 01/2019ని గత ప్రభుత్వం సడలింపులు చేసి జీవో నెంబర్ 70/71లు ఇచ్చి ఉద్యోగులకు తీవ్రమైన పనిష్మెంట్లు ఇస్తున్నారని, పాత సర్క్యులర్‌ను అమలు చేసేందుకు చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

**బ్రాయిలర్ ధరలు**

| అమరావతి | (రూ.లలో) |
|---|---|
| బ్రాయిలర్ బర్డ్ | 92, 101, 112 |
| చికెన్ విత్ స్కిన్ | 178 |
| చికెన్ స్కిన్‌లెస్ | 188 |

**నెక్ కోడిగుడ్డు ధర**
విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.75

## ఉపాధి హామీ పనులకు నిధుల కేటాయింపు పెంచాలి: సీపీఎం

**గవర్నర్‌పేట, ఆగస్టు 11:** రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధి హామీ గ్రామ సభలు నిర్వహించడంతో పాటు ఉపాధి హామీ పనులకు నిధుల కేటాయింపు పెంచాలని సీపీఎం డిమాండ్ చేసింది. జాబ్ కార్డులు పొందిన ప్రతి కుటుంబానికి 100 రోజులు పని కల్పించాలని, కాంట్రాక్టర్లకు కేటాయించకుండా పనులను విస్తృతంగా చేపట్టి మరిన్ని ఉపాధి పనులు కల్పించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వ్యవసాయ కార్మికులు చేయగలిగిన 29 రకాల పనులు, కాలువలు తవ్వకం, మట్టి తీయడం, జంగిల్ క్లియరెన్స్ వంటి పనులు ఇప్పటికే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గుర్తించాయని, ఉపాధి హామీ ద్వారా భూమి అభివృద్ధి పనులు చేపట్టి గ్రామ అభివృద్ధి, మట్టి రోడ్డు ద్వారా వ్యవసాయ కార్మికులకు మరిన్ని ఉపాధి పనులు కల్పించాలని డిమాండ్ చేశారు.

## యువకుడి ఆత్మహత్య

**అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 11:** ఉరేసుకుని ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై అజిత్ సింగ్‌నగర్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. స్థానిక ఎక్సెల్ ప్లాంట్ ప్రాంతానికి చెందిన సుర్రాతి నంద కైలాష్(24) ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పని చేస్తున్నాడు. శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరేసుకుని మృతి చెందాడు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అనారోగ్య కారణాలతోనే ఆత్మహత్యకు పాల్పడినట్టు లేఖలో కైలాష్ పేర్కొన్నాడు. అనారోగ్య కారణాలతోనే మృతి చెందాడా..లేక మరేమైనా కారణాలు ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి

**పాయకాపురం, ఆగస్టు 11:** విద్యుదాఘాతంతో కార్మికుడు మృతి చెందిన ఘటన పాయకాపురం ప్రాంతంలో ఆదివారం జరిగింది. రామవరప్పాడుకు చెందిన యలమల కరుణకుమార్(27) కబ్‌బోర్డు మేస్త్రీగా పని చేస్తున్నాడు. సుందరయ్యనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఓ ఇంటి పని కోసం ఆదివారం వచ్చాడు. భవనం 1వ అంతస్తులో కరుణకుమార్ పొడవాటి అల్యూమినియం బద్దీలతో పని చేస్తుండగా అవి విద్యుత్ సర్వీస్ వైర్లు తగిలాయి. విద్యుదాఘాతానికి గురైన కరుణకుమార్‌ను తోటి కార్మికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. నున్న రూరల్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.





సితార టు గొల్లపూడి..

సితార సమీపంలో మార్జిన్‌ల వద్ద బడ్డీలు

హెచ్‌బీ కాలనీ పోలీస్‌స్టేషన్ సమీపంలో మార్జిన్‌ల వద్ద లారీల నిలిపివేత

# జంక్షన్ జామ్

- కబ్జా కోరల్లో 200 అడుగుల రోడ్డు
- రాత్రి అయితే ఫుడ్‌కోర్టులతో అస్తవ్యస్తం

**భవానీపురం:** పశ్చిమలోని సితార నుంచి గొల్లపూడి జంక్షన్ వరకు రోడ్డు ఆక్రమణలు, కబ్జా కోరల్లో చిక్కుకున్నాయి. ఎక్కడ లేని విధంగా ఈ ప్రాంతంలోనే 200 అడుగుల మేర రోడ్లపై ఎవరికివారు ఇష్టానుసారంగా రోడ్డు మార్జిన్‌లు దాటి ఆక్రమణలకు పాల్పడటంతో ఈ ప్రాంతం బక్కచిక్కుతోంది. నిత్యం రద్దీగా ఉండే ఈ రోడ్డును మోడల్‌గా సుందరీకరణ చేయకపోతే పూర్తిస్థాయిలో ఆక్రమణదారులు చేతుల్లోకి కార్పొరేషన్ స్థలాలు చేరిపోయే ప్రమాదముంది. రాత్రి అయితే చాలు సితార, ఆర్టీసీ వర్కుషాపు రోడ్డు, జోజినగర్ చర్చి, హెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్, ఎట్కిన్‌సన్ స్కూల్ (గొల్లపూడి హోల్‌సేల్ కాంప్లెక్సు) వరకు జంక్షన్లు జామ్ అయిపోతున్నాయి. ఈ రోడ్డు గుండానే చనుమోలు ఫ్లై ఓవర్ బ్రిడ్జి మీదుగా హైదరాబాద్‌కు వివిధ లోడ్ లారీలు, హైటెక్ బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి. సితార సెంటర్‌లో ఆటోవాలాలు, గంజాయ్ బ్యాచ్‌లతో ఈ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయింది. 200 అడుగుల రోడ్డు కాస్త ఇటు పండ్ల వ్యాపారులు, అటు బొమ్మలు వ్యాపారులు, ఫుడ్‌కోర్టులుగా ఉండే బడ్డీలతో అస్తవ్యస్తంగా మారింది. వీఎంసీ అధికారుల ప్లేవర్ బ్లాక్స్ ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తున్నా వాటికి తూట్లు పొడుస్తూ వివిధ లోడు లారీలు, బడ్డీలు, వివిధ పండ్లు అమ్మే బండ్లతో రోడ్డంతా బ్లాక్ చేసేస్తున్నారు. రెండు నియోజకవర్గాల పరిధిలో ఉండే విశాలమైన 200 అడుగుల రోడ్డుపై ఆక్రమణలను తొలగించకపోతే రాబోయే రోజుల్లో ప్రమాదాల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. ఈ సందర్భంగా స్థానికుడైన పరిమి మల్లేశ్వరరావు మాట్లాడుతూ సితార నుంచి గొల్లపూడి జంక్షన్ వరకు వివిధ కూడళ్లలోని ఆక్రమణల వల్ల పగలు, రాత్రీ తేడా లేకుండా ప్రజలు ప్రమాదాల బారినపడుతున్నారన్నారు. ఆర్ అండ్ రోడ్లు మార్జిన్లు దాటి వ్యాపారం చేస్తున్న వ్యాపారుల కారణంగా విశాలమైన రోడ్డు అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఎమ్మెల్యే సుజనాచౌదరి, కమిషనర్ ధ్యాన్‌చంద్ర దృష్టి సారించాలని ఆయన కోరారు.



మాకినేని బసవపున్నయ్య స్టేడియాన్ని పరిశీలిస్తున్న బొండా ఉమా

## ఎంబీ స్టేడియాన్ని అభివృద్ధి చేస్తాం

- ఎమ్మెల్యే బొండా ఉమా

**అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 11:** మాకినేని బసవపున్నయ్య స్టేడియాన్ని అన్ని రకాల హంగులతో అభివృద్ధి చేసి, క్రీడాకారులకు అందుబాటులోకి తెస్తామని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు తెలిపారు. ఆదివారం ఆయన స్టేడియాన్ని పరిశీలించారు. వాకింగ్ ట్రాక్ పూర్తిగా దెబ్బతిందని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగా స్టేడియం, వాకింగ్ ట్రాక్‌లు దెబ్బతిన్నాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. నగరపాలక సంస్థ ఈఈ శ్రీనివాస్‌తో మాట్లాడి తక్షణమే ఎంబీపీ స్టేడియం అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలని ఆదేశించారు. మౌలిక సదుపాయాలు కల్పించి క్రీడాకారులకు అందుబాటులోకి తేవాలని ఆయన సూచించారు.



## ముఖ్యమంత్రిని మీ కాలనీకి తీసుకొస్తా



నారా చంద్రబాబునాయుడు కాలనీవాసులకు హామీ ఇస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

**పటమట, ఆగస్టు 11:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును మీ కాలనీకి తీసుకువస్తానని 9వ డివిజన్ లోని నారా చంద్రబాబు నాయుడు కాలనీ వాసులకు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హామీ ఇచ్చారు. త్వరలోనే కాలనీ వాసులకు కృష్ణానది నీటిని అందిస్తామన్నారు. ఆదివారం ఆయన కాలనీలో పర్యటించి, స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కాలనీవాసుల సమావేశంలో మాట్లాడారు. తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఈ కాలనీ ఉండటం తన అదృష్టంగా భావిస్తున్నానని ఎమ్మెల్యే తెలిపారు. ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం ఇవ్వడం ద్వారా రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకు వెళ్లాలని చంద్రబాబు కృషిచేస్తున్నారన్నారు. రూ.70 కోట్లతో ఇక్కడ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మాణం జరుగుతుందన్నారు. కాలనీ అధ్యక్షుడు కె.బలరామ్, కార్పొరేటర్ చెన్నుపాటి కాంతిశ్రీ, చెన్నుపాటి గాంధీ, యలమంచిలి దేవేంద్ర, ముమ్మనేని ప్రసాద్, బాబీ, సీహెచ్ లక్ష్మీనరసింహారావు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సుజనా చౌదరికి మొక్క అందజేస్తున్న తహసీల్దార్ ఇంతియాజ్ పాషా

## మర్యాదపూర్వకంగా..

**విద్యాధరపురం, ఆగస్టు 11:** ఎమ్మెల్యే సుజనా చౌదరిని ఆదివారం పశ్చిమ తహసీల్దార్ ఇంతియాజ్‌పాషా మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయన ఎమ్మెల్యేను కలిసి అభినందనలు తెలిపారు. నియోజకవర్గ ప్రజల అవసరాలకు అనుగుణంగా వ్యవస్థ పనితీరు ఉండాలని ఎమ్మెల్యే సుజనా చౌదరి సూచించారు. తహసీల్దార్ వెంట డిప్యూటీ తహసీల్దార్ కూడా ఉన్నారు.

## బహుముఖ ప్రజ్ఞాశాలి కామేశ్వరశర్మ



కామేశ్వరశర్మ సంస్మరణ సభలో మాట్లాడుతున్న గోళ్ల నారాయణరావు, మాదిరాజు శ్రీనివాస్

**విజయవాడ కల్చరల్, ఆగస్టు 11:** పసుమర్తి కామేశ్వరశర్మ బహుముఖ ప్రజ్ఞాశాలి అని పోలవరం కోటేశ్వరరావు సాహితీ సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణ రావు అన్నారు. అయోధ్యనగర్‌లోని ఇందిరా ఎన్‌క్లేవ్ ఓపెన్ గ్రౌండ్‌లో ఆదివారం సాయంత్రం పసుమర్తి కామేశ్వర శర్మ సంస్మరణ సభ నిర్వహించారు. సనాతన ధర్మాన్ని, హైందవ తత్వాన్ని తూ.చ తప్పకుండా ఆచరించిన గొప్ప వ్యక్తి కామేశ్వరశర్మ అని గోళ్ల కొనియాడారు. ప్రసంగ ప్రజ్ఞానిధి తెలుగు పండితుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు మాట్లాడుతూ కామేశ్వర శర్మ చేసిన ఆధ్యాత్మిక, ప్రవచన, జ్యోతిష్య విషయాల్లో అనేక సేవల దృష్ట్యా ఇది సంస్మరణ సభ కాదని, స్ఫూర్తి సభగా వర్ణించారు. ఆధ్యాత్మిక పండితుడు బ్రిప్రకాశరావు మాట్లాడుతూ కామేశ్వర శర్మ ఆదర్శాలు మనలో ఉన్నంతకాలం ఆయనకు మరణం లేదన్నారు. ఇందిరా ఎన్‌క్లేవ్ కమిటీ ప్రతి ఏటా ఆయన పేరిట విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులు అందచేయనున్నట్లు పేర్కొన్నారు. జయహో భారతీయం సంస్థ ఆధ్వర్యంలో పసుమర్తి కామేశ్వర శర్మ పేరున ప్రవచన జ్యోతిష్య పండితులకు అవార్డులు ఇవ్వనున్నట్లు కమిటీ తెలిపింది. హైకోర్టు న్యాయవాది విష్ణుభొట్ల జయప్రకాష్, ఇందిరా ఎన్‌క్లేవ్ ప్రెసిడెంట్ ఎం.శ్రీనివాస్, సెక్రటరీ శరత్‌చంద్ర, పసుమర్తి అవధాని, పసుమర్తి రామలింగేశ్వరప్రసాద్, డాక్టర్ వై.నారాయణరావు, సాంబశివరాజు, కమిటీ సభ్యుల, మహిళలు పాల్గొన్నారు.



## డ్రగ్ ఫ్రీ ఇండియాపై అవగాహన

**పటమట, ఆగస్టు 11:** వికసిత భారత్-2047 లక్ష్యసాధనలో ప్రతి ఒక్కరూ ముందుండాలని, భారతదేశం విద్య, వైద్య సాంకేతిక రంగాల్లో ముందుకు సాగాలని, యువత ముఖ్యపాత్ర పోషించాలని స్టెల్లా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ జసింతా క్వాడ్రస్ పిలుపునిచ్చారు. వికసిత భారత్ లక్ష్యంగా ఆదివారం కళాశాల విద్యార్థినులు ఎల్‌ఈపీఎల్ ఐనాక్స్ థియేటర్ ప్రాంగణంలో డ్రగ్స్ వాడకం వలన జరిగే అనర్థాలను వివరించారు. డ్రగ్స్ వాడటంతో యువత అనారోగ్యం పాలవుతుందని భావి భారత పౌరులైన యువత మాదక ద్రవ్యాలకు బానిసలు కాకూడదనే ఉద్దేశంతో నగర ప్రజలకు సందేశం ఇవ్వడానికి ఈ అవగాహన సదస్సు ఏర్పాటు చేశామని సబ్ ఎల్‌టీ స్వప్న తెలిపారు. డ్రగ్స్ వాడకంపై వలన తలెత్తే అనర్థాలను సందేశాత్మక స్కిట్‌ను ఫ్లాష్‌మాబ్‌ను చేయించారు. కెప్టెన్ శైలజ, ఎన్‌సీసీ క్యాడెట్స్, విద్యార్థినులు పాల్గొన్నారు.



ఫ్లాష్‌మాబ్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థినులు



## మంత్రి నారా లోకేశ్‌ను కలిసిన ఎంపీ కేశినేని చిన్ని



**వన్‌టౌన్, ఆగస్టు 11 :** విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) ఆదివారం రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, సమాచార సాంకేతికత, ఐటీ కమ్యూనికేషన్స్ శాఖ మంత్రి నారా లోకేశ్‌ను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పార్లమెంట్ సమావేశాల వివరాలను లోకేశ్‌కు తెలియజేశారు. ఇరువురి మధ్య రాష్ట్ర రాజకీయాలపై చర్చ జరిగింది.

## వంటగది నిర్మాణానికి శంకుస్థాపన

**పటమట, ఆగస్టు 11:** రోటరీ క్లబ్ మిడ్‌టౌన్ ఆధ్వర్యంలో పటమట జెడ్పీ హైస్కూల్‌లో కమ్యూనిటీ వంటగది నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. రూ. 2లక్షల వ్యయంతో రోటరీక్లబ్ మిడ్‌టౌన్ ఈ కిచెన్‌షెడ్ నిర్మించ తలపెట్టింది. క్లబ్ మాజీ అధ్యక్షుడు పొన్నం అనిల్‌బాబు, మహేష్ చంద్ జాజు ఆర్థిక చేయూతతో ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ వంటగది పర్యవేక్షణ క్లబ్ కమ్యూనిటీ వింగ్ డైరెక్టర్ పొదిలి వసంత్‌కుమార్ ఆధ్వర్యంలో జరగనుంది. నగరం, గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు అవసరమైన సదుపాయాలను రోటరీ మిడ్‌టౌన్ కల్పిస్తుందని క్లబ్ అధ్యక్షుడు గుడిపాటి కిషోర్ చెప్పారు. ఈ కార్యక్రమాలకు సహాయ సహకారాలందిస్తున్న అనిల్‌బాబు, మహేష్ చంద్ జాజును అభినందించారు. క్లబ్ సలహాదారు యడ్ల పార్థసారథి, ఉపాధ్యక్షుడు కోనేరు మధు పాల్గొన్నారు.

## ఆటా- పాట ప్రదర్శనలను జయప్రదం చేయండి

**సత్యనారాయణపురం, ఆగస్టు 11:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఆటా-పాటా సాంస్కృతిక ప్రదర్శనలో కార్మికులు, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు కె.దుర్గారావు, ఎం.సుధాకర్ అన్నారు. దుర్గాపురం సీఐటీయూ కార్యాలయం నండూరి ప్రసాదరావు భవనంలో ఆదివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని నెమరువేసుకుంటూ కళారూపాలతో ఆగస్టు 14న వాంబేకాలనీ జంధ్యాల దక్షిణామూర్తి స్కూల్ వద్ద సాయంత్రం 6 గంటలకు నుంచి నిర్వహిస్తామన్నారు. సాంస్కృతిక కళారూపాలు, అభ్యుదయ పాటలు, కోలాటం, వీణ వంటివి జరుగుతాయన్నారు. ముఖ్యఅతిథిగా సీఐటీయూ అఖిల భారత అధ్యక్షురాలు డా.కె.హేమలత, రాష్ట్ర పౌరసంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ సీహెచ్ బాబూరావు పాల్గొంటారన్నారు. సీఐటీయూ నగర నేతలు టి.ప్రవీణ్, వై. సుబ్బారావు, ఎం. బాబూరావు, ఎం. హనుమంతు పాల్గొన్నారు.

## కామర్స్ టాలెంట్ హంట్‌కు విశేష స్పందన

**వన్‌టౌన్, ఆగస్టు 11 :** కామర్స్ టాలెంట్ హంట్ 2024కు విశేష స్పందన వచ్చింది. ఆదివారం విజయవాడ ఎంబీ భవన్‌లో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విజయవాడ చాప్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కృష్ణాజిల్లా నుంచి 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ ప్రథమ సంవత్సరం విద్యార్థులు సుమారు 450 మంది పాల్గొన్నారు. పోటీలలో ప్రథమ బహుమతి కింద సీహెచ్ అభిలాష్, సి.వెంకట అశ్విత్‌లకు రూ.5వేలు చొప్పున అందజేశారు. కార్యక్రమానికి పొన్నగంటి వినయ రంజన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

## కరి నరసింహారావుకు ఘన నివాళి

**మాచవరం, ఆగస్టు 11:** డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ వర్శిటీ ఎంప్లాయిస్ యూనియన్ మాజీ అధ్యక్షుడు కర్రి నరసింహారావు సంతాప సభ ఆదివారం శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలో జరిగింది. ఉద్యోగ సంఘాల నేతలు హాజరై ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. ఏపీఎన్‌జీవోస్ జిల్లా అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్, కార్యదర్శి సత్యనారాయణరెడ్డి, మాజీ కార్యదర్శి మహ్మద్ ఇక్బాల్, జి.నారాయణ, సీవీఆర్ ప్రసాద్, నసీరుద్దీన్, చిగురుపాటి బాబురావు, కిషోర్, కెఎస్. లక్ష్మణరావు, డీవీఆర్. స్వామి తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

## ఏపీ వైద్య సేవ జాయింట్ యాక్షన్ కమిటీ ఎన్నిక

**పాయకాపురం, ఆగస్టు 11:** డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ పథకంలో రాష్ట్రవ్యాప్తంగా పని చేస్తున్న సిబ్బంది మొత్తం ఏపీ వైద్య సేవా జాయింట్ యాక్షన్ కమిటీగా ఏర్పాటైంది. ఏపీ ఆరోగ్య మిత్ర కాంట్రాక్ట్ అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర నేతల ఆధ్వర్యంలో ఎన్టీఆర్ వైద్య సేవ సిబ్బంది సమావేశం ఆదివారం జరిగింది. నగరంలోని యూటీఎఫ్ భవన్‌లో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీలో రాష్ట్ర అధ్యక్షుడిగా చవ్వాకుల గోవిందు, ఉపాధ్యక్షుడిగా గార్లపాటి నాగరాజు ఎన్నికయ్యారు.

## వేడినూనె పడి ఒకరికి గాయాలు

**పాయకాపురం, ఆగస్టు 11:** వేడి నూనె పడి ఒకరు గాయాలపాలైన ఘటనపై నున్న రూరల్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. నున్న గ్రామానికి చెందిన వి.నరసింహారావు(32) మిషన్ ఆపరేటర్‌గా పనిచేస్తుంటాడు. శనివారం రాత్రి మద్యం సేవించి ద్విచక్రవాహనంపై రామచంద్రాపురం అడ్డరోడ్డు వైపు నుంచి నున్న గ్రామానికి వస్తున్నాడు. నరసింహ స్వామి ఆలయం వద్దకు రాగానే ద్విచక్రవాహనం అదుపు తప్పి పునుగుల బండిని ఢీకొట్టింది. ఆ సమయంలో బండిపై పునుగులు వేపుతున్న వేడినూనె నరసింహారావుపై పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి నున్న రూరల్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## 16 మంది పేకాటరాయుళ్లపై కేసు

- రూ.47వేలు స్వాధీనం

**వన్‌టౌన్, ఆగస్టు 11:** ఓ ఇంటిలో పేకాడుతున్న 16మందిపై ఆదివారం గవర్నర్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేకాటరాయుళ్ల నుంచి రూ.47వేలు స్వాధీనం చేసుకుని, గవర్నర్‌పేట పోలీసులకు అప్పగించారు. గవర్నర్‌పేటలోని ఓ ఇంటిలో కొందరు పేకాడుతున్నట్లు సమాచారం టాస్క్‌ఫోర్స్ అధికారులకు తెలియడంతో వారు గవర్నర్‌పేట పోలీసులతో కలిసి శిబిరంపై దాడిచేసి 15 మందిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.47 వేలు స్వాధీనం చేసుకున్నారు. పేకాట నిర్వాహకుడు ఈడుపుగల్లుకు చెందిన బొబ్బా వెంకటరత్నం పరారయ్యాడు. పోలీసులు వారిపై కేసు నమోదు చేశారు. పేకాట ఆడిన వారిలో వ్యవసాయదారులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఒక లారీ డ్రైవర్ ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

## బడే ప్రభాకర్‌కు సత్కారం

**కృష్ణలంక, ఆగస్టు 11:** సీనియర్ జర్నలిస్ట్, నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) న్యూఢిల్లీ సంఘం కార్యదర్శి, 'పెన్' రాష్ట్ర సంఘం అధ్యక్షుడు బడే ప్రభాకర్‌ను ఎన్‌యూజే (ఐ) ఘనంగా సత్కరించింది. శని, ఆదివారం రెండు రోజుల పాటు బీహార్ స్టేట్ సాసారం జిల్లా కేంద్రంలో గోపాల్ నారాయణసింగ్ వర్సిటీ ప్రాంగణంలోని ఆడిటోరియంలో నిర్వహించిన నేషనల్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్స్ (ఇండియా) న్యూఢిల్లీ సంఘ జాతీయ సమావేశాల్లో ఈ మేరకు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అశోక్ మాలిక్, సురేష్ శర్మ చేతుల మీదుగా శాలువాతో సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. ముఖ్య అతిథులుగా బీహార్ విధానసభ స్పీకర్ నందకిషోర్ యాదవ్, మంత్రి సంతోష్‌కుమార్ సింగ్, గోపాల్ నారాయణ సింగ్ హాజరయ్యారు. రాష్ట్రం నుంచి జాతీయ కౌన్సిల్ సభ్యులు సింహాద్రి కృష్ణప్రసాద్, డాక్టర్ కేవీవీవీ సత్యనారాయణ, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ న్యూస్ జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ సంఘ నేతలు తాడి రంగారావు, బద్ధం సుమలత, కోట సుబ్బారావు, అన్నం గోపాలకృష్ణ పాల్గొన్నారు.

## శారద స్కూల్‌లో నాన్‌చాక్ ట్రైనింగ్ క్యాంప్

**పాయకాపురం, ఆగస్టు 11:** శాంతినగర్‌లోని శారద స్కూల్‌లో విద్యార్థులకు నాన్‌చాక్ ట్రైనింగ్ క్యాంపు ఆదివారం జరిగింది. వోకినవ వెపన్స్ ట్రైనింగ్ అకాడమీ కోచ్ బల్లం కిషోర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రైనింగ్ క్యాంపు నందు పలు పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా స్కూల్ కన్వీనర్ పెనుమత్స అప్పలరాజు పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ట్రైనింగ్ క్యాంపు శిక్షకుడు అరుణ్ పాల్గొన్నారు.

# రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతం

గ్రూప్-1 మెయిన్స్ ప్రత్యేకం
## ఇండియన్ పాలిటీ

ఎప్పుడూ లేనిది సార్వత్రిక ఎన్నికలకు ముందు, తరవాత రాజ్యాంగంపై విపరీతమైన చర్చలు జరుగుతున్నాయి. కారణం ఒక పార్టీ అధికారంలోకి వస్తే, కొనసాగితే రాజ్యాంగాన్ని మార్చేస్తుందంటూ.... విపక్షాలు పెద్దఎత్తున ప్రచారంలోకి తెచ్చాయి. మరి రాజ్యాంగాన్ని మార్చడం అంత సులభమా. ఆర్టికల్ 368 ప్రకారం ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏ భాగాన్నైనా సవరించే అధికారం పార్లమెంటుకు ఉంది. ఈ ఆర్టికల్‌లో నిజంగా రాజ్యాంగంలోని ఏ అంశాన్నైనా సవరించవచ్చా? ఈ మాట విన్నప్పుడల్లా ఏదో తెలియని అలజడి. సమాజాన్ని అంతా కదిలించిందని అనేక వార్తలు పత్రికల్లో ప్రస్ఫుటిస్తున్నాయి. దీని గురించి స్పష్టతనిచ్చే ఏదైనా అంశం ఉందా అని పరిశీలిస్తే మనకు కనపడేది ఒకే ఒక్క ఆశాకిరణం అదే 'రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతం.

రాజ్యాంగంలో ప్రాథమిక(మౌలిక) నిర్మాణం అనే భావన ప్రస్తావించలేదు. ఈ సిద్ధాంతం సుప్రీంకోర్టు తీర్పుల ద్వారా ఉద్భవించింది. కాబట్టి ప్రాథమిక నిర్మాణ సిద్ధాంతం అనేది భారతీయ న్యాయసూత్రం. భారత రాజ్యాంగం కొన్ని ప్రాథమిక లక్షణాలను కలిగి ఉంది. వీటిని పార్లమెంటు సవరణల ద్వారా మార్చలేం. లేదా నశింపచేయలేం. రాజ్యాంగ ప్రాథమిక లక్షణాలతో విభేదించే లేదా మార్చడానికి పార్లమెంటు అధికారం లేదని, రాజ్యాంగ పరిషత్‌కు మాత్రమే అలాంటి అధికారం ఉందని తీర్పు చెప్పింది. ఈ తీర్పును అధిగమించడానికి పార్లమెంటు 24వ రాజ్యాంగ సవరణ(1971)ను చేసింది. దీని ప్రకారం రాజ్యాంగ సవరణ చట్టాలు ప్రకరణ 13(2) కింద చెల్లవని ప్రకటించడానికి వీల్లేదు. అయితే కేశవానంద భారతి కేసు(1973)లో 24వ రాజ్యాంగ సవరణ చట్టాన్ని సవాలు చేశారు. ఈ కేసులో సుప్రీంకోర్టు ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏ అంశాన్ని అయినా సవరించే అధికారం పార్లమెంటుకు ఉందని, కానీ 'రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని' మార్చే అధికారం మాత్రం లేదని తీర్పునిచ్చింది. ఈ తీర్పులోని ప్రధానాంశాలను పరిశీలిస్తే పార్లమెంటుకు ఉన్న సవరణ అధికారాలపై అంతర్గతమైన, కనిపించని పరిమితిని ధర్మాసనం విధించినట్లు తెలుస్తుంది. ఈ తీర్పునే



ద్వారా రూపొందించిన రాజ్యాంగ సవరణ చట్టాలను సమీక్షించడానికి, కొట్టివేయడానికి సుప్రీంకోర్టుకు గల అధికారం ఈ సిద్ధాంతానికి ఆధారం. అయితే ప్రకరణ 368 ప్రకారం ప్రాథమిక హక్కులతో సహా రాజ్యాంగంలోని ఏదైనా భాగాన్ని సవరించవచ్చు అన్న పరిమితులు లేని పార్లమెంటుకు గల అధికారాన్ని పరిమితం చేస్తూ, తన తీర్పుల ద్వారా రాజ్యాంగ ప్రాథమిక లక్షణాలను పేర్కొంటూ, ఈ రాజ్యాంగ మౌలిక లక్షణాలను మాత్రం స్పృశించరాదంటూ(సవరించరాదంటూ) పార్లమెంటుకు కొన్ని పరిమితులను, హద్దులను ఏర్పాటు చేస్తూ న్యాయవ్యవస్థ తన తీర్పుల ద్వారా రూపొందించిన సిద్ధాంతమే రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణ సిద్ధాంతం. ఈ సిద్ధాంతం ద్వారా సుప్రీంకోర్టు, రాజ్యాంగం పవిత్రతను, రాజ్యాంగ స్వభావాన్ని పరిరక్షిస్తోంది. అందుకోసం రాజ్యాంగం తనకు కల్పించిన అధికారంతో పార్లమెంటు రాజ్యాంగ మౌలిక వ్యతిరేక రాజ్యాంగ సవరణ చట్టాలను తన తీర్పులతో ఖండిస్తూ వస్తోంది. రాజ్యాంగ ప్రాథమిక ఆదర్శ భావాలను తన తీర్పుల ద్వారా రాజ్యాంగ ప్రాథమిక స్వరూపంలోకి తెస్తూ మౌలిక నిర్మాణ సిద్ధాంతాన్ని విస్తరింపచేస్తూ ఉంది.

### మౌలిక, స్వరూప సిద్ధాంత పరిణామక్రమం

కేశవానంద భారతి కేసు(1967)లో సుప్రీంకోర్టు పార్లమెంటుకు 368వ ప్రకరణ కింద ప్రాథమిక హక్కులను సవరించే

రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతాన్ని ప్రవచించిన కేసుగా ప్రస్తావిస్తున్నారు.

**కేశవానంద భారతి కేసులో రాజ్యాంగ మౌలిక లక్షణాలుగా కింది వాటిని పేర్కొన్నారు. అవి-**

- రాజ్యాంగ ఆధిక్యత
- ప్రవేశిక
- ప్రజాస్వామ్య, గణతంత్ర ప్రభుత్వం
- రాజ్యాంగపరంగా లౌకిక స్వభావం
- శాసన, కార్యనిర్వాహక, న్యాయశాఖల మధ్య అధికార పృథక్కరణ
- సమాఖ్య లక్షణం
- భారతదేశ సార్వభౌమాధికారం, ఏకత్వం
- ప్రజాసామ్యబద్ధమైన రాజకీయ వ్యవస్థ కలిగి ఉండటం
- వైయక్తిక స్వేచ్ఛ

### ఇందిరాగాంధీ వర్సెస్ రాజ్‌నారాయణ్ కేసు(1975)

ఈ కేసులో భారత రాజ్యాంగ మౌలిక స్వరూప లక్షణాలుగా కింది వాటిని పేర్కొన్నారు.

- భారతదేశం ఒక సార్వభౌమాధికార, ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యం
- సమాన హోదా అవకాశాలు
- లౌకికత్వం
- అంతరాత్మ స్వాతంత్ర్యం
- సమన్యాయం

### మినర్వా మిల్స్ కేసు(1980)

కేశవానంద భారతి కేసు తీర్పు తరవాత పార్లమెంటు 42వ రాజ్యాంగ సవరణ(1976) ద్వారా ప్రకరణ 368కి 4, 5 క్లాజులను చేర్చి న్యాయసమీక్షాధికారాన్ని తగ్గించడం ద్వారా రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతాన్ని తగ్గించడానికి ప్రయత్నించింది. అయితే సుప్రీంకోర్టు మినర్వా మిల్స్ కేసులో ప్రకరణ 368కి చేర్చిన 4, 5 క్లాజులు చెల్లవని తీర్పుచెప్పి రాజ్యాంగ మౌలిక స్వరూప సిద్ధాంతానికి తిరిగి ప్రాణప్రతిష్ఠ చేసి తన ఉనికిని సగౌరవంగా చాటుకుంది.

### వామన్‌రావ్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు(1981)

ఈ కేసులో కూడా మౌలిక నిర్మాణ సూత్రాన్ని సుప్రీంకోర్టు మరోసారి నొక్కిచెప్పింది. మౌలిక నిర్మాణం అనే భావన 24 ఏప్రిల్ 1973(కేశవానంద భారతి కేసు తీర్పు) తరవాత జరిగిన అన్ని రాజ్యాంగ సవరణ చట్టాలకు వర్తిస్తుందని స్పష్టం చేసింది. జమ్మూకాశ్మీర్‌లో కాంట్రాక్ట్ వర్క్స్ రద్దుకు సంబంధించి దాఖలైన కేసులో జమ్మూకాశ్మీర్, లద్దాఖ్ హైకోర్టు వ్యాఖ్యానిస్తూ.. ఆర్టికల్ 21 కింద హామీ ఇచ్చిన జీవించేహక్కు అండ్ స్వేచ్ఛహక్కు; ఆర్టికల్ 19(ఎ)(జి) ప్రకారం హామీ ఇచ్చిన వాణిజ్యం లేదా వ్యాపారాన్ని కొనసాగించే హక్కు తప్పనిసరిగా రాజ్యాంగ ప్రాథమిక నిర్మాణాన్ని ఏర్పరుస్తుందని, పార్లమెంటు రాజ్యాంగాన్ని సవరించడం ద్వారా కూడా రాజ్యాంగం ప్రాథమిక నిర్మాణాన్ని తారుమారుచేయడం సాధ్యం కాదని 29 జూలై 2024న కోర్టు పేర్కొనడం గమనార్హం.



డాక్టర్ సుంకర రమాదేవి,
అసిస్టెంట్ ప్రొఫెసర్

- **కిహోటో హోలోహన్ వర్సెస్ జుచిల్హు కేసు(1992):** ఈ కేసులో ప్రాథమిక నిర్మాణ లక్షణాలకు స్వేచ్ఛ, న్యాయమైన ఎన్నికలు జోడించారు.
- **ఇందిరా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు(1992):** ఈ కేసులో 'రూల్ ఆఫ్ లా'ను ప్రాథమిక లక్షణంగా పేర్కొంది.
- **ఎస్ఆర్ బొమ్మై వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసు(1994):** ఈ కేసులో సమాఖ్య నిర్మాణం, భారతదేశ ఐక్యత, సమగ్రత, లౌకికవాదం, సామ్యవాదం, సామాజిక న్యాయం, న్యాయసమీక్ష ప్రాథమిక లక్షణాలుగా పునరుద్ఘాటించింది.
- **ఐఆర్ కొయల్హో వర్సెస్ తమిళనాడు కేసు(2007):** ఈ కేసులో కేశవానంద భారతి కేసులో తీర్పు వెలువడిన తరవాత 9వ షెడ్యూల్‌లో చేర్చిన చట్టాల రాజ్యాంగబద్ధతను న్యాయస్థానంలో ప్రశ్నించవచ్చని పేర్కొన్నారు.

# టైమ్ సీక్వెన్స్ టెస్ట్

## రీజనింగ్

ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

**1. ముగ్గురు స్నేహితులు సినిమాకి వెళ్లాలనుకున్నారు. సాగర్ "నేను శుక్రవారం, శనివారం, సోమవారం అందుబాటులో ఉండగలను" అని చెప్పాడు. మరో స్నేహితుడు సందీప్ "నేను బుధవారం, శుక్రవారం, ఆదివారం అందుబాటులో ఉండగలను" అని చెప్పాడు. ఇంకొక స్నేహితుడు శ్రీకర్ "నేను సోమవారం, గురువారం, శనివారం అందుబాటులో ఉండగలను" అని చెప్పాడు. అయితే వారు ముగ్గురు ఏ రోజున సినిమాకు వెళ్లడానికి సాధ్యమవుతుంది.**

ఎ) గురువారం బి) శుక్రవారం
సి) ఏరోజు సాధ్యం కాదు డి) చెప్పలేం.

**సమాధానం:** (సి)

**వివరణ:** సాగర్ అందుబాటులో ఉండే రోజులు శుక్ర, శని, సోమ వారాలు. సందీప్ అందుబాటులో ఉండే రోజులు బుధ, శుక్ర, ఆది వారాలు. శ్రీకర్ అందుబాటులో ఉండే రోజులు సోమ, గురు శని వారాలు

ముగ్గురుస్నేహితులకు కామన్‌గా ఏ రోజు అందుబాటులో లేదు. కావున ఏ రోజు సాధ్యంకాదు అనేది సమాధానం అవుతుంది.

**2. ఆకాశ్ ప్రతి రోజు ఇంటి నుంచి బస్టాండ్‌కు బయలుదేరే సమయం కంటే ఈరోజు 15 ని.లు ముందు బయలుదేరాడు. ఇంటి నుంచి బస్టాండ్‌కు 10 ని.లు సమయం అవసరం. ఈరోజు ఆకాశ్ బస్టాండ్‌కు చేరుకున్న సమయం 8.40 ఎ.ఎం. అని అతను ప్రతిరోజు ఇంటి నుంచి బస్టాండ్‌కు ఏ సమయంలో బయలుదేరేవాడు?**

ఎ) 8.30 ఎ.ఎం. బి) 8.45 ఎ.ఎం.
సి) 8.15 ఎ.ఎం. డి) ఏదీకాదు

**సమాధానం:** (బి)

**వివరణ:** ఆకాశ్ ఈరోజు బస్టాండ్‌కు చేరుకున్న సమయం 8.40 ఇంటి నుంచి బస్టాండ్‌కు 10 ని.ల సమయం అవసరం అనగా ఈరోజు ఇంటి నుంచి బస్టాండ్‌కు బయలుదేరిన సమయం 8.40-10=8.30 ఎ.ఎం. ప్రతిరోజు కంటే ఈరోజు 15 ని.ల ముందు బయలుదేరాడు. అనగా దీని అర్థం ప్రతిరోజు, ఈరోజు కంటే 15 ని.ల ఆలస్యంగా బయలుదేరతాడని అర్థం. కావున ప్రతిరోజు ఇంటి నుంచి బస్టాండ్‌కు ఆకాశ్ బయలుదేరు సమయం 8.30+15=8.45 ఎ.ఎం.(ప్రతిరోజు 8.45 ఎ.ఎం.కి బయలుదేరితేనే కదా ఈ రోజు 15 ని.లు ముందుగా అనగా 8.30 ఎ.ఎం. అయ్యేది.)

**3. ఒక మంత్రి సమావేశానికి 11.00 ఎ.ఎం. కంటే 20 ని.లు ముందు వచ్చారు. ఈయన అతిథుల కంటే 15 ని.లు ఆలస్యంగా వచ్చారు. అతిథులు సమావేశ సమయం కంటే 5 ని.ల ముందు ఉన్నారు అయితే ఏ సమయంలో సమావేశాన్ని నిర్వహించవచ్చు?**

ఎ) 10.15 ఎ.ఎం. బి) 10.20 ఎ.ఎం.
సి) 10.30 ఎ.ఎం. డి) ఏదీకాదు

**సమాధానం:** (సి)


**వివరణ:** మంత్రి సమావేశానికి 11.00 ఎ.ఎం. కంటే 20 ని.ల ముందు వచ్చారు. అనగా మంత్రి చేరుకొన్న సమయం 11.00-20=10.40 ఎ.ఎం. ఆయన అతిథుల కంటే 15 ని.ల ఆలస్యంగా వచ్చారు అనగా దీని అర్థం అతిథులు, మంత్రిగారి కంటే 15 ని.ల ముందుగానే ఉన్నారు. కావున అతిథులు వచ్చిన సమయం 10.40 - 15 ని.లు = 10.25 ఎ.ఎం. అతిథులు సమావేశానికి 5 ని॥ ముందుగానే ఉన్నారు. అనగా 5 ని॥లలో సమావేశం ప్రారంభమవుతుందని అర్థం. కావున సమావేశ సమయం 10.25 + 5 = 10.30 సమాధానం అవుతుంది.

**4. ఇంటర్వ్యూను నిర్వహించడానికి మేనేజింగ్ డైరెక్టర్ 10.30 ఎ.ఎం. కంటే 15 ని.ల ముందు వచ్చారు. ఆయన చైర్మన్ కంటే 20 ని.ల ముందు వచ్చారు. చైర్మన్ ఇంటర్వ్యూ సమయం కంటే 25 ని.ల ముందు వచ్చారు. అయితే ఏ సమయంలో ఇంటర్వ్యూ నిర్వహించవచ్చు?**

ఎ) 11.00 ఎ.ఎం. బి) 11.10 ఎ.ఎం.
సి) 10.50 ఎ.ఎం. డి) ఏదీకాదు

**సమాధానం:** (ఎ)

**వివరణ:** మేనేజింగ్ డైరెక్టర్ 10.30 ఎ.ఎం. కంటే 15 ని.ల ముందు వచ్చారు. అనగా మేనేజింగ్ డైరెక్టర్ వచ్చిన సమయం 10.30 - 15 = 10.15 ఎ.ఎం. ఆయన చైర్మన్ కంటే 20 ని.ల ముందుగానే ఉన్నాడు. అనగా దీని అర్థం చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కంటే 20 ని.ల ఆలస్యంగా వచ్చారని తెలుస్తున్నది. అనగా చైర్మన్ వచ్చిన సమయం 10.15+20=10.35 ఎ.ఎం. ఆయన ఇంటర్వ్యూ సమయం కంటే 25 ని.ల ముందు ఉన్నాడు. అనగా ఆయన వచ్చిన 25 ని.ల తరవాత



ఇంటర్వ్యూ జరుగుతుందని అర్థం. కావున ఇంటర్వ్యూ నిర్వహించే సమయం 10.35+25 ని.లు = 11.00 ఎ.ఎం. సమాధానం అవుతుంది.

**5. ఒక రైలు విజయవాడకు ప్రతి గంటకు ఉంది. విచారణాధికారి(ఎంక్వైరీ క్లర్క్) తనను కలిసిన ప్రయాణికులతో రైలు వెళ్ళిపోయి 15 ని.లు అయినది. తరవాత రైలు 11.00 ఎ.ఎం. అని చెప్పారు. అయితే ఈ సమాచారాన్ని విచారణాధికారి ప్రయాణికుడితో ఏ సమయంలో చెప్పారు?**

ఎ) 10.20 ఎ.ఎం. బి) 10.15 ఎ.ఎం.
సి) 10.30 ఎ.ఎం. డి) ఏదీకాదు

**సమాధానం:**(బి)

**వివరణ:** ప్రశ్నలో రైలు ప్రతి గంటకు ఉంది తరవాత రైలు 11.00 ఎ.ఎం. అని ఇచ్చారు. అనగా దాని ముందు రైలు సమయం 10.00 ఎ.ఎం. విచారణాధికారి (ఎంక్వైరీ క్లర్క్) రైలు వెళ్ళిపోయి 15 ని.లు అయిందని చెప్పారు. అనగా దీని అర్థం ప్రయాణికుడు 15 ని.ల ఆలస్యంగా వచ్చాడు (ఆలస్యంగా వస్తేనేగా రైలు వెళ్ళిపోయింది) కావున విచారణాధికారికి, ప్రయాణికుడికి మధ్య సంభాషణ జరిగిన సమయం 10.00 + 15 ని॥ = గం॥ 10.15 ని.లు సమాధానం అవుతుంది.



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ





## కొత్త లుక్‌లో

క్లాస్ లుక్‌లో సింపుల్‌గా చిరునవ్వుతో కనిపించే మహేశ్‌బాబు ఈసారి సరికొత్త లుక్‌లో కనిపించి అభిమానులను ఆశ్చర్యపరిచారు. ఆయన పోనీటెయిల్, గుబురుగడ్డంతో ఉన్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. రాజమౌళితో చేస్తున్న చిత్రం కోసమే మహేశ్ ఈ కొత్తలుక్‌లోకి మారారని టాక్. ఇటీవలే మహేశ్‌బాబు తన పుట్టిన రోజు సందర్భంగా కుటుంబంతో కలసి విహార యాత్రకు రాజస్థాన్‌లోని జైపూర్ వెళ్లారు. తిరిగి వచ్చేటప్పుడు జైపూర్ ఎయిర్‌పోర్ట్‌లో కొత్త లుక్‌లో కనిపించారు.

## రెండింతల వినోదంతో వస్తున్నాం
- పూరి జగన్నాథ్



'రామ్ పోతినేని లేకపోతే ఇస్మార్ట్ శంకర్ లేదు. డబుల్ ఎనర్జీతో ఈ సినిమా చేశాడు. సంజయ్‌దత్‌కు నేను పెద్ద అభిమానిని. ఆయన నటన ఈ సినిమాకు ప్రత్యేకార్షణ. రామ్ మిమ్మల్ని ఎంటర్‌టైన్ చేయడానికి సిద్ధంగా ఉన్నాడు. సినిమాను బ్లాక్‌బస్టర్ చేయండి' అని దర్శకుడు పూరి జగన్నాథ్ ప్రేక్షకులను కోరాడు. ఆయన దర్శకత్వంలో రామ్ పోతినేని హీరోగా తెరకెక్కిన చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం చిత్రబృందం వరంగల్‌లో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా రామ్ మాట్లాడుతూ "ఇస్మార్ట్ శంకర్‌కు మించేలా 'డబుల్ ఇస్మార్ట్' ఉంటుంది. పూరి జగన్నాథ్ గన్ లాంటివారు. గన్ బావుంటే బుల్లెట్ ఎంత ఫోర్స్‌తో అయినా వెళుతుంది. పూరి గారి లాంటి గన్ అందరి యాక్టర్స్‌కి కావాలని ఈ సినిమాతో తెలిసింది. సంజయ్‌దత్‌తో పనిచేసినందుకు ఆనందంగా ఉంది' అన్నారు. పాటలు ప్రజాదరణ పొందాయి, సినిమా కూడా ఘన విజయం అందుకుంటుందనే నమ్మకం ఉందన్నారు నిర్మాత చార్మీ కౌర్. డబుల్ కామెడీ, డబుల్ యాక్షన్, డబుల్ మ్యాజిక్‌లా సినిమా ఉండబోతోందని కథానాయిక కావ్య థాపర్ చెప్పారు.



## విడాకులు... మీడియా ప్రచారమే

ఐశ్వర్యతో విడిపోతున్నట్లు వస్తున్న వదంతులపై అభిషేక్ బచ్చన్ ఎట్టకేలకు స్పందించారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ 'కొన్ని ఆసక్తికర వార్తల కోసం మీరు (మీడియా) ఇదంతా చేస్తున్నారు. మేం సెలబ్రిటీలం కాబట్టి ఇలాంటి వాటి గురించి పట్టించుకోను. నేను ఇంకా వివాహ బంధంలోనే ఉన్నాను. క్షమించండి' అంటూ తన వేలికి ఉన్న నిశ్చితార్థపు ఉంగరాన్ని చూపించాడు. దీంతో ఇన్నాళ్లూ మౌనంగా ఉన్న అభిషేక్ తమపై వస్తున్న రూమర్లకు ప్రస్తుతానికి చెక్ పెట్టినట్లైంది. ఐశ్వర్యారాయ్, అభిషేక్ బచ్చన్ దంపతులు విడిపోతున్నారంటూ గత కొంత కాలంగా ఉధృతంగా ప్రచారం జరుగుతోన్న విషయం తెలిసిందే. అనంత్ అంబానీ పెళ్లికి విడివిడిగా హాజరవడంతో వీరిద్దరూ నిజంగానే విడిపోతున్నారేమోనని భావించారు. ఐశ్వర్యతో విడిపోతున్నట్లు అభిషేక్ బచ్చన్ చెబుతున్న డీప్‌ఫేక్ వీడియో ఇటీవలే సోషల్ మీడియాలో వైరల్ అయింది.

## డబుల్ ఇంపాక్ట్



వరుణ్‌తేజ్ కథానాయకుడిగా రూపొందుతున్న పాన్ ఇండియా చిత్రం 'మట్కా'. కరుణ కుమార్ దర్శకత్వంలో డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ జరుగుతోంది. ఆదివారం చిత్రబృందం డబుల్ ఇంపాక్ట్ పేరుతో ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. వరుణ్‌తేజ్ యువకుడిగా, మధ్య వయస్కుడిగా రెండు విభిన్న గెటప్పుల్లో అలరించారు. వింటేజ్ లుక్‌లో సిగార్ తాగుతూ కనిపించారు. పీరియాడికల్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ చిత్రంలో మాఫియా లీడర్ పాత్రలో వరుణ్‌తేజ్ కనిపించనున్నారు. మీనాక్షి చౌదరి, నోరా ఫతేహీ కథానాయికలు. సంగీతం: జీవీ ప్రకాశ్ కుమార్, సినిమాటోగ్రఫీ: ఏ కిశోర్‌కుమార్.

## థియేటర్లలో పెళ్లి... మంచి పద్ధతి కాదు



థియేటర్లలో పెళ్లిళ్లు చేసుకునే పద్ధతి మంచిది కాదని దర్శకుడు కృష్ణవంశీ హితవు పలికారు. ఆయన దర్శకత్వం వహించిన 'మురారి' చిత్రం ఇటీవలే రీ రిలీజైన సందర్భంగా ఓ ప్రేమజంట థియేటర్‌లోనే పెళ్లి చేసుకుంది. నెటిజన్లు ఆ వీడియోలను కృష్ణవంశీకి ట్యాగ్ చేస్తూ షేర్ చేస్తున్నారు. దీంతో ఆయన సోషల్ మీడియాలో స్పందించారు. 'మన సంస్కృతి, సంప్రదాయాలను కించ పరచొద్దు. నేను మీ అందరికీ విజ్ఞప్తి చేస్తున్నాను. దయచేసి ఇలాంటి పనులు చేయకండి. అవగాహన లేక వారిద్దరూ అలా చేసి ఉంటారు. వారికి మంచి భవిష్యత్ ఉండాలి' అని ఆకాంక్షించారు.

## ఖాకీ పాత్రల్లో కథానాయికలు













వెండి తెరపై ఎప్పటికీ చెదిరిపోని క్రేజ్ ఉన్న పాత్రల్లో పోలీస్ ఆఫీసర్ రోల్స్ ముందుంటాయి. హీరోలు పోషించిన పోలీస్ పాత్రలు ఏ రేంజ్‌లో ఉంటాయో మనకు తెలిసిందే.. అదే పాత్రను కథానాయికలు పోషిస్తే... ప్రేక్షకులను అలరించడానికి పోలీస్ ఆఫీసర్స్‌గా ప్రేక్షకుల ముందుకు వస్తున్న బాలీవుడ్ కథానాయికలపై ఓ సారి లుక్కేద్దాం.

**లేడీ సింగం...**

రోహిత్ శెట్టి కాప్ యూనివర్స్ 'సింగమ్' ఫ్రాంచైజీలో వచ్చిన మొదటి రెండు సినిమాలు ఎంతటి ఘనవిజయాలు అందుకున్నాయో తెలిసిందే. ఇప్పుడు మూడో భాగంగా 'సింగం ఎగైన్' సినిమాలో దీపిక పదుకొనే పోలీస్‌గా అదరగొట్టడానికి సిద్ధమయ్యారు. ఈ చిత్రం దీపావళి కానుకగా నవంబర్ 1న విడుదల కానుంది. అజయ్ దేవగణ్, రణ్‌వీర్ సింగ్, రోహిత్ శెట్టి, అర్జున్ కపూర్, కరీనా కపూర్ ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

**మర్డర్ మిస్టరీని ఛేదించే పాత్రలో...**

అగ్ర నటి కరీనా కపూర్ ఇది వరకు 'ఆంగ్రేజీ మీడియమ్' సినిమాలో పోలీసాఫీసర్‌గా నటించిన సంగతి తెలిసిందే. ఆమె మరోసారి 'బకింగ్‌హామ్ మర్డర్స్'లో ఖాకీ దుస్తుల్ని ధరిస్తున్నారు. విభిన్నమైన సినిమాలను తెరకెక్కించే దర్శకుడిగా పేరొందిన హన్సల్ మెహతా తెరకెక్కిస్తున్న ఈ సినిమా ఓ మర్డర్ మిస్టరీ కథాంశంతో సాగనుంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ చిత్రం సెప్టెంబరు 13న విడుదల కానుంది.

**శత్రు సంహారానికై...**

'సాక్రెడ్ గేమ్స్' వెబ్ సిరీస్, 'సుల్తాన్' సినిమాలో పోషించిన పాత్రలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు కుబ్రా సైత్. 'దేవా' సినిమాలో ఆమె శత్రుమూకల అంతు చూసే పోలీస్ అధికారి పాత్రను పోషిస్తున్నారు. ఇందులో షాహిద్ కపూర్, పూజా హెగ్డే కీలక పాత్రలు పోషిస్తున్నారు. రోషన్ ఆండ్రూస్ తెరకెక్కిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ వచ్చే ఏడాది ఫిబ్రవరి 14న విడుదల కానుంది.

**వెబ్ సిరీస్‌లోనూ..**


వైవిధ్యమైన పాత్రలతో వెండితెరపై మంచి గుర్తింపు తెచ్చుకున్న కథానాయిక భూమి పడ్నేకర్. ఇటీవలే క్రైమ్ సస్పెన్స్ థ్రిల్లర్ 'భక్షక్'తో ప్రేక్షకులను అలరించిన భూమి.. ప్రస్తుతం 'దల్‌దాల్' అనే ఓ వెబ్ సిరీస్‌లో డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ పాత్రలో కనిపించనున్నారు. ఇందులో ఆమె ఓ సైకో కిల్లర్‌తో తలపడనున్నారు. అమృత్‌రాజ్ గుప్తా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సిరీస్ ప్రస్తుతం షూటింగ్ దశలో ఉంది.

**రెండో సీజన్ వచ్చేస్తోంది...**

'దహాడ్' తొలి సీజన్‌లో సబ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ అంజలి భాటిగా అలరించారు సోనాక్షి సిన్హా. ఎనిమిది భాగాలుగా తెరకెక్కుతోన్న ఈ క్రైమ్ డ్రామాకు రీనా కగ్తీ, రుచికా ఒబెరాయ్ దర్శకత్వం వహిస్తున్నారు. విజయ్ వర్మ, గుల్షన్, సోహమ్ షా కీలక పాత్రలు పోషిస్తున్నారు. త్వరలోనే ఈ సిరీస్ విడుదల కానుంది.

**పవర్‌ఫుల్ పాత్రలో...**

'కితనీ మొహబ్బత్ హై' సీరియల్‌తో పాపులర్ అయ్యారు నటి క్రితిక కమ్రా. ఆమె గ్యారహ్ గ్యారహ్ (11:11) అనే వెబ్ సిరీస్‌లో నటించారు. ఇటీవలే విడుదలైన ఈ ఇన్‌వెస్టిగేటివ్ డ్రామాలో ఆమె పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా కనిపించి అందరినీ ఆకట్టుకున్నారు.



స్విట్జర్లాండ్‌లో జరిగిన లోకర్నో ఫిల్మ్ ఫెస్టివల్‌లో బాలీవుడ్ హీరో షారూఖ్‌ఖాన్‌ను పార్డో అల్లా కారియారా పురస్కారంతో సత్కరించారు. ఈ పురస్కారాన్ని అందుకున్న తొలి భారతీయ నటుడు షారూఖ్ కావడం విశేషం.

కొత్తగా...

## సరికొత్త వీక్షణం



రామ్ కార్తిక్, కశ్వి జంటగా రూపొందుతున్న చిత్రం 'వీక్షణం'. మనోజ్ పల్లేటి దర్శకత్వంలో పి. పద్మనాభరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం ఫస్ట్‌లుక్‌ను మేకర్స్ ఆదివారం విడుదల చేశారు. చిమ్మ చీకటిలో బైనాక్యులర్స్ నుంచి వస్తోన్న కాంతిలో నిల్చున్న హీరో లుక్ సినిమాపై ఆసక్తిని పెంచింది. ఈ చిత్రానికి సంగీతం: సమర్థ్ గొల్లపూడి, సినిమాటోగ్రఫీ: సాయిరామ్ ఉదయ్

## క్రైమ్ సస్పెన్స్ కలబోతగా



విశ్వంత్, శిల్పా మంజునాథ్ జంటగా బసిరెడ్డి రానా దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'హైడ్ అండ్ సీక్'. నరేంద్ర బుచ్చిరెడ్డి గారి నిర్మించారు. నటుడు శివాజీ ఈ చిత్రం మోషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'ఇదొక వినూత్నమైన క్రైమ్ థ్రిల్లర్. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని ఇస్తుంది' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'క్రైమ్, సస్పెన్స్ అంశాల కలబోతగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. మా సినిమా సమర్పకుడు నవీన్ మేడారం ఫస్ట్ కాపీ చూసి బావుందని ప్రశంసించారు' అని తెలిపారు. ఈ చిత్రానికి సంగీతం: లిజో కే జోష్, సినిమాటోగ్రఫీ: చిన్న రామ్

## పైసా వసూల్ ఎంటర్‌టైనర్



చిమటా రమేశ్ బాబు హీరోగా నటిస్తూ.. స్వీయ దర్శకత్వం వహించిన చిత్రం 'నేను-కీర్తన'. చిమటా లక్ష్మీకుమారి నిర్మించారు. ఈ నెల 30న సినిమా విడుదలవుతోంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో రమేశ్ మాట్లాడుతూ "బ్లాక్‌బస్టర్ కావడానికి అవసరమైన అన్ని అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి. ప్రేమ కథతో పాటు చక్కని వినోదం మేళవించి తెరకెక్కించాం. అన్ని వర్గాలను ఆకట్టుకుంటుంది" అని చెప్పారు. "ఇది పైసా వసూల్ ఎంటర్టైనర్" అని నిర్మాత జ్యోతిర్మయి తెలిపారు.



తిరుమల ఆలయం ముందు జస్టిస్ శ్యామ్‌సుందర్

## శ్రీవారి సేవలో జస్టిస్ శ్యామ్‌సుందర్

తిరుమల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్యామ్‌సుందర్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆయనకు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

## ఎస్వీ ప్రాణదానం ట్రస్ట్‌కు రూ.21 కోట్లు విరాళం



వెంకయ్య చౌదరికి విరాళం చెక్ అందజేస్తున్న రాజిందర్ గుప్తా

తిరుమల తిరుపతి దేవస్థానం ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు ఆదివారం భారీగా విరాళం అందింది. పంజాబ్‌లోని ట్రైడెంట్ గ్రూప్ అధినేత రాజిందర్ గుప్తా విరాళం రూ.21 కోట్ల విరాళానికి సంబంధించిన చెక్‌ను ఆదివారం సాయంత్రం తిరుమలలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరికి అందజేశారు. విరాళం మొత్తాన్ని ఎస్వీ ప్రాణదానం ట్రస్టుకు వినియోగించాలని దాత కోరారు.

## ప్రముఖ సాహితీవేత్త సన్నిధానం శర్మకు అద్దేపల్లి రామ్మోహనరావు సాహిత్య పురస్కారం



సన్నిధానం నరసింహాశర్మ

రాజమహేంద్రవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సాహితీవేత్త, కవి సన్నిధానం నరసింహశర్మకు ప్రముఖ కవి, విమర్శకుడు అద్దేపల్లి రామ్మోహనరావు సాహిత్య పురస్కారం-2024 లభించింది. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం నగరానికి చెందిన సన్నిధానం శర్మ కవిగా, విమర్శకుడిగా, వక్తగా ప్రసిద్ధులు. ప్రఖ్యాత గౌతమి గ్రంథాలయ ఉద్యోగిగా ఎంతోమంది కవులకు, పరిశోధకులకు సహకరించడమే కాక వారితో సాహిత్య బంధాన్ని పెనవేసుకున్న ప్రముఖులు. 2017 నుంచి తెలుగు కవితా విమర్శకులు అద్దేపల్లి రామ్మోహనరావు పేరిట ఆయన పుట్టినరోజు సందర్భంగా ఈ పురస్కారాన్ని ప్రదానం చేస్తున్నారు. సెప్టెంబర్ 8న కాకినాడలో జరిగే సభలో శర్మను ఈ పురస్కారంతో సన్మానిస్తారు.

# 'బ్యాండ్' వేసినా చర్యలేవీ?

(మొదటి పేజీ తరువాయి)

కూటమి సర్కారు ఏమీ పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో పనిచేసిన అధికారులే ఇప్పుడూ కొనసాగుతుండటంతో ఆ తప్పులను కప్పిపుచ్చి ఈ భారీ కుంభకోణంపై చర్యలకు ఉపక్రమించడం లేదంటున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక.. ఈ టీడీఆర్ (ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్) బాండ్ల జారీలో అక్రమార్కులను జైలుకు పంపిస్తారని అందరూ ఆశించారు. ఆ శాఖ మంత్రి ఒకటికి రెండుసార్లు ప్రస్తావించినప్పటికీ.. అధికారులు దీనిపై ఎలాంటి విచారణలు, ఆరాలు తీయడం లేదు.

### టీడీఆర్ ఎందుకంటే...

రాష్ట్రంలో పట్టణాలు, నగరాల విస్తరణలో భాగంగా కొత్త నిర్మాణాలు, రోడ్ల విస్తరణలో భాగంగా ప్రైవేట్ వ్యక్తుల స్థలాలు సేకరించాలంటే వారికి పరిహారంగా ఈ బాండ్లను జారీచేస్తారు. రోడ్ల విస్తరణ కోసమైతే ఆయా ప్రాంతంలో ఉన్న మార్కెట్ ధరకు నాలుగింతల రేటుతో బాండ్లను జారీచేస్తారు. మిగిలిన అభివృద్ధి కార్యక్రమాల కోసమైతే రెండు రెట్లు రేటుతో బాండ్లు మంజూరు చేస్తారు. రాష్ట్రంలో ఏ నగరంలోనైనా అదనంగా నిర్మించుకునే భవనాలకు లైసెన్స్ ఫీజులు, బెటర్‌మెంట్ చార్జీలు, అదనపు బెటర్‌మెంట్ చార్జీలు, 14 శాతం ఓపెన్ స్పేస్ చార్జీలు తదితర ఫీజులకు బదులుగా ఈ బాండ్లను వినియోగించుకోవచ్చు. విస్తరణలో స్థలాలు కోల్పోయిన యజమానులు వాటిని రాష్ట్రంలో ఏ ప్రాంతంలోనైనా కొత్తగా భవనాలు నిర్మించుకునే భూయజమానులకు విక్రయించే అవకాశం ఉంది. భారీ విలువ కలిగిన ఈ బాండ్లను 30 శాతం, 50 శాతం ఇలా డిమాండ్‌ను బట్టి విక్రయించుకునే పరిస్థితులున్నాయి.

### తణుకు పట్టణంలో రూ.900 కోట్ల బాండ్లు

తణుకు పట్టణంలో పార్క్, డంపింగ్ యార్డ్‌ల కోసం 18 ఎకరాల సేకరణకు టీడీఆర్ బాండ్లు జారీచేసిన గత జగన్ సర్కారు నిబంధనలకు తిలోదకాలిచ్చింది. చదరపు గజం రూ.6,000 విలువ చేసే స్థలానికి రూ.ఒక లక్ష విలువ చేసే బాండ్లు విడుదల చేసి మున్సిపల్‌శాఖకు భారీ నష్టాన్ని మిగిల్చిందన్న ఆరోపణలున్నాయి. ఒక్క తణుకు మున్సిపాలిటీ పరిధిలోనే రూ.900 కోట్ల మేర టీడీఆర్ బాండ్లను జారీచేసి రాష్ట్రవ్యాప్తంగా చలామణి చేసినట్లు పేర్కొంటున్నారు. భూ యజమానులతో సంబంధం లేకుండా జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ(జీపీఏ) ఆధారంగా వేరే వాళ్లకు టీడీఆర్ బాండ్లు జారీచేయడం, మార్కెట్ రేటుని భారీగా పెంచడం, రెండు రెట్లు ఇవ్వాల్సిన పరిహారానికి బదులుగా నాలుగు రెట్లు విలువ కలిగిన బాండ్లను పందేరం చేయడం ద్వారా వైసీపీ నేతలు భారీగానే లాభపడ్డారు. గతేడాది దీనిపై ఆరోపణలు రావడంతో అప్పట్లో ముగ్గురు మున్సిపల్ అధికారులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారు.

### అడుగడుగునా అక్రమాలు...

గుంటూరులో 2022లో రూ.300 కోట్ల మేర టీడీఆర్ బాండ్ల కుంభకోణం జరిగింది. గుంటూరు పట్టణంలోని బెస్ట్ ప్రైస్ పక్కన పెదకాకాని రోడ్డు నుంచి జాతీయ రహదారి వరకు వయా పందులకాలనీ మీదుగా రోడ్డు విస్తరణ పనులు చేపట్టారు. రెండున్నర కిలోమీటర్ల మేర 80 అడుగుల మేరకు రోడ్డు విస్తరణ చేపట్టాలని నోటీసులు జారీచేశారు. అయితే వైసీపీ ప్రభుత్వంలో నగరానికి చెందిన ముఖ్య నాయకుడు అప్పటి టౌన్‌ప్లానింగ్ అధికారితో కలిసి తప్పుడు డోర్ నంబర్లు వేసి రూ.300 కోట్లకుటీడీఆర్ బాండ్లు జారీ చేయించినట్లు ఆరోపణలున్నాయి. అక్కడ మార్కెట్ విలువ గజం రూ.9,500 ఉండగా, కమర్షియల్ కాంప్లెక్స్ అయిన బెస్ట్‌ప్రైస్ డోర్ నంబర్ వేసి ఒక్కో గజం రూ.20 వేలకు మార్చి మార్కెట్ విలువను అమాంతం పెంచేశారు.

### తిరుపతిలో వైసీపీ నేతల అండతో...

తిరుపతిలో రూ.4 వేల కోట్ల విలువైన టీడీఆర్ బాండ్ల కుంభకోణం జరిగినట్లు అప్పట్లో ప్రతిపక్ష టీడీపీ నేతలు ఆరోపించారు. ఈ కుంభకోణం వెలుగులోకి రావడంతో లావాదేవీలు నోచుకోని టీడీఆర్ బాండ్లు చెల్లవని అప్పటి మున్సిపల్‌శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి శ్రీలక్ష్మి ఉత్తర్వులు జారీచేశారు. మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపాదించిన 42 రోడ్లలో ఇప్పటి వరకు నిర్మించిన 18 రోడ్లకు సంబంధించి 1,121 మంది భూములు కోల్పోయారు. వారిలో 373 మందికి మాత్రమే బాండ్లు జారీచేశారు. మొత్తం రూ.1013 కోట్ల విలువైన టీడీఆర్ బాండ్లు జారీచేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే ఉత్తర్వులు వెలువడే నాటికి 75 శాతం టీడీఆర్ బాండ్ల వినియోగం జరిగిపోయిందని, మిగిలిన 25 శాతం మాత్రమే ఉన్నట్లు తెలుస్తోంది. అప్పటి తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి, ఆయన తనయుడు డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డికి కార్పొరేషన్ అధికారులు దాసోహమయ్యారు. అప్పటి రిజిస్ట్రేషన్ అధికారులు, మున్సిపల్ అధికారులు వారికి సహకరించడంతోనే ఈ అవినీతి జరిగిందని పేర్కొంటున్నారు.

### భూ సేకరణ జరగకుండానే బాండ్ల జారీ..

తణుకులో డంపింగ్ యార్డ్ కోసం సేకరించిన భూ యాజమానుల నుంచి కాకుండా థర్డ్ పార్టీ నుంచి సేకరించి అక్రమాలకు తెరదీశారు. కొంత మంది వైసీపీ నేతలు ఆయా భూ యజమానుల వద్ద నుంచి కొద్ది రోజుల ముందుగా పవర్ ఆఫ్ అటార్నీ తీసుకుని ప్రభుత్వానికి ఇచ్చి టీడీఆర్ బాండ్లు పొందారు. దీంతో అసలు భూసేకరణ జరగకుండా రూ.వందల కోట్ల టీడీఆర్ బాండ్లు చలామణిలోకి వచ్చాయి. వైసీపీ నేతలు దొంగ నోట్లను చలామణి చేసినట్లు అక్రమంగా, నిబంధనలకు విరుద్ధంగా జారీ చేసిన టీడీఆర్ బాండ్లను సొమ్ము చేసుకున్నారని విమర్శలొస్తున్నాయి. టీడీఆర్ బాండ్లపై సమగ్ర విచారణ జరిపితే మరిన్ని కుంభకోణాలు వెలుగుచూడొచ్చని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు.

## పెరిగిన ఎండ

విశాఖపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనాలు, కోస్తా, రాయలసీమలపై ఆవర్తనాలు, ద్రోణులు లేకపోవడంతో ఆదివారం ఎండ తీవ్రత పెరిగింది. ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. కావలిలో గరిష్ఠంగా 38.5 డిగ్రీలు నమోదైంది. ఎండ తీవ్రతకు రాయలసీమ, కోస్తాల్లో అక్కడక్కడా వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో ఉత్తర కోస్తాలో పలుచోట్ల, దక్షిణ కోస్తా, రాయలసీమల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది.

## పదోన్నతి కోటా తగ్గించడం చట్ట విరుద్ధం

**» 30 ఏళ్ల సీనియారిటీని తుంగలో తొక్కారు: పీఆర్ డిప్లమో ఇంజనీర్లు**

అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అసిస్టెంట్ ఇంజనీర్ నియామకాల్లో గత 30 ఏళ్ల నుంచి అమల్లో ఉన్న 70 శాతం పదోన్నతి కోటాను 50 శాతానికి తగ్గిస్తూ పంచాయతీరాజ్ ఇంజనీర్-ఇన్-చీఫ్ ఇచ్చిన ఉత్తర్వులు చట్ట ఉల్లంఘన అని పంచాయతీరాజ్ డిప్లమో ఇంజనీర్ల సంఘం ఖండించింది. ఆదివారం పంచాయతీరాజ్ డిప్లమో ఇంజనీర్ల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం విజయవాడలోని ఏపీ ఎన్జీఓ హోంలో రాష్ట్ర అధ్యక్షుడు కె.రవీంద్ర అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో 26 జిల్లాల ప్రతినిధులు పాల్గొని పలు తీర్మానాలు చేశారు. 30 సంవత్సరాల సీనియారిటీ జాబితాలను అక్రమంగా జోన్ 4లో మారుస్తూ ఇచ్చిన ఉత్తర్వులు వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 1994లో ఇచ్చిన జీఓ 1240 ఎగ్జిక్యూటివ్ ఉత్తర్వులపై ప్రభుత్వం బాధ్యత తీసుకుని వెంటనే సర్వీస్ రూల్స్ సవరించి సీనియర్ ఏఈలకు అన్యాయం జరగకుండా చూడాలన్నారు. 2014-19లో వేసిన సిమెంట్‌రోడ్ల విషయంలో, గత వైసీపీ ప్రభుత్వం వేసిన అక్రమ కేసులు ఐదు జిల్లాల్లో రద్దు చేశారని, మిగిలిన జిల్లాల్లోనూ రద్దు చేయాలని, ఇంకా పలు తీర్మానాలు చేశారు.



# దువ్వాడ ఎపిసోడ్‌లో మరో ట్విస్ట్!

**జాతీయ రహదారిపై ఆగి ఉన్న కారును ఢీకొట్టి దివ్వెల మాధురి ఆత్మహత్యాయత్నం**



పలాస ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాధురి

పలాస, ఆగస్టు 11: వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వ్యవహారంలో ఆయన భార్య, కుమార్తెల నుంచి ఆరోపణలు ఎదుర్కొంటున్న దివ్వెల మాధురి ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఆమె కారులో ప్రయాణిస్తూ శ్రీకాకుళం జిల్లా పలాస మండలం లక్ష్మీపురం టోల్‌గేటు దాటిన తరువాత ఆగి ఉన్న కారును బలంగా ఢీకొట్టారు. ఈ ఘటనలో గాయపడిన ఆమెను పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పగా.. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్సకోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. ఈ సందర్భంగా మాధురి విలేకరులతో మాట్లాడుతూ తన పిల్లలపై దువ్వాడ వాణి చేసిన ఆరోపణలకు తాను బలికావాల్సి వస్తోందని, ఆత్మహత్య చేసుకోవడం తప్ప తనకు గత్యంతరం లేదని తెలిపారు. వాణిని తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. తెలుగుదేశం పార్టీ సహకారంతోనే ఆమె తనపై ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇదే క్రమంలో ఆమె పోలీసులపైనా ఆరోపణలు చేశారు. ఆమెను మరింత మెరుగైన చికిత్స కోసం రాత్రి పొద్దుపోయిన తర్వాత ఆరిలోవలోని అపోలో ఆస్పత్రికి తరలించారు. కాగా.. ఈ వ్యవహారంపై కాశీబుగ్గ డీఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రమాదం జరిగిన తరువాత సంబంధిత డ్రైవర్లకు ఇటువంటి పరీక్షలు చేయడం సాధారణమని, ప్రమాదం జరిగిన కారును మాధురి స్వయంగా డ్రైవింగ్ చేస్తున్నారని, ఇందులో రాజకీయ కోణం ఏదీ లేదని స్పష్టం చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పారినాయుడు తెలిపారు.

### ఆత్మహత్యకు అవకాశం ఇవ్వండి: మాధురి

పలాస ఆసుపత్రిలో మాధురి వైద్యులకు సహకరించలేదు. తనకు ఆత్మహత్య చేసుకోవడానికి అవకాశం ఇవ్వాలని కోరారు. తన పిల్లలకు డీఎన్ఏ టెస్టులు చేయాలని దువ్వాడ వాణి కోరారని, వారికి ఏం సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అడ్డూఅదుపు లేకుండా వాణి అధికార పార్టీ అండతో ఆరోపణలు చేస్తే తనకు దిక్కెవరని ప్రశ్నించారు. తన పిల్లలు వేసే ప్రశ్నలకు ఏమి సమాధానం చెప్పాలని వాపోయారు. తనపై ఆరోపణలు చేస్తున్నవారిని తక్షణమే అరెస్టు చేయాలని.. లేదంటే తన చావుకు ఇబ్బంది పెట్టవద్దని పోలీసులను కోరారు. ఆసుపత్రిలో పోలీసులు ఇబ్బందులు పెట్టారని మాధురి ఆరోపించారు. "బ్రీత్ అనలైజేషన్, బ్లడ్ శాంపిల్ తీశారు. విలేకరుల సమక్షంలో చేయాలని కోరినా పోలీసులు అనుమతించలేదు. రాజకీయం చేయాలని చూశారు. పోలీసులు సీక్రెట్‌గా ఎందుకు ఈ విధంగా చేశారో సమాధానం చెప్పాలి" అని మాధురి డిమాండ్ చేశారు.

### దువ్వాడను సస్పెండ్ చేయాలి: వాణి

**» మూడో రోజూ భర్త ఇంటి వద్ద కొనసాగిన దీక్ష**

టెక్కలి, ఆగస్టు 11: 'మా కుటుంబానికి న్యాయం చేయని వ్యక్తి.. ఎమ్మెల్సీగా ప్రజలకు ఏమి న్యాయం చేస్తాడు?. ఓ మహిళతో అక్రమ సంబంధాలు ఏర్పరచుకొని బరితెగించి మాట్లాడుతున్నాడు. అటువంటి వ్యక్తిపై పార్టీ క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలి. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌ను సస్పెండ్ చేయాలి' అని ఆయన భార్య, టెక్కలి జడ్పీటీసీ సభ్యురాలు దువ్వాడ వాణి డిమాండ్ చేశారు. శ్రీకాకుళం జిల్లా టెక్కలిలో దువ్వాడ శ్రీనివాస్ ఇంటి వద్ద మూడో రోజు ఆదివారం కూడా ఆమె నిరసన దీక్ష కొనసాగించారు. తనకు న్యాయం జరిగే వరకు కదిలేది లేదని స్పష్టం చేశారు. అయితే శ్రీనివాస్ మాత్రం బయటకు రాకుండా ఇంట్లోనే ఉండిపోయారు. మూడురోజులుగా ఈ వ్యవహారంపై రచ్చ జరగడంతో ఆదివారం కూడా పోలీసులు దువ్వాడ నివాసం వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.

# పీఆర్ ఉద్యోగులకు ఇద్దరు మంత్రులా?!

- శాఖ ఒక చోట.. శిక్షణ ఒక చోట
- పంచాయతీరాజ్‌ను చీల్చిన నాటి వైసీపీ సర్కార్
- సచివాలయ శాఖ పరిధిలోకి ఏపీఎస్ఐఆర్‌డీ-పీఆర్
- అప్పట్లో సీఎంఓలో ఉన్న ఓ అధికారి నిర్వాకం
- ఇప్పటికైనా పీఆర్‌లోకి తేవాలని డిమాండ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

*ఒక శాఖ పరిధిలో పనిచేసే ఉద్యోగులకు, అధికారులకు ఒక మంత్రినే ఉంటారు. అయితే విచిత్రంగా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలో పనిచేసే ఉద్యోగులకు మాత్రం ఇద్దరు మంత్రులు ఉన్నారు. వైసీపీ సర్కార్ హయాంలో అప్పట్లో సీఎంఓలో ఉన్న ఓ అధికారి నిర్వాకంతో అనాలోచితంగా పంచాయతీరాజ్‌లో ఉన్న ఈ విభాగాన్ని గ్రామ, వార్డ్ సచివాలయ శాఖలోకి చేర్చారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఏపీఎస్ఐఆర్‌డీ)-పీఆర్ విభాగాన్ని గ్రామ, వార్డ్ సచివాలయ శాఖ పరిధిలోకి చేర్చడంతో పంచాయతీరాజ్‌శాఖలో గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయి!!*

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్‌శాఖ సిబ్బందికి ఎలిమినేటి మాధవరెడ్డి ఆంధ్రప్రదేశ్ అకాడమీ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్(ఏఎంఆర్-అపార్డ్) సంస్థ ద్వారా శిక్షణ నిర్వహించేవారు. ఈ సంస్థ పంచాయతీరాజ్ విభాగంలోనిదే. దానికి నిధులు, సిబ్బంది పంచాయతీరాజ్ శాఖ నుంచి ఇస్తారు. ఈ సంస్థ శిక్షణ ఇచ్చేది కూడా పంచాయతీరాజ్ ఉద్యోగులకు, అధికారులకు, పంచాయతీరాజ్ విభాగానికి చెందిన స్థానికసంస్థల ప్రజాప్రతినిధులకు మాత్రమే. ఏటా వారికి శిక్షణ అందించేందుకు పంచాయతీరాజ్ కమిషనర్ నిధులు సమకూరుస్తారు. ఆ విభాగానికి జవజీవసత్వాలు నింపే పంచాయతీరాజ్‌కు సంబంధం లేకుండా చేయడంతో ఈ విభాగంలో పనిచేసే అధికారులు, ఉద్యోగులు తాము ఏ మంత్రిత్వశాఖలో ఉన్నామో? అర్థం కాక అయోమయంలో పడ్డారు. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఏపీఎస్ఐఆర్‌డీ-పీఆర్ పేరుతో ఈ శిక్షణా సంస్థకు పేరుమార్చారు. రాష్ట్ర విభజన తర్వాత ఆ శిక్షణా సంస్థలో ఉన్న 53 పోస్టులను విభజన చట్టం ప్రకారం పంచగా మన శిక్షణ సంస్థ ఏపీఎస్ఐఆర్‌డీ-పీఆర్‌కు 30 పోస్టులు కేటాయించారు. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రిత్వశాఖ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేతిలో ఉంది. అయితే ఏపీఎస్ఐఆర్‌డీ-పీఆర్ మాత్రం గ్రామ, వార్డ్ సచివాలయశాఖ నిర్వహిస్తున్న డోలా బాలవీరాంజనేయస్వామి పరిధిలోకి వెళ్లింది. ఏపీఎస్ఐఆర్‌డీ-పీఆర్ సంస్థ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బందికి, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు వార్డ్ మెంబర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలతో పాటు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలోని ఉద్యోగులందరికీ శిక్షణ ఇస్తుంది. ఈ సంస్థ ద్వారా శిక్షణ తీసుకునే వారు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖకు చెందిన వారే. దాని కోసం నిధులిచ్చేది కూడా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖనే. అలాంటి సంస్థను గ్రామ, వార్డ్ సచివాలయశాఖలోకి మార్చడంలో ఆంతర్యం ఎవరికీ అంతుపట్టడం లేదు. ఒక శాఖకు సంబంధించిన ఉద్యోగులు, అధికారులు ఇంకో మంత్రిత్వశాఖలో పనిచేయడం ఇబ్బందిగా ఉందని పేర్కొంటున్నారు. ఉపముఖ్యమంత్రి చొరవ తీసుకుని గ్రామ, వార్డ్ సచివాలయశాఖలో ఉన్న ఏపీఎస్ఐఆర్‌డీ-పీఆర్‌ను తిరిగి పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖలో విలీనం చేయాలని కోరుతున్నారు.

# నవ్య

కుటుంబ కదంబం

సోమవారం • 12 ఆగస్టు 2024



స్ఫూర్తి

సాయం చెయ్యడానికి సంపదలు అక్కర్లేదు... స్పందించే హృదయం ఉంటే చాలని నిరూపిస్తున్నారు ఉమారాణి. కొవిడ్ కాలంలో ప్రారంభించిన అన్నదానాన్ని నిరంతరాయంగా కొనసాగిస్తున్న ఈ చెన్నై మహిళ 'అన్నపూర్ణ'గా మన్ననలు అందుకుంటున్నారు.

# అన్నపూర్ణ కేరాఫ్ చెన్నై

నిర్మానుష్యంగా ఉన్న వీధుల్లో... ఏదో ఒక మూల ఆకలితో దీనంగా కనిపించే వృద్ధులు. లాక్‌డౌన్ సడలింపు సమయంలో వీధుల్లోకి వచ్చి... ఆకలికి తీర్చుకోవడానికి యాచించే దీనులు. నాలుగేళ్ళ క్రితం... కొవిడ్ మహమ్మారి విజృంభించిన కాలంలో... ప్రతిరోజూ కనిపించే ఈ దృశ్యాలు డి.ఉమారాణిని తీవ్రంగా కలవరపెట్టాయి. ఒకవైపు పనులు లేక, మరోవైపు కడుపు నింపుకొనే మార్గం లేక తల్లడిల్లిపోతున్న వారికి తన వంతుగా ఏదైనా చెయ్యాలని ఆమె తల్లి మనసు తపనపడింది. ఆమె ఆలోచనల్లో ఊపిరిపోసుకున్న 'తవమొళి అన్నదాన కూటం' (తవమొళి అన్నదాన కేంద్రం) నాలుగున్నర సంవత్సరాల నుంచి పేదలకు కల్పతరువుగా నిలుస్తోంది.

**వారే ప్రేరణ...**



ఉమారాణి స్వస్థలం తమిళనాడులోని ఆరణి. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమెకు చదువంటే ఇష్టం. కానీ చదివించే స్తోమత ఆమె కుటుంబానికి లేదు. పొరుగున ఉండే ఒక వ్యక్తి ఆమె ఆసక్తిని గమనించి, సాయం చెయ్యడానికి ముందుకువచ్చారు. "ఆయన తన పింఛన్‌లో దాచుకున్న డబ్బును నాకు ఇచ్చారు. ఆయన చేసిన సాయం నా జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. చదువు పూర్తయ్యాక... నర్సింగ్ ట్యూటర్‌గా చేరాను. అప్పటి నుంచి... అంటే దాదాపు పదహారేళ్ళుగా సమాజానికి నావంతుగా ఏదో విధమైన సాయం చేస్తూనే ఉన్నాను" అని చెప్పారు ఉమారాణి. కొవిడ్ కారణంగా ఉపాధి కోల్పోయిన వారికి, దిక్కులేనివారికీ అండగా నిలవాలని... చెన్నైలోని కీల్‌కట్టలై ప్రాంతంలో ఉచిత భోజన కేంద్రాన్ని ప్రారంభించారు. "అప్పట్లో నేను చెన్నై శివార్లలోని ఒక కేర్ సెంటర్‌లో పని చేసేదాన్ని. నేను దాచుకున్న డబ్బు, వచ్చే జీతంతో రోజూ కనీసం అయిదారు వందలమందికి భోజనాలు పెట్టేదాన్ని. లాక్‌డౌన్‌ను పూర్తిగా తొలగించేవరకూ మాత్రమే ఈ కేంద్రాన్ని నడపాలని అనుకున్నాను" అని చెప్పారు ఉమారాణి. కానీ ఆ తరువాత కూడా దాన్ని కొనసాగించడానికి పేద ప్రజలే ఆమెకు ప్రేరణగా నిలిచారు. "నిరుపేద వృద్ధులు, కుటుంబ సభ్యులు పట్టించుకోకుండా వదిలేసినవాళ్ళు, బిక్షగాళ్ళు, ఇళ్ళలో పనిచేసేవారు, స్వీపర్లు, రోజు కూలీలు, రిక్షా డ్రైవర్లు, ఆటో డ్రైవర్లు, ప్లంబింగ్, ఎలక్ట్రికల్ పనులు చేసేవారు, చిరుద్యోగులు... ఇలా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న ఎందరో భోజనానికి వస్తూ ఉంటారు. చాలామంది మా కేంద్రం మీదే ఆధారపడుతున్నారు. హఠాత్తుగా ఆపేస్తే వాళ్ళ పరిస్థితి ఏమిటి? అని ఆలోచించాను. నా సన్నిహితులను సంప్రదించాను. "బయట యాభై రూపాయలు పెడితేకానీ టిఫిన్‌నైనా దొరకడం లేదు. మాకు చేతనైనంత విరాళాలు ఇస్తాం. మీ సేవలను ఆపొద్దు" అని వాళ్ళు హామీ ఇచ్చారు. మరోవైపు ఉద్యోగం చేస్తూ... కేంద్రాన్ని కొనసాగించడం కష్టమైంది. దాంతో ఉద్యోగం మానేసి... పూర్తిగా దీనికే అంకితమయ్యాను" అంటారు ఉమామణి.

**ఆ ఆకాంక్షతో...**

రోజూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనం... ఇలా మూడు పూటలా ఈ అన్నదాన కేంద్రం ఆహారాన్ని అందిస్తోంది. భోజనంలో అన్నం, తృణధాన్యాల కిచిడి, సాంబారు, కూర, రసం, మజ్జిగ ఉంటాయి. "ఇప్పుడు రోజూ ఎనిమిదివందల మంది వరకూ వస్తున్నారు. పేదలతో పాటు దిగువ మధ్య తరగతివారు, చిరుద్యోగులు, విద్యార్థులు కూడా వారిలో ఉంటారు. నా కుటుంబం, బంధుమిత్రులు చేసే సాయంతో, దాతలు ఇచ్చే విరాళాలతో కేంద్రాన్ని నడుపుతున్నాను. చాలాసార్లు డబ్బు సరిపోదు. ఎవరో ఒకరి సాయంతో నెట్టుకొస్తున్నాను. వంట పని మొత్తం నేనే చేస్తాను. పదో క్లాసు, ఆరో క్లాసు చదువుతున్న నా పిల్లలిద్దరూ సాయపడతారు. వడ్డనలు, ఇతర పనులు కొందరు స్వచ్ఛందంగా చేస్తున్నారు" అని చెప్పారు ఉమామణి. ఆమెను స్థానికులు 'అన్నపూర్ణి' (అన్నపూర్ణాదేవి) అని పిలుస్తూ ఉంటారు. "ఆమె ఎవరో నాకు తెలీదు. నేనెవరో ఆమెకు తెలీదు. కానీ ఆమె అన్నదాతగా, నేను ఆకలితో ఉన్న వ్యక్తిగా... మా ఇద్దరి మధ్యా బంధం ఏర్పడింది" అని ఒక వృద్ధురాలు చెబితే... "కొవిడ్ సమయంలో పనుల్లేక ఎంతో కష్టపడ్డాం. అప్పుడే ఉమారాణి ఉచిత భోజనం గురించి తెలిసింది. నాటినుంచి క్రమం తప్పకుండా ఇక్కడికి వస్తున్నాను" అంటారు మరో రోజుకూలీ. ఆహార కేంద్రంతోపాటు కొందరు వృద్ధుల సంరక్షణ బాధ్యతను కూడా తనపై వేసుకున్నారు ఉమారాణి. "ఎవరూ ఆకలితో బాధపడకూడదనేది నా ఆకాంక్ష. తాగుబోతులు తప్ప ఎవరైనా మా కేంద్రానికి రావచ్చు. భోజనం చేయవచ్చు. నాకు ఓపిక ఉన్నంత వరకూ అన్నదాన కేంద్రాన్ని నడుపుతాను" అంటున్నారీ ముప్పై ఆరేళ్ళ చెన్నై అన్నపూర్ణ.

వయసు అనేది కేవలం సంఖ్య మాత్రమే... కాదనగలరా..! అదీ ఈ అపు'రూపం' చూశాక..! దీపికా... అలియా... సారా... నవతరం తారలు హొయల సునామీలోనూ... అలనాటి అందం నేటికీ ప్రత్యేకమే అనక తప్పదు... **జీనత్ అమన్** చిత్రాలు చూశాక. వైవిధ్యమైన డ్రెస్సులు ధరించి... నయా లుక్స్‌తో అభిమానులను అలరిస్తూ... ర్యాంప్‌పైనే కాదు... ఇన్‌స్టాలోనూ సరికొత్త ఫ్యాషన్ ఐకాన్ అయ్యారు జీనత్.

# స్టయిల్ అదిరే..!

ఐకాన్



అవకాశం వచ్చినప్పుడే కాదు... ఏ అవకాశం లేకపోయినా... తన నుంచి చూపు తిప్పుకోనివ్వడంలేదు జీనత్ అమన్. 'దమ్ మారో దమ్... మిట్ జాయే గమ్' అంటూ నాడు యువతరాన్ని ఊపేసిన జీనత్... ఆ తరువాత విభిన్న పాత్రలకు పెట్టింది పేరుగా... మంచి నటిగా కోట్లమంది హృదయాల్లో కొలువయ్యారు. ఇప్పటికీ... డెబ్భై రెండేళ్ల వయసులోనూ ఆమెలో అదే వైవిధ్యం. 'వయసనేది కేవలం ఒక సంఖ్య మాత్రమే' అని మాటల్లో చెప్పడం కాకుండా... చేతల్లో చూపిస్తున్నారు. సందర్భం ఏదైనా ఎప్పటికప్పుడు ట్రెండీ టచ్‌తో నవతరానికి స్ఫూర్తినిస్తున్నారు.

లాక్మే ఫ్యాషన్ వీక్‌లో వినూత్న ఆహార్యంతో రన్‌వేపై మైమరిపించినా... ప్రముఖ ఫ్యాషన్ మ్యాగజైన్ కవర్‌పేజీ మీద మెరిసినా... చాలా ఏళ్ల తరువాత మళ్లీ రంగస్థలంపై కస్తూర్బా గాంధీగా అద్భుతమైన అభినయంతో ఆకట్టుకున్నా... జీనత్‌కే ప్రత్యేకం. వయసు మీద పడుతున్నా... కాలంతో పోటీపడుతూ... అందుకు అనుగుణంగా తనను తాను మలుచుకొంటున్నారు. నిత్యనూతనంగా కనిపిస్తూ... అందానికి సరికొత్త నిర్వచనం ఇస్తున్నారు.

జీనత్ ఇన్‌స్టాగ్రామ్‌లోకి వెళితే... ఫ్యాషన్‌కు పుట్టిల్లులా అనిపిస్తుంది. ఫొటో షూట్లు... ర్యాంప్ వాక్‌ల చిత్రాలతో కలర్‌ఫుల్‌గా ఉంటుంది. వాటితోపాటు అప్పుడప్పుడూ తన సినీ, వ్యక్తిగత జీవిత విశేషాలు... రోజువారీ జీవనగమనంలో ఎదురయ్యే అనుభవాలను అందరితో పంచుకొంటూరు జీనత్. సందర్భానుసారం అలనాటి తన పాత్రల ఫొటోలు వదులుతుంటారు. వయసు మనసుకు కాదని... అది ఎప్పుడూ ఉత్సాహభరితంగా ఉరకలేస్తూ ఉంటుందని చెప్పకనే చెబుతారు జీనత్.

అంతేకాదు... అమూల్యమైన సందేశాలు, సూచనలు, సలహాలతో సాధికారత దిశగా మహిళలను ప్రోత్సహిస్తున్నారు. వారి విజయాలను తన విజయాలుగా ఇన్‌స్టాలో పోస్ట్ చేస్తూ... స్ఫూర్తి నింపే ప్రయత్నం చేస్తున్నారు. యువతలో చైతన్యం రగిలించి, వారిని లక్ష్యం వైపు నడిపించేందుకు సామాజిక మాధ్యమాన్ని ఒక సాధనంగా ఉపయోగిస్తున్నారు.



## హాట్ హిట్స్

**ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...**

1. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
2. సాజ్‌నీ రే (లాపతా లేడీస్)
3. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్ఝా జియా)
4. ఆజ్ కీ రాత్ (స్త్రీ-2)
5. నాదానియా (నాదానియా)
6. దేఖా తేనూ (మిస్టర్ అండ్ మిసెస్ మహీ)
7. ఓ మాహీ (డంకీ)
8. సోనీ సోనీ (ఇష్క్‌విష్క్ రీబౌండ్)
9. చలేయా (జవాన్)
10. నైనా (క్రూ)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్: కుర్చీ మడతపెట్టి (గుంటూరు కారం)

# బిజినెస్

## మూడేళ్ల కనిష్ఠానికి ఉక్కు ధరలు

న్యూఢిల్లీ: ఉక్కు దిగుమతులు పెరగడంతో దేశీయంగా ఉక్కు ధరలు మూడు సంవత్సరాల కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. 2022 ఏప్రిల్‌లో టన్ను రూ.76,000 ఉన్న హాట్ రోల్డ్ కాయిల్స్ (హెచ్ఆర్‌సీ) ధర ఇప్పుడు రూ.51,000 పలుకుతోంది. కోల్డ్ రోల్డ్ కాయిల్స్ (సీఆర్‌సీ) టన్ను ధర ఇదే కాలంలో రూ.86,300 కోట్ల నుంచి రూ.58,200 కోట్లకు దిగజారాయి. అందుబాటులో ఉన్న గణాంకాల ప్రకారం జూన్ త్రైమాసికంలో ఉక్కు దిగుమతులు 68% పెరిగి 11.5 కోట్ల టన్నుల నుంచి రూ.19.3 కోట్ల టన్నులకు పెరిగాయి.

## ఈ ఏడాదే రిలయన్స్ గిగా ఫ్యాక్టరీ

న్యూఢిల్లీ: రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) తన తొలి సోలార్ గిగా ఫ్యాక్టరీని ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలోనే ప్రారంభించాలని యోచిస్తోంది. ఈ ఏడాది 20 గిగావాట్ల సోలార్ పీవీ తయారీ సామర్థ్యం సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నామని, 2026 చివరి నాటికి దాన్ని మరో 20 గిగావాట్లకు పెంచుతామని తన వార్షిక నివేదికలో కంపెనీ తెలియచేసింది.

## బంధన్ నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ ఫండ్

బంధన్ మ్యూచువల్ ఫండ్.. నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్ ఫండ్‌ను ప్రారంభించింది. నిఫ్టీ బ్యాంక్ ఇండెక్స్‌ను ట్రాకింగ్ చేసే ఓపెన్ ఎండెడ్ పథకం ఇది. ఈ ఫండ్ సబ్‌స్క్రిప్షన్ చివరి తేదీ ఈ నెల 22. గ్రోత్ ఆప్షన్స్‌తో రెగ్యులర్, డైరెక్ట్ ప్లాన్స్‌తో ఈ పథకం అందుబాటులో ఉంటుంది. ఈ ఫండ్ కనీస పెట్టుబడి రూ.1,000. క్రమానుగత పెట్టుబడి (సిప్) రూపంలో అయితే కనీస పెట్టుబడి రూ.100. బ్యాంక్ ఇండెక్స్‌లోని సెక్యూరిటీల్లో ఈ ఫండ్ 95-100 శాతం పెట్టుబడులు పెట్టనుంది.

## ఈ ఏడాది స్టాక్ మార్కెట్లో ఎల్ఐసీ పెట్టుబడులు

# 1.30 లక్షల కోట్లు

**సంస్థ ఎండీ, సీఈఓ సిద్ధార్థ మొహంతి వెల్లడి**







న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో ఈక్విటీ మార్కెట్లో రూ.1.30 లక్షల కోట్లు ఇన్వెస్ట్ చేయనున్నట్లు భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) ఎండీ, సీఈఓ సిద్ధార్థ మొహంతి వెల్లడించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎల్ఐసీ స్టాక్ మార్కెట్లో రూ.132 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టిందని, ఈ ఏడాది కూడా అదే స్థాయిలో ఇన్వెస్ట్ చేయాలని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. కాగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో పలు షేర్లలో రూ.38,000 కోట్లు పెట్టుబడిగా పెట్టినట్లు ఆయన చెప్పారు. ఈక్విటీ మార్కెట్లో పెట్టుబడుల ద్వారా ఎల్ఐసీ జూన్ త్రైమాసికంలో రూ.15,500 కోట్ల లాభం ఆర్జించిందన్నారు. గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం (జనవరి-మార్చి)లో ఆర్జించిన లాభం కన్నా ఇది 13.5 శాతం అధికమని ఆయన చెప్పారు. ఎల్ఐసీ పెట్టుబడులకు సంబంధించి మరిన్ని వివరాలు..

- గత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో ఎల్ఐసీ ఈక్విటీ మార్కెట్ పెట్టుబడులు రూ.23,300 కోట్లుగా ఉన్నాయి.
- ఈ ఏడాది జూన్ 30 నాటికి వివిధ కంపెనీల్లో ఎల్ఐసీ పెట్టుబడుల మొత్తం విలువ రూ.15 లక్షల కోట్లకు చేరింది. అదే తేదీ నాటికి మొత్తం 282 కంపెనీల్లో ఎల్ఐసీ పెట్టుబడులున్నాయి.
- జూన్ చివరి నాటికి ఎల్ఐసీ నిర్వహణలోని మొత్తం ఆస్తుల విలువ 16.22 శాతం పెరిగి రూ.53,58,781 కోట్లకు చేరింది. గత ఏడాది జూన్ చివరికి ఈ విలువ రూ.46,11,067 కోట్లుగా ఉంది.
- 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎల్ఐసీ మొత్తం పెట్టుబడులు రూ.7,30,662 కోట్ల మేరకు పెరిగి రూ.42,44,852 కోట్ల (2023 మార్చి 31) నుంచి రూ.49,75,514 కోట్లకు (2024 మార్చి 31) చేరింది.
- మొత్తం పెట్టుబడిలో ఈక్విటీ పెట్టుబడుల వాటా 2022-23లో రూ.8,39,622 కోట్లుగా ఉండగా 2024 మార్చి 31 నాటికి రూ.12,39,740 కోట్లకు చేరింది. ఇదే కాలంలో ఇతర విభాగాల్లో పెట్టుబడులు రూ.34,05,190 కోట్ల నుంచి రూ.37,35,774 కోట్లకు పెరిగాయి.

## తగ్గిన సిమెంట్ ధరలు

» కంపెనీలకు కలిసిరాని జూన్ త్రైమాసికం





న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికం సిమెంట్ కంపెనీలకు పెద్దగా కలిసి రాలేదు. ఈ కాలంలో అల్ట్రాటెక్ సిమెంట్, అంబుజా సిమెంట్స్, ఏసీసీ, శ్రీ సిమెంట్స్, దాల్మియా భారత్ వంటి ప్రధాన కంపెనీల సిమెంట్ అమ్మకాలు 3 నుంచి 9 శాతం పెరిగాయి. అయితే ధరలు తగ్గటంతో కంపెనీల ఆదాయాలు, లాభాలకు గండి పడింది. గత ఏడాది జూన్‌తో పోలిస్తే ఈ ఏడాది జూన్‌లో 50 కిలోల సిమెంట్ బస్తా సగటు ధర 3 శాతం తగ్గి రూ.348కు చేరింది. ఇదే సమయంలో ఫ్లైయాష్, స్లాగ్ వంటి ప్రధాన ముడి పదార్థాల ధరలు గణనీయంగా పెరిగాయి. ఇది కంపెనీల ఆదాయాలు, లాభాలను దెబ్బతీసింది. ఇవి చాలవన్నట్టు పులి మీద పుట్రలా సూర్యుడి భగభగలు, ఎన్నికల ప్రచార హోరుతో నిర్మాణ రంగంలో కార్యకలాపాలకు బ్రేక్ పడింది.

**ఫ్లాట్‌గా లాభాలు**

ఈ కారణంగానే అల్ట్రాటెక్ కంపెనీ ఆదాయం గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఈ ఏడాది జూన్ త్రైమాసికంలో 1.87 శాతం వృద్ధి రేటుతో రూ.18,069.56 కోట్లకు చేరినా నికర లాభం మాత్రం ఫ్లాట్‌గా రూ.1,696.56. కోట్లుగా నమోదు చేసింది. ఏసీసీ నికర లాభాలకైతే జూన్ త్రైమాసికంలో 22.46 శాతం గండి పడి రూ.361.40 కోట్లకు చేరింది. ఇదే కాలంలో కంపెనీ ఆదాయం స్వల్పంగా తగ్గి రూ.5,154.89 కోట్లుగా నమోదైంది. అయితే జూన్ త్రైమాసికం నిరాశ పరిచినా భవిష్యత్‌కు మాత్రం ఢోకా లేదని కంపెనీలు కొండంత ఆశాభావంతో ఉన్నాయి. పుంజుకుంటున్న గృహ, మౌలిక సదుపాయాల నిర్మాణం, బడ్జెట్‌లో మౌలిక, గృహ రంగాలకు పెద్ద మొత్తంలో నిధులు కేటాయించడంతో పాటు దేశవ్యాప్తంగా సాధారణ వర్షపాతం నమోదు కావటం సానుకూల అంశాలుగా ఉన్నాయని పరిశ్రమ వర్గాలంటున్నాయి.

## పండగ సీజన్ అమ్మకాలపైనే ఆశలు

**టాటా మోటార్స్**

న్యూఢిల్లీ: దేశీయ ఆటోమొబైల్ కంపెనీలకు ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఎగుమతులు పెద్దగా కలిసొచ్చే సూచనలు కనిపించడం లేదు. దీంతో దేశీయ డిమాండ్ ముఖ్యంగా వచ్చే పండగల సీజన్ అమ్మకాలపైనే కంపెనీలు గంపెడాశలు పెట్టుకున్నాయి. టాటా మోటార్స్ కంపెనీ గ్లోబల్ సీఎఫ్ఓ పీబీ బాలాజీ అనలిస్టుల కాల్‌కు సమాధానంగా ఈ విషయం చెప్పారు. వర్షాలు క్రమంగా పుంజుకోవడం, మౌలిక సదుపాయాలపై ప్రభుత్వం భారీగా పెట్టుబడులు పెట్టడం, కొత్త వాహనాల విడుదల ఇందుకు దోహదం చేస్తాయన్నారు. ప్రధాన ముడిపదార్థాల ధరలు కూడా ప్రస్తుతం స్థిరంగా ఉన్నాయి. కాబట్టి వచ్చే త్రైమాసికాల్లోనూ కంపెనీ లాభాలకు పెద్దగా ఢోకా ఉండక పోవచ్చన్నారు. ప్రస్తుతం ఆటోమొబైల్ డీలర్ల వద్ద వాహన నిల్వలు 67 నుంచి 72 రోజులకు చేరాయి. వీటి విలువ రూ.73,000 కోట్ల వరకు ఉంటాయని అంచనా. ఈ నేపథ్యంలో టాటా మోటార్స్ ఉన్నతాధికారి ఈ విషయం చెప్పడం విశేషం.

**ఫారం గేటు అమ్మకం ధరలు** (నెక్ 100 గుడ్లు)



| 12వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 445 | విజయవాడ | 475 |
| వరంగల్ | 447 | గోదావరి | 466 |
| చిత్తూరు | 493 | విశాఖపట్నం | 475 |
| | | డజను గుడ్లు రూ. 66 | |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**



| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 80 | విజయవాడ | 88 |
| వరంగల్ | 80 | గుంటూరు | 88 |
| కరీంనగర్ | 80 | ఒంగోలు | 88 |
| మహబూబ్‌నగర్ | 80 | చిత్తూరు | 96 |
| కర్నూలు | 80 | నెల్లూరు | 96 |
| విశాఖపట్నం | 84 | అనంతపురం | 88 |
| గోదావరి | 88 | | |

## ఆటుపోట్లు తప్పకపోవచ్చు.. !

దేశీయ స్టాక్ మార్కెట్లు ఈ వారం మరింత ఆటుపోట్లకు లోనయ్యే అవకాశం ఉంది. పశ్చిమాసియాలో యుద్ధం మరింత తీవ్రతరం కావటం, అమెరికా సహా యూరప్ ఆర్థిక వ్యవస్థలు బలహీనంగా ఉండటమే ఇందుకు కారణం. వీటి ప్రభావం భారత మార్కెట్లపై ఎక్కువగా కనిపిస్తోంది. సెబీ చీఫ్‌పై హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణలు కూడా ప్రభావం చూపించే అవకాశం కనిపిస్తోంది. గడచిన రెండు వారాలుగా నష్టాల్లోనే ముగిసిన సూచీలు గత శుక్రవారం మాత్రం లాభాలతో ముగిసాయి. కాగా ఫార్మా, హెల్త్‌కేర్ రంగాలు ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. అంతర్జాతీయ పరిస్థితులు మెరుగుపడేంత వరకు మదుపరులు ఆచితూచి వ్యవహరించటం మంచిది.

**స్టాక్ రికమండేషన్స్**

**మహీంద్రా అండ్ మహీంద్రా:** జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ షేర్లలో కన్సాలిడేషన్ జరుగుతోంది. జూన్ త్రైమాసిక ఫలితాల తర్వాత మళ్లీ మూమెంటమ్ పెరిగింది. ప్రస్తుతం ఈ షేరు కీలక మద్దతు స్థాయికి చేరుకుంది. గత శుక్రవారం ఈ షేరు 2.47 శాతం లాభంతో రూ.2,749 వద్ద క్లోజైంది. మదుపరులు ఈ కౌంటర్‌లోకి రూ.2,740/2,720 శ్రేణిలో ప్రవేశించి రూ.2,850/2,900 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,700 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**సీజీ పవర్:** ఈ షేరు ప్రస్తుతం స్వల్పకాలిక డౌన్‌ట్రెండ్‌లో ఉంది. తాజా ఆర్థిక ఫలితాల తర్వాత మూమెంటమ్, వాల్యూమ్ గణనీయంగా పెరిగాయి. రిలేటివ్ స్ట్రెంత్ బాగుంది. గత శుక్రవారం 5.09 శాతం లాభంతో రూ.713 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో ఇన్వెస్టర్లు రూ.700 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.775/790 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.680 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**సీడీఎస్ఎల్:** కన్సాలిడేషన్ అనంతరం ఈ షేరు పుంజుకుంది. గత శుక్రవారం 4.57 శాతంతో రూ.2,565 వద్ద క్లోజైంది. సరికొత్త జీవితకాల గరిష్ఠాన్ని బ్రేక్ చేసింది. ఈపీఎస్ క్రమంగా పెరుగుతుండటం శుభసూచకం. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.2,500 స్థాయిలో ప్రవేశించి రూ.2,750/2,800 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,460 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**గ్రాసిమ్:** జీవితకాల గరిష్ఠాన్ని తాకిన తర్వాత ఈ కౌంటర్‌లో 10 శాతం మేర కరెక్షన్ జరిగింది. జూన్ త్రైమాసిక ఫలితాలు ఆకర్షణీయంగా ఉండటంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు ఆసక్తి చూపిస్తున్నారు. గత శుక్రవారం ఇంట్రాడేలో 4 శాతం వరకు పెరిగిన ఈ షేరు చివరకు 1.10 శాతం లాభంతో రూ.2,572 వద్ద క్లోజైంది. మూమెంటమ్ ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.2,550 శ్రేణిలో ప్రవేశించి రూ.2,750/2,800 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,510 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

**ఇన్ఫోసిస్:** జీవితకాల గరిష్ఠం వైపు సాగుతున్న ఈ కౌంటర్‌లో స్వల్ప కరెక్షన్ కనిపిస్తోంది. కీలక నిరోధం వద్ద కన్సాలిడేషన్ జరుగుతోంది. రెండు వారాలుగా నష్టాల్లోనే కొనసాగుతున్న ఈ కౌంటర్‌లో శుక్రవారం డోజీ ఫామ్ ఏర్పడింది. గత శుక్రవారం రూ.1,770 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లోకి మదుపరులు రూ.1,750 స్థాయిలో పొజిషన్ తీసుకుని రూ.1,840/1,920 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,710 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం, మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

**టెక్ వ్యూ**

## 24,500 పైన రికవరీ తప్పనిసరి



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం డౌన్‌ట్రెండ్‌లోనే ప్రారంభమైనా రికవరీ బాట పట్టి శుక్రవారం 24,400 సమీపంలో ముగిసింది. అయినా వారం మొత్తం మీద 350 పాయింట్ల మేరకు నష్టపోయింది. అలాగే వారంలో ఏర్పడిన కనిష్ఠ స్థాయి నుంచి 450 పాయింట్ల మేరకు కోలుకుంది. 24,000 వద్ద మార్కెట్ మద్దతు తీసుకుందనేందుకు ఇది సంకేతం. అక్కడే మైనర్ బాటమ్ ఏర్పడినట్టు కనిపిస్తోంది. అయినా ఇంకా అప్‌ట్రెండ్ సంకేతం ఇవ్వాల్సి ఉంది. ఈ కారణంగా రాబోయే కొద్ది రోజుల్లో పాజిటివ్ కన్సాలిడేషన్ సాధించాలి. అయితే గత వారం తీవ్రమైన ఆటుపోట్లు ఎదుర్కొన్నందు వల్ల మార్కెట్ నిలదొక్కుకోవడం అవసరం. గత వారంలో మిడ్‌క్యాప్-100 సూచీ 750 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 సూచీ 400 పాయింట్లు నష్టపోయాయి. మిడ్‌క్యాప్ సూచీ అయితే ఇటీవల సాధించిన గరిష్ఠ స్థాయిల నుంచి 1,500 పాయింట్ల మేరకు దిగజారింది. ఈ వారంలో మార్కెట్ మరింత రికవరీ సాధించే ఆస్కారం ఉంది. స్వల్పకాలిక నిరోధం 24500 వద్ద పరీక్ష ఎదుర్కొనవచ్చు.

**బుల్లిష్ స్థాయిలు:** మరింత అప్‌ట్రెండ్ కోసం 24,500 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన ప్రధాన నిరోధాలు, టార్గెట్లు 24,800, 25,000.

**బేరిష్ స్థాయిలు:** మైనర్ మద్దతు స్థాయి 24,300 వద్ద విఫలమైతే మరింత బలహీనపడవచ్చు. ప్రధాన మద్దతు స్థాయి 23,950. గత వారంలో ఇక్కడే మేజర్ బాటమ్ కూడా ఏర్పడింది. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో ప్రవేశిస్తుంది.

**బ్యాంక్ నిఫ్టీ:** ఈ సూచీ వారం ప్రారంభంలో 1,600 పాయింట్ల మేరకు నష్టపోయి మైనర్ రికవరీ సాధించింది. అయినా వారం మొత్తం మీద 860 పాయింట్ల నష్టంతో 50,500 సమీపంలో ముగిసింది. మరింత అప్‌ట్రెండ్ కోసం మైనర్ నిరోధం 50,800 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన మద్దతు స్థాయి 51,500. బలహీనపడినా మైనర్ మద్దతు స్థాయి 50,300 వద్ద నిలదొక్కుకోలేకపోతే మరింత బలహీనపడుతుంది.

**ప్యాటర్న్:** గత వారం 50 డిఎంఏ వద్ద రికవరీ సాధించిన ఈ సూచీ ప్రస్తుతం 25 డిఎంఏ కన్నా స్వల్పంగా దిగువన ఉంది. సానుకూలత కోసం ఇక్కడ రికవరీ తప్పనిసరి. అలాగే సానుకూలత కోసం 24,500 వద్ద "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవాలి.

**టైమ్:** ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

| సోమవారం స్థాయిలు | |
|---|---|
| నిరోధం | 24,455, 24,500 |
| మద్దతు | 24,300, 24,240 |

# బుక్‌బ్రహ్మ ఉత్సవ్‌లో తెలుగు సాహిత్య సౌరభం

» ప్రముఖ రచయిత జయమోహన్‌కు బుక్‌బ్రహ్మ సాహిత్య పురస్కారం



'నెమ్మి నీలం' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జయమోహన్ తదితరులు

బెంగళూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బుక్‌బ్రహ్మ సాహిత్య ఉత్సవ్‌లో తెలుగు సాహిత్య సౌరభం వెల్లివిరిసింది. మూడురోజులపాటు సాగిన ఉత్సవంలో వందలాదిమంది తెలుగు రచయితలు, సాహితీ అభిలాషులు పాల్గొన్నారు. ఐదు వేదికల ద్వారా 50కి పైగా చర్చాగోష్ఠులు, పుస్తకావిష్కరణలు నిర్వహించారు. పలు సమీక్షల్లో 'ఆంధ్రజ్యోతి' ఎడిటర్ కె.శ్రీనివాస్ భాగస్వాములయ్యారు. తెలుగుతోపాటు కన్నడ, తమిళం, మళయాళ భాషల ప్రముఖ రచయితలు పాల్గొన్నారు. చివరిరోజు ఆదివారం వేలాది మంది సందర్శకులతో బెంగళూరు సెయింట్‌జాన్స్ ఆడిటోరియం కిటకిటలాడింది. 'నెమ్మి నీలం' పుస్తకావిష్కరణతోపాటు 'తెలుగు కథా ప్రపంచం' అనే అంశంపై చర్చాగోష్ఠి నిర్వహించారు. నాగర్‌కోయిల్‌కు చెందిన తమిళం, మళయాళ భాషల ప్రముఖ రచయిత జయమోహన్‌కు బుక్‌బ్రహ్మ సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. రబ్బర్, కాడు, విష్ణుపురం, ఈజంపులగంతోపాటు ఎన్నో కృతులు ఆయన రచించారు. 2005లో ప్రసిద్ధమైన ఆధునిక మహాకావ్యం కొర్రవై ద్వారా గుర్తింపు పొందారు. జయమోహన్‌కు బుక్ బ్రహ్మ ఉత్సవ్ సాహిత్య పురస్కారం, జీవన సాఫల్య పురస్కారంతోపాటు రూ.2లక్షల నగదు అందజేశారు.

# లోపాలకు అధికారులే బాధ్యులు..

» నిబంధనల ఉల్లంఘన తెలిసి ఉదాసీనం

» 'ఢిల్లీ కోచింగ్ సెంటర్' దుర్ఘటనపై నివేదిక

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ఢిల్లీలోని ఐఏఎస్ కోచింగ్ సెంటర్‌లో వరదల కారణంగా ముగ్గురు అభ్యర్థులు మృతి చెందిన ఘటనపై చేపట్టిన విచారణ దర్యాప్తు నివేదికను జిల్లా మెజిస్ట్రేట్ (సెంట్రల్) సుధాకర్ రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు. ఈ దుర్ఘటనకు సంబంధించి మునిసిపల్ కార్పొరేషన్ ఆఫ్ ఢిల్లీ (ఎంసీడీ), ఢిల్లీ అగ్నిమాపక సేవల (డీఎఫ్ఎస్) అధికారులే పెద్ద లోపాలకు బాధ్యులుగా దర్యాప్తు నివేదికలో పేర్కొన్నారు. సెంట్రల్ ఢిల్లీలోని సదరు కోచింగ్ సెంటర్ నిబంధనలు ఉల్లంఘిస్తున్నట్లు తెలిసినా ఆ రెండు విభాగాల అధికారులు చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని తేల్చారు. 'అగ్నిమాపక శాఖ నిరభ్యంతర పత్రం లేకుండానే ఎంసీడీ భవన ప్లాన్‌ను ఆమోదించింది. విద్యా అవసరాలకు కాకుండా కార్యాలయ/వ్యాపార అవసరాలకు మాత్రమే ఆ భవనానికి అనుమతి ఉంది. దాని ఎత్తు 9 మీటర్లకు మించి ఉన్నందున అగ్నిమాపకశాఖ నిరభ్యంతర పత్రం తప్పనిసరి. భవన సెల్లార్‌లో లైబ్రరీ నిర్వహించడం కోచింగ్ సెంటర్, యాజమాన్యం నేరపూరిత నిర్లక్ష్యమే. అక్కడి కోచింగ్ సెంటర్లను రోహిణి, నరేలాకు మార్చాలి' అని నివేదికలో పేర్కొన్నారు.

## లోకం తీరు





ఐసీఏఆర్‌లో శాస్త్రవేత్తలతో మోదీ

## 109 రకాల కొత్త వంగడాలు విడుదల

న్యూఢిల్లీ, ఆగస్టు 11: ఏ రకమైన వాతావరణాన్నయినా తట్టుకుని అధిక దిగుబడినిచ్చే 109 రకాల కొత్త వంగడాలను ప్రధాని మోదీ ఆదివారం విడుదల చేశారు. ఢిల్లీలోని భారత వ్యవసాయ పరిశోధనా కేంద్రం (ఐసీఏఆర్)లో జరిగిన ఈ కార్యక్రమం సందర్భంగా వంగడాలు, సేంద్రీయ వ్యవసాయ ప్రాముఖ్యత వంటి అంశాలపై రైతులు, వ్యవసాయ శాస్త్రవేత్తలతో ఆయన చర్చించారు. చిరుధాన్యాల ప్రాముఖ్యతను మోదీ ఈ సందర్భంగా వివరించారు. సేంద్రియ వ్యవసాయానికి డిమాండ్ పెరిగిందని ప్రజలు అటువంటి ఆహారాన్నే ఇష్టపడుతున్నారని వెల్లడించారు. కొత్త వంగడాలను అభివృద్ధి చేసిన వ్యవసాయ శాస్త్రవేత్తలను మోదీ అభినందించారు. అనంతరం కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, కొత్త వంగడాలు రైతుల ఆదాయాన్ని పెంచుతాయని, ప్రకృతి సిద్ధమైన వీటి విత్తనాలు మంచి దిగుబడినిస్తాయని చెప్పారు.

## కులం వల్లే భారత సమాజంలో ఐక్యత: పాంచజన్య

న్యూఢిల్లీ, ఆగస్టు 11: భారతీయ సమాజాన్ని కుల వ్యవస్థే సమైక్యంగా ఉంచుతోందని ఆర్ఎస్ఎస్‌కు చెందిన 'పాంచజన్య' పత్రిక పేర్కొంది. మొగల్ పాలకులు దీనిని అర్థం చేసుకోలేదని.. బ్రిటిషర్లు మాత్రం కనిపెట్టి 'విభజించి-పాలించు' విధానంలో దెబ్బ తీసేందుకు ప్రయత్నించారని తెలిపింది. పాంచజన్య పత్రిక సంపాదకుడు హితేశ్ శంకర్ 'ఓ నేతా.. నీదే కులం!' శీర్షికన ఆ పత్రికలో సంపాదకీయం రాశారు. కులగణన చేపట్టాలన్న కాంగ్రెస్ డిమాండ్‌పై మండిపడ్డారు. హిందువుల ఐక్యతను చీల్చేందుకు ఇది సాధనమని కాంగ్రెస్ అనుకుంటోందని విమర్శించారు. బ్రిటిషర్ల మాదిరిగానే ఆ పార్టీ కూడా లోక్‌సభ స్థానాలను కులాల ప్రాతిపదికన వ్యవస్థీకరించాలని.. దేశంలో చీలికలను మరింత పెంచాలని అనుకుంటోందని ధ్వజమెత్తారు.

## మహారాష్ట్రలో 'సీఎం' అభ్యర్థి లేకుండా ఎన్నికలకు!

» కాంగ్రెస్ ప్రతిపాదన.. పవార్, ఉద్ధవ్ సేన మద్దతు అనుమానమే

ముంబై, ఆగస్టు 11: ముఖ్యమంత్రి పదవికి ఎవరినీ అభ్యర్థిగా ప్రకటించకుండా మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో పోరాడదామని కాంగ్రెస్ ప్రతిపాదించింది. ఎన్నికల ఫలితాల తర్వాత ఖరారుచేద్దామని 'మహా వికాస్ అఘాడీ'లోని భాగస్వామ్య పక్షాలైన ఉద్ధవ్ శివసేన, శరద్ పవార్ ఎన్సీపీలకు సూచించింది. అయితే దీనిని ఉద్ధవ్ శివసేన అంగీకరించడం సందేహమేనని రాజకీయ వర్గాలు అంటున్నాయి. ఎందుకంటే ఉద్ధవ్ ఠాక్రేను సీఎం అభ్యర్థిగా ప్రకటించి ఎన్నికలకు వెళ్లాలని ఆ పార్టీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఎన్సీపీ (పవార్) కూడా సమర్థిస్తున్నారు. ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో 48 స్థానాలకు అఘాడీ 30 చోట్ల గెలిచింది. ఇందులో కాంగ్రెస్ అత్యధికంగా 13 సీట్లు సాధించింది. కూటమికి తానే నాయకత్వం వహించాలని కాంగ్రెస్ ఆశపడుతోంది.

## రాహుల్ గాంధీ బ్రిటిష్ పౌరుడే: సుబ్రహ్మణ్య స్వామి

న్యూఢిల్లీ, ఆగస్టు 11: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ బ్రిటీష్ పౌరుడేనని బీజేపీ నేత సుబ్రహ్మణ్య స్వామి ఆరోపించారు. రాహుల్ గాంధీ 2003లో బ్రిటీష్ పౌరసత్వం తీసుకున్నారని, లండన్‌లో బ్యాక్‌ఆప్స్ అనే కంపెనీని కూడా స్థాపించారని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. రాహుల్ తన కంపెనీకి సంబంధించి బ్రిటీష ప్రభుత్వానికి యాన్యువల్ రిటర్న్‌లను కూడా సమర్పిస్తున్నారని తెలిపారు. అందుకు సంబంధించిన పత్రాలను బయటపెట్టారు. ఆ కంపెనీకి రాహుల్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారని, ఆయన బ్రిటీష్ పౌరుడేననడానికి ఇంత కంటే ఆధారాలు అవసరం లేదని పేర్కొన్నారు. రాహుల్ పౌరసత్వానికి సంబంధించి తాను పూర్తి వివరాలు సమర్పిస్తున్నానని, ఆయనపై చర్యలు తీసుకోవాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు.

## క్రోమ్ బ్రౌజర్‌లో లోపాలు.. అప్‌డేట్ చేసుకోవాలన్న సెర్ట్

న్యూఢిల్లీ, ఆగస్టు 11: డెస్క్‌టాప్ కంప్యూటర్లలో గూగుల్ క్రోమ్ బ్రౌజర్ వాడేవారు జాగ్రత్తగా ఉండాలని భారత 'కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సెర్ట్-ఇన్)' తీవ్ర హెచ్చరిక జారీ చేసింది. ఆ బ్రౌజర్‌లో ఉన్న లోపాల ఆధారంగా హ్యాకర్లు కంప్యూటర్‌లోకి చొరబడి డేటా, పాస్‌వర్డ్స్ దొంగిలించే ప్రమాదం ఉన్నదని పేర్కొంది. విండోస్, మ్యాక్ కంప్యూటర్లలో.. క్రోమ్ వెర్షన్ 127.0.6533.88/89 కన్నా ముందు వెర్షన్ ఉంటే వెంటనే లేటెస్ట్ వెర్షన్‌కు అప్‌డేట్ చేసుకోవాలని సూచించింది.

## ప్రశాంతంగా నీట్-పీజీ ప్రవేశ పరీక్ష

న్యూఢిల్లీ, ఆగస్టు 11: నీట్- పీజీ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 170 నగరాల్లోని 416 కేంద్రాల్లో రెండు సెషన్లలో ఈ పరీక్ష జరిగింది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్(ఎన్‌బీఈ) కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంది. నీట్-యూజీ, యూజీసీ-నెట్ వంటి పరీక్షల విశ్వసనీయత విషయంలో వివాదాలు రేకెత్తడంతో... జూన్ 23న జరుగవలసిన పరీక్షను కేంద్రం వాయిదా వేసిన సంగతి తెలిసిందే.

## ఉత్తరాదిలో వర్ష బీభత్సం.. 28 మంది మృతి


ఆదివారం పట్నాలో ఓ ఆస్పత్రి వద్ద వరద

సిమ్లా, చండీగఢ్, ఆగస్టు 11: కుండపోత వర్షాలతో ఉత్తరాది అతలాకుతలమవుతోంది. ఆదివారం ఢిల్లీ, పంజాబ్, హరియాణా, రాజస్థాన్, హిమాచల్‌ప్రదేశ్‌తోపాటు దేశవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో వర్షాలు దంచికొట్టాయి. ఉత్తరాదిలో భారీ వర్షాలు, ఆకస్మిక వరదల వల్ల తీవ్ర ఆస్తి, ప్రాణ నష్టం జరిగిందని, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో కనీసం 28 మంది మరణించారని తెలుస్తోంది. భారీ వర్షాల కారణంగా అమర్‌నాథ్ యాత్రను తాత్కాలికంగా నిలివేసినట్లు జమ్మూకశ్మీర్ అధికారులు తెలిపారు. భారీ వర్షాలు, వరదలతో హిమాచల్‌ప్రదేశ్ వణికిపోతోంది. రెండు రోజులుగా కుండపోతగా కురుస్తున్న వర్షాలకు 280పైగా రోడ్లు ధ్వంసమైనట్లు అధికారులు తెలిపారు. కొండచరియలు విరిగిపడటంతో శనివారం ఒక రోజే 150పైగా రోడ్లను మూసివేశారు.

# జేపీసీతో నిగ్గు తేల్చాలి!

(మొదటి పేజీ తరువాయి)

కుంభకోణంపై నిష్పక్షపాత దర్యాప్తు జరగనంతవరకూ ప్రధాని మోదీ.. ఏడు దశాబ్దాల కృషితో నిర్మించిన రాజ్యాంగబద్ధ సంస్థలను పక్కనపెట్టి తన స్నేహితుడిని కాపాడుకోవటానికి ప్రయత్నిస్తున్నారనే అనుమానాలు కొనసాగుతూనే ఉంటాయని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే పేర్కొన్నారు. స్టాక్‌మార్కెట్ అక్రమాలపై దర్యాప్తు చేయాల్సిన సెబీపైనే ఆరోపణలు వచ్చాయి కాబట్టి, ఈ అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా తీసుకొని, స్వీయ పర్యవేక్షణలో దర్యాప్తునకు ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. తీవ్ర ఆరోపణలు వచ్చిన దృష్ట్యా మాధవి బుచ్ తన పదవికి రాజీనామా చేయాలన్నారు. ఈ మేరకు ఖర్గే ఆదివారం 'ఎక్స్'లో ఒక పోస్ట్ పెట్టారు. అదానీపై సెబీ దర్యాప్తునకు సంబంధించి నెలకొన్న సందేహాన్నింటినీ తొలగించేలా కేంద్రప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాలని ఖర్గే డిమాండ్ చేశారు. '2023 జనవరిలో హిండెన్‌బర్గ్ ఆరోపణల నేపథ్యంలో అదానీ కంపెనీలపై దర్యాప్తు జరిపిన సెబీ.. ఎక్కడా తప్పు జరగలేదంటూ సుప్రీంకోర్టుకు తెలిపింది. కానీ, తాజాగా సెబీ చీఫ్‌తోనే క్విడ్ ప్రో కో జరిగినట్లుగా వెల్లడైంది. సెబీపై నమ్మకంతో తమ కష్టార్జితాన్ని స్టాక్‌మార్కెట్లో పెడుతున్న చిన్న, మధ్యస్థాయి ఇన్వెస్టర్లను కాపాడాలి. జేపీసీని ఏర్పాటు చేసి ఈ స్కాంపై సమగ్ర దర్యాప్తు జరిపించాలి' అని డిమాండ్ చేశారు. సెబీ ఛైర్‌పర్సన్‌పై వచ్చిన ఆరోపణలతో ఆ సంస్థ విశ్వసనీయత తీవ్రంగా దెబ్బతిన్నదని రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. స్టాక్‌మార్కెట్లో తమ కష్టార్జితాన్ని పెట్టుబడిగా పెట్టిన చిన్న, మధ్య స్థాయి మదుపరులు నష్టపోతే దానికి మోదీ, సెబీ ఛైర్‌పర్సన్, గౌతమ్ అదానీ బాధ్యత వహిస్తారా అని నిలదీశారు. జేపీసీ దర్యాప్తునకు మోదీ ఎందుకంత భయపడుతున్నారని ప్రశ్నించారు.




### సెబీ 'ఎక్స్' ఖాతాపై పలు ప్రశ్నలు

కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి, మాజీ కేంద్రమంత్రి జైరాం రమేశ్ కూడా ఎక్స్‌లో ఈ వ్యవహారంపై స్పందిస్తూ పలు ప్రశ్నలు లేవనెత్తారు. సెబీ 'ఎక్స్' ఖాతా ప్రజలకు అందుబాటులో లేదని, లాక్ అయి ఉందని జైరాం వెల్లడించారు. సెబీ అత్యున్నత అధికారులపైనే నీలినీడలు కమ్ముకున్న వేళ ఇది మరిన్ని సందేహాలకు తావిస్తోందన్నారు. సెబీ దేశ ప్రజానీకం ఆస్తి అని, దానిని ప్రజలకు కనిపించకుండా ఎలా దాచిపెడతారని జైరాం రమేశ్ ప్రశ్నించారు. మాధవి సెబీ ఛైర్‌పర్సన్ పదవి చేపట్టిన తర్వాత 2022లో గౌతమ్ అదానీ ఆమెను వెంటవెంటనే రెండుసార్లు కలిశారని చెప్పారు. ఆరోపణల నేపథ్యంలో సెబీ ఛైర్‌పర్సన్ పదవి నుంచి మాధవి వైదొలగాలని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి డిమాండ్ చేశారు. దీనిపై తక్షణం దర్యాప్తు జరిపించాలని, మోదీ, ఆర్థికమంత్రి నిర్మల మాట్లాడాలని పేర్కొన్నారు. దేశంలోని ఆర్థిక వ్యవస్థలను ఏ స్థాయిలో హైజాక్ చేశారో ఈ అవినీతి వ్యవహారం వెల్లడిస్తోందని ఆర్జేడీ విమర్శించింది.

### దేశంలో ఆర్థిక అస్థిరతకు కుట్ర

దేశంలో ఆర్థిక అస్థిరత సృష్టించి కల్లోల పరిస్థితులను తీసుకురావాలనే విదేశీ కుట్రలో భాగంగానే కాంగ్రెస్, ఇతర విపక్షాలు ఆరోపణలు చేస్తున్నాయని బీజేపీ విమర్శించింది. అదానీ గ్రూప్ మీద గతేడాది తీవ్ర ఆరోపణలు చేసిన హిండెన్‌బర్గ్‌పై భారతీయ దర్యాప్తు సంస్థలు విచారణ జరుపుతున్నాయని, పార్లమెంటు సమావేశాల సమయంలోనే విదేశాల నుంచి ఇటువంటి నివేదికలు వెల్లడవుతున్నాయని బీజేపీ అధికార ప్రతినిధి సుధాంశు త్రివేది చెప్పారు.

### హిండెన్‌బర్గ్ ఆరోపణలు పచ్చి అబద్ధాలు



హిండెన్‌బర్గ్ రీసెర్చ్ ఆరోపణలను మాధవి పురి బుచ్, ఆమె భర్త ధవల్ బుచ్ తోసిపుచ్చారు. తాము ఎన్నడూ అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు లేదా రుణ పత్రాల్లో పెట్టుబడులు పెట్టలేదని స్పష్టం చేశారు. దీనికి సంబంధించి ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. హిండెన్‌బర్గ్ ఆరోపణలు పచ్చి అబద్ధాలని, తమ వ్యక్తిత్వాన్ని, సెబీ విశ్వసనీయతను దెబ్బతీసేందుకే పనిగట్టుకుని ఆ సంస్థ ఈ ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. తమ ఆర్థిక లావాదేవీలు తెరిచిన పుస్తకమని తెలిపారు. గత నెలలో సెబీ జారీ చేసిన షోకాజ్ నోటీసుకు సమాధానం దాటవేసేందుకే హిండెన్‌బర్గ్ ఈ ఆరోపణలకు దిగిందన్నారు. సింగపూర్ ప్రైవేట్ పౌరులుగా ఉన్నపుడు తన భర్త బాల్యమిత్రుడు అనిల్ అహూజా సలహాపై రెండు ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టిన విషయం మాత్రం నిజమన్నారు. అయితే అహూజా సిటీ బ్యాంక్ నుంచి తప్పుకున్న వెంటనే తాము కూడా ఆ పెట్టుబడుల నుంచి తప్పుకున్నట్టు ఆ ప్రకటనలో తెలిపారు. మరోవైపు సెబీ కూడా తాజా పరిణామాలపై ఒక ప్రకటన విడుదల చేసింది. తమ చీఫ్ మాధవి పురి బుచ్ తన పెట్టుబడుల వివరాలను ఎప్పటికప్పుడు సెబీ బోర్డుకు వెల్లడించారని తెలిపింది. తనకు, తన కుటుంబ సభ్యులకు పెట్టుబడులు ఉన్న సంస్థల అంశాలు చర్చకు వచ్చినప్పుడు.. ఆమె అసలు ఆ చర్చల్లోనే పాల్గొనే వారు కాదని స్పష్టం చేసింది.

## హిండెన్ బర్గ్ పెద్ద అబద్ధాల పుట్ట

హిండెన్‌బర్గ్ ఆరోపణలపై అదానీ గ్రూప్ ఆదివారం రెగ్యులేటరీ సంస్థలకు ఒక వివరణ ఇచ్చింది. సెబీ చీఫ్ మాధవి పురి బుచ్‌తో తమ గ్రూప్‌నకు ఎలాంటి వాణిజ్య సంబంధాలు లేవని స్పష్టం చేసింది. హిండెన్‌బర్గ్ ఆరోపణలు పచ్చి అబద్ధాలని విమర్శించింది. ఏ మాత్రం విశ్వసనీయత లేని సమాచారం ఆధారంగా తమ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు పనిగట్టుకుని దుష్ప్రచారం చేస్తోందని తెలిపింది. వ్యక్తిగత లాభాపేక్షతోనే హిండెన్‌బర్గ్ ఈ దురాగతానికి పాల్పడుతోందని విమర్శించింది. తమ గ్రూప్‌పై గత ఏడాది జనవరిలో ఈ సంస్థ చేసిన ఆరోపణల్లో ఏమాత్రం పస లేకపోవడం వల్లే ఈ ఏడాది జనవరిలో సుప్రీంకోర్టు కొట్టి వేసిందని స్పష్టం చేసింది. హిండెన్‌బర్గ్ తాజా ఆరోపణలపై మ్యూచువల్ ఫండ్ (ఎంఎఫ్) పరిశ్రమ కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ ఆరోపణలు దేశ ఆర్థిక పురోగతినీ దెబ్బతీసే ముప్పు ఉందని హెచ్చరించింది.

### పైసా పెట్టుబడి పెట్టలేదు: 360 వన్

బుచ్ దంపతులపై హిండెన్‌బర్గ్ ఆరోపణలపై '360 వన్ ఫండ్' (గతంలో ఐఐఎఫ్ఎల్ వెల్త్ మేనేజ్‌మెంట్) కూడా వివరణ ఇచ్చింది. ఐపీఈ ప్లస్ ఫండ్ 1 ద్వారా సమీకరించిన నిధుల్లో పైసా కూడా అదానీ గ్రూప్ కంపెనీల్లో పెట్టుబడి పెట్టలేదని స్పష్టం చేసింది. ఈ ఫండ్ ద్వారా సమీకరించిన 4.8 కోట్ల డాలర్ల నిధుల్లో కేవలం ఒకటిన్నర శాతం మాత్రమే బుచ్ దంపతుల ద్వారా వచ్చినట్టు తెలిపింది. ఈ ఫండ్ నిధుల్లో 90 శాతానికిపైగా నిధులను రుణ పత్రాల్లో పెట్టుబడి పెట్టామే తప్ప, కంపెనీల షేర్లలో మదుపు చేయలేదని స్పష్టం చేసింది. కాగా, హిండెన్‌బర్గ్ ఆరోపణల ప్రభావం సోమవారం స్టాక్ మార్కెట్‌పైనా కనిపించే ప్రమాదం కనిపిస్తోంది. మదుపరులు ప్రశాంతంగా ఉండాలని సెబీ హెచ్చరించింది. హిండెన్‌బర్గ్ సంస్థకు అదానీ గ్రూప్ లిస్టెడ్ కంపెనీల షేర్లలో షార్ట్ పొజిషన్లు కూడా ఉండే అవకాశం ఉందని పరోక్షంగా హెచ్చరించింది.

## విదేశాంగ శాఖ మాజీ మంత్రి
## నట్వర్ సింగ్ కన్నుమూత



న్యూఢిల్లీ, ఆగస్టు 11: విదేశాంగ శాఖ మాజీ మంత్రి కే నట్వర్‌సింగ్(93) కన్నుమూశారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆయన కొన్నాళ్లుగా గురుగ్రామ్‌లోని మేదాంత ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి తుదిశ్వాస విడిచారు. దౌత్య, రాజకీయ రంగాలతోపాటు రచనా వ్యాసంగంలోనూ ఆయన తనదైన ముద్ర వేశారు. కాంగ్రెస్‌తో సుదీర్ఘ అనుబంధం ఉన్న ఆయన మాజీ ప్రధానులు ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీతో సన్నిహితంగా మెలిగారు. 1931లో భరత్‌పూర్ (రాజస్థాన్) రాజ కుటుంబంలో జన్మించిన నట్వర్ సింగ్.. 1953లో ఇండియన్ ఫారిన్ సర్వీసెస్‌కు ఎంపికయ్యారు. విదేశాంగ శాఖ కార్యదర్శిగా కూడా పనిచేశారు. 1984లో ప్రభుత్వం ఆయనను పద్మభూషణ్‌తో సత్కరించింది. అదే ఏడాది నట్వర్ సింగ్ ఉద్యోగానికి రాజీనామా చేసి.. కాంగ్రెస్ పార్టీలో చేరారు. భరత్‌పూర్ నుంచి పోటీ చేసి గెలిచారు. కేంద్ర సహాయ మంత్రిగా పనిచేశారు. 2004లో కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి రావడంతో నట్వర్ సింగ్ విదేశాంగ మంత్రిగా నియమితులయ్యారు. అయితే 18 నెలలకే.. 'ఇరాక్ ఆయిల్ కుంభకోణం'లో ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ కూడా లబ్ధి పొందిందంటూ ఐక్యరాజ్య సమితి స్వతంత్ర కమిటీ నివేదిక ఇవ్వడంతో ఆయన వైదొలగక తప్పలేదు. కొన్నాళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీకీ రాజీనామా చేశారు. తర్వాత బీఎస్పీలో చేరినా నాలుగు నెలలకే క్రమశిక్షణా చర్యల కింద ఆయనను బహిష్కరించారు. నట్వర్‌సింగ్ దౌత్యరంగానికి విశిష్ట సేవలందించారంటూ ప్రధాని మోదీ, ఖర్గే నివాళులర్పించారు.

# బంగ్లాలో అధికార మార్పునకు అమెరికా కుట్ర

## మాజీ ప్రధాని షేక్ హసీనా తీవ్ర ఆరోపణలు



న్యూఢిల్లీ, ఆగస్టు 11: బంగ్లాదేశ్‌లో అధికార మార్పునకు అమెరికా కుట్ర పన్నిందని ఆ దేశ మాజీ ప్రధాని షేక్ హసీనా తీవ్ర ఆరోపణలు చేశారు. బంగ్లాలో తిరుగుబాటు, అల్లర్ల వెనుక కూడా అగ్రరాజ్యం హస్తం ఉందన్నారు. ప్రధాని పదవికి రాజీనామా చేసి ఢాకాలోని నివాసం నుంచి వెళ్లే ముందు జాతినుద్దేశించి ఈ అంశంపై ప్రసంగించాలని ఆమె భావించారు. అయితే ఆమెకు ఆ అవకాశం రాలేదు. ప్రస్తుతం భారత్‌లో ఉన్న ఆమె.. తన సన్నిహితులతో పంచుకున్న ఆ ప్రసంగ పాఠాన్ని ఓ జాతీయ మీడియా చానెల్ బహిర్గతం చేసింది. "మృతదేహాల ఊరేగింపు చూడాల్సిన అవసరం రాకూడదనే రాజీనామా చేశాను. విద్యార్థుల మృతదేహాలపై వారు అధికారంలోకి రావాలనుకున్నారు. అందుకు నేను అనుమతించలేదు. సెయింట్ మార్టిన్ ద్వీపంపై సార్వభౌమత్వాన్ని అప్పగించి బంగాళాఖాతంపై అమెరికా ఆధిపత్యాన్ని చెలాయించడానికి అనుమతించి ఉంటే అధికారంలో కొనసాగి ఉండే దాన్ని. దయచేసి రాడికల్స్ చేతిలో మోసపోవద్దు' అని దేశ ప్రజలను ఆమె వేడుకున్నారు. 'ఒకవేళ నేను బంగ్లాదేశ్‌లోనే ఉండి ఉంటే మరింతమంది ప్రాణాలు పోయి ఉండేవి. మరిన్ని వనరులు ధ్వంసమయ్యేవి. అందుకే నా అంత నేనే రాజీనామా చేశా. మీరే నా బలం. మీరు వద్దనుకున్నారు కాబట్టి వెళ్లిపోతున్నాను' అని బంగ్లా ప్రజలను ఉద్దేశించి హసీనా పేర్కొన్నారు. త్వరలోనే తాను బంగ్లాదేశ్‌కు వెళ్తానని స్పష్టం చేశారు. బంగ్లాదేశ్ క్షేమం కోసం భగవంతుడిని ప్రార్థిస్తానని చెప్పారు. నిరసనలో ఉన్న విద్యార్థులను రజాకార్లు అని తానెప్పుడూ సంబోధించలేదన్నారు.

### అల్ కాయిదా శుభాకాంక్షలు

షేక్ హసీనా ప్రభుత్వాన్ని కూల్చివేసినందుకు బంగ్లాదేశ్ ప్రజలను అభినందిస్తూ అల్ కాయిదా ఉగ్రవాద సంస్థ తాజాగా 12 పేజీల ప్రకటన విడుదల చేసింది. దీన్ని ఈ ప్రాంతంలో ఇస్లామిస్టులు, జిహాదిస్టుల విజయంగా అభివర్ణించింది. ఇస్లామిస్టులు కొత్త ప్రభుత్వంలో భాగస్వాములయ్యే బదులు దేశంలో పూర్తి షరియా పాలన తీసుకొచ్చేందుకు ప్రయత్నించాలని ఏక్యూఐఎస్(అల్ కాయిదా భారత ఉపఖండం) చీఫ్ ఒసామా మసూద్ సూచించారు. మరోవైపు... గ్రామీణ టెలికాం కార్మికులు, ఉద్యోగుల సంక్షేమ నిధిని దుర్వినియోగం చేసినట్లు అవినీతి నిరోధక కమిషన్ ఇదివరకు దాఖలు చేసిన కేసు నుంచి బంగ్లా ప్రభుత్వ ప్రధాన సలహాదారు మొహమ్మద్ యూనస్‌కు విముక్తి లభించింది. ఇదిలా ఉండగా, బంగ్లాదేశ్ నుంచి భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించిన 11 మందిని బీఎస్ఎఫ్ అదుపులోకి తీసుకుంది. పశ్చిమబెంగాల్‌లో ఇద్దరిని, త్రిపురలో ఇద్దరిని, మేఘాలయలో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు.

## బంగ్లాదేశ్‌లో హిందువులపై
## దాడికి నిరసన

» ప్రపంచవ్యాప్తంగా వెల్లువెత్తిన ఆందోళనలు

ఢాకా, వాషింగ్టన్, ఆగస్టు 11: బంగ్లాదేశ్‌లో హిందువుల ఆలయాలు, ఇళ్లు, వ్యాపార సంస్థలపై దాడిని నిరసిస్తూ ఢాకా, చట్టగ్రాం నగరాలలో వరుసగా రెండోరోజూ వేలాదిమంది హిందువులు ఆందోళనలు నిర్వహించారు. వారికి సంఘీభావంగా వేలాదిమంది ముస్లింలు, విద్యార్థులు ఆందోళనల్లో పాల్గొన్నారు. మైనారిటీలను వేధిస్తున్నవారిపై విచారణ వేగవంతానికి ప్రత్యేక ట్రైబ్యునళ్లను ఏర్పాటు చేయాలని, పార్లమెంటులో 10 శాతం సీట్లను మైనారిటీలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఢాకాలోని షాబాగ్ ప్రాంతంలో నిరసన సందర్భంగా మూడు గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. మరోవైపు బంగ్లాదేశ్‌లో హిందువులపై హింసాత్మక దాడులు పెరగడాన్ని నిరసిస్తూ ప్రపంచవ్యాప్తంగా ఆందోళనలు వెల్లువెత్తాయి. దాడులను ఖండిస్తూ లండన్, వాషింగ్టన్ డీసీ సహా ప్రధాన నగరాలలో ప్రదర్శనలు నిర్వహించారు. లండన్‌లోని పార్లమెంటు భవనం ఎదుట ఆందోళనకారులు బంగ్లాదేశ్ జెండా, చిహ్నాంలతో నిరసన తెలిపారు. అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్ ఎదుట నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వివిధ మానవహక్కుల సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయం వద్ద కూడా శనివారం ఆందోళన నిర్వహించారు. కాగా, దేశంలో మైనారిటీలపై జరుగుతున్న దాడుల్ని బంగ్లాదేశ్ తాత్కాలిక నేత మొహమ్మద్ యూనస్ ఖండించారు. హిందువులు, క్రైస్తవులు, బౌద్ధులను కాపాడవలసిందిగా యువతను కోరారు.

# అల్లుడు ఆరడుగులు ఉంటాడనుకున్నా

## 5.55 అడుగుల సచిన్‌ను చూసి ఆశ్చర్యపోయా.. క్రికెట్ దిగ్గజం అత్త అనాబెల్ మెహతా

(సెంట్రల్ డెస్క్)

పాలబుగ్గల పసివాడిగా క్రీజులో అడుగుపెట్టి.. మొనగాళ్లలాంటి బౌలర్ల పనిపట్టి.. రికార్డులను కొల్లగొట్టి.. చరిత్రలో తనకెవరూ సాటిలేరని చాటిన మేటి క్రికెటర్ సచిన్ టెండూల్కర్ గురించి క్రికెట్ అభిమానులందరికీ తెలిసిందే. అయితే, అతడి ప్రేమకు సంబంధించిన అత్యంత వ్యక్తిగత విషయం ఒకదాన్ని బయటపెట్టారు టెండూల్కర్ అత్త అనాబెల్ మెహతా. తన కుమార్తె డాక్టర్ అంజలి-సచిన్ ప్రేమ వివాహానికి ముందు జరిగిన ఈ ఘటనను "మై పాసేజ్ టు ఇండియా: ఎ మెమోయిర్" పుస్తకంలో ఆమె వివరించారు. అప్పట్లో ఏం జరిగిందో అనాబెల్ మాటల్లోనే.. అంజలి ఓ కుర్రాడితో ప్రేమలో ఉందని తెలిసి అతడిని చూడాలనుకున్నా. నా సోదరుడు రిచర్డ్ ఇంట్లో కలిసేందుకు ఏర్పాటు చేశాం. వచ్చే కుర్రాడు ఆరడుగుల ఎత్తుతో, అందంగా ఉంటాడని ఊహించుకున్నా. కానీ, వచ్చింది 19 ఏళ్ల సచిన్ టెండూల్కర్. దీంతో ఆశ్చర్యపోయా. అతడు పిల్లాడిలా కనిపించాడు. మృదుస్వభావి, తక్కువగా మాట్లాడుతూ సిగ్గు పడుతున్నాడు. సచిన్‌తో ఒంటరిగా మాట్లాడేందుకు.. అంజలి, రిచర్డ్‌ను వెళ్లిపొమ్మన్నా. నా భర్త ఆనంద్ మెహతాకు సచిన్ గురించి తెలుసు కాబట్టి ఆయన నుంచి అభ్యంతరం లేదు. సచిన్ అప్పటికే సూపర్ స్టార్. ఇలా పేరువచ్చిన చాలామంది తర్వాత దారి తప్పడంతో నా మనసులో భయాందోళన నెలకొంది. ఇంతలో అసలు సంగతి గుర్తొచ్చింది. 'అంజలి గురించి నీ ఉద్దేశం ఏమిటి?' అని సచిన్ కళ్లలోకి చూస్తూ ప్రశ్నించా. "మేమిద్దరం పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాం" అని చెప్పాడు. దీంతో కొంత ఆశ్చర్యపోయా. 5.5 అడుగులకు కొంచెం ఎక్కువగా సచిన్ మా అమ్మాయి కంటే కాస్త ఎత్తు అంతే. బహుశా అతడి రింగుల జుట్టు అంగుళం ఎత్తు ఎక్కువ కనిపించేలా చేస్తుందేమో? అంజలి హీల్స్ వేసుకుంటే మాత్రం సచిన్ కంటే ఎత్తుగా కనిపించడం ఖాయం. ఇక తనను చూసిన మొదటిసారే ప్రేమలో పడినట్లు సచిన్ చెప్పాడని అంజలి తెలిపింది. వారిద్దరూ గాఢమైన ప్రేమలో ఉన్నారని నాకర్థమైంది. కూతురు సంతోషమే కోరుకున్నా. కానీ, భారత్‌లో యువకులకు పెళ్లి వయసు 21. సచిన్‌కు అప్పటికి 19 ఏళ్లే. అంజలి మెడిసిన్ పీజీ పూర్తి చేయాల్సి ఉంది. అందుకనే మరో రెండేళ్లు ఆగాలని.. అప్పటివరకు ఈ విషయం ఎవరికీ చెప్పొద్దని సచిన్‌ను కోరా.



### దొంగచాటుగా మా ఇంటికి..

పెళ్లికి అంగీకారం తెలిపాక.. వార్డెన్ రోడ్‌లోని మా ఇంటికి సచిన్ వచ్చేవాడు. మా మరదలు తులసి ఒకసారి వాచ్‌మన్ కుమారుడు అనుకుని భ్రమపడింది. వీధిలో శనగలు అమ్మే వ్యక్తి, సమీపంలోని అమెరికన్ కాన్సులేట్ భద్రతా సిబ్బంది తప్ప టెండూల్కర్‌ను ఎవరూ గుర్తుపట్టేవారు కాదు. కానీ, వీరెవరూ మీడియాకు చెప్పలేదు. న్యూజిలాండ్ టూర్‌లో ఉన్న సచిన్ కాల్ చేయడంతో పెళ్లి గురించి అంజలి కాస్త గట్టిగా అడిగింది. దీంతో తన తల్లిదండ్రులతో మాట్లాడమని అతడు సూచించాడు. సచిన్ అన్నయ్య అజిత్ చొరవతో అంజలి వారి తల్లిదండ్రులను కలిసింది. మేము మాత్రం నిశ్చితార్థం ముందువరకు కలవలేదు. సమావేశమయ్యాక.. వారి కట్టుబాట్లు, మధ్య తరగతి, ప్రశాంత జీవితం చూసి మేం సంతోషించాం.

### సరిగ్గా సచిన్ పుట్టిన రోజునే నిశ్చితార్థం

సచిన్-అంజలి నిశ్చితార్థం సరిగ్గా సచిన్ 21వ పుట్టిన రోజు (1994 ఏప్రిల్ 24)న జరిగింది. 25 మంది బంధువులనే పిలిచాం. తర్వాత మీడియాకు తెలియజేశాం. అంతే.. గగ్గోలు రేగింది. ఎవరీ అంజలి? అంటూ వెదుకులాట మొదలుపెట్టారు. 16 ఏళ్ల వయసులో అంజలి కాలేజీలో చేరినపుడు ఇచ్చిన ఫొటో మాత్రమే వారికి దొరికింది. ఇక తమ కలల రాకుమారుడు సచిన్‌కు పెళ్లి కుదిరిందని తెలిసి లక్షలమంది అమ్మాయిల హృదయం ముక్కలైంది. ఇప్పుడు తలుచుకుంటే చాలా ఆనందంగా ఉంది. కోట్లాదిమంది ఆరాధించే క్రికెటర్‌కు అత్తగా గర్వపడుతూ.. కూతురు ప్రేమను అంగీకరించిన తల్లిగా ఆనందిస్తున్నా.

p అనాబెల్ (84) బ్రిటన్‌కు చెందినవారు. సోషియాలజీ చదివారు. 1966లో ఆనంద్ మెహతాను పెళ్లాడాక ముంబైలో స్థిరపడ్డారు. అప్నాలయ పేరిట స్వచ్ఛంద సంస్థను నిర్వహిస్తున్నారు.

# మోదీ... పదకొండోస్సారి!

- 15న ఎర్రకోటపై జాతీయ జెండా ఎగురవేయనున్న ప్రధాని
- ఆ ఘనత సాధించిన తొలి కాంగ్రెసేతర ప్రధానిగా రికార్డు



న్యూఢిల్లీ, ఆగస్టు 11: దేశ రాజధానిలో ఎర్రకోటపై వరుసగా 11వ సారి జాతీయ జెండా ఎగురవేసిన తొలి కాంగ్రెసేతర ప్రధానిగా మోదీ రికార్డు సృష్టించనున్నారు. ఇంతకుముందు కాంగ్రెస్ నుంచి జవహర్‌లాల్ నెహ్రూకు మాత్రమే ఈ ఘనత సాధించారు. వచ్చే సంవత్సరం మళ్లీ జెండా ఎగురవేస్తానని గతేడాది ఆగస్టు 15న ప్రకటించిన మోదీ జోస్యం ఇప్పుడు నిజం కానుంది. అప్పట్లో ఆయన గత దశాబ్ద కాలంలో తాను సాధించిన విజయాలను ప్రస్తావిస్తూ, భవిష్యత్తుకు రోడ్‌మ్యాప్‌తో తిరిగి వస్తానని జాతికి హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో రాబోయే ఐదేళ్లకు ఆయన ఎలాంటి విజన్‌ను ప్రకటిస్తారోనని ఆసక్తి నెలకొంది. భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మార్చాలన్నది ఆయన దీర్ఘకాలిక లక్ష్యం అయినప్పటికీ, మారుతున్న రాజకీయ ముఖచిత్రం కొత్త సవాళ్లను తెరపైకి తెచ్చే అవకాశం ఉంది. అయితే 15న ఆయన ప్రసంగంలో సాధారణ ప్రజల కోసం, ముఖ్యంగా యువత, రైతుల కోసం ఎలాంటి పథకాలు ప్రకటిస్తారోనని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. వాస్తవానికి ఈ వేదికపై నుంచి ఆయన అటు మిత్రపక్షాలకు, ఇటు ప్రతిపక్షాలకు బలమైన సందేశాలు పంపుతారని భావిస్తున్నారు. ఎమర్జెన్సీ సమయంలో కాంగ్రెస్ తీరుపైనే మోదీ ఇప్పటివరకూ ప్రధానంగా విమర్శించారు. ఇప్పుడు ఎర్రకోట నుంచి రిజర్వేషన్ల అంశంపై కాంగ్రెస్, ప్రతిపక్షాలను ఉద్దేశించి ఆయన ప్రసంగించే అవకాశం ఉంది. ఎన్నికల సమయంలో రాజ్యాంగం, రిజర్వేషన్లపైప్రతిపక్షాలు ఓటర్లను తప్పుదోవ పట్టించడం బీజేపీపై ప్రతికూల ప్రభావం చూపించింది. అలాగే ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం ప్రకారమే రిజర్వేషన్లు కొనసాగుతాయని కేంద్రం ఇప్పటికే ప్రకటించిన నేపథ్యంలో ఈ అంశంపైనా మోదీ ఎలాంటి ఆశ్చర్యకర ప్రకటనలు చేస్తారనేది ఆసక్తికరంగా మారింది.

### స్వాతంత్ర్య వేడుకలకు పటిష్ఠ భద్రత

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు ఢిల్లీ అంతటా పోలీసులు పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. నగర వ్యాప్తంగా 700కు పైగా సీసీ కెమెరాలతో పాటు వీడియో విశ్లేషణలతో కూడిన మరో 150 కెమెరాలను సిద్ధం చేశారు. ఢిల్లీ పోలీసులు, పారా మిలటరీ బలగాలతో కూడిన 10వేల మందికి పైగా భద్రతా సిబ్బంది ఎర్రకోట, మధ్య, ఉత్తర ఢిల్లీలోని కీలక ప్రదేశాల్లో మోహరించనున్నారు. ఎర్రకోట చుట్టూ అధునాతన నిఘా, ఆటోమేటెడ్ క్రౌడ్ ఎస్టిమేషన్ సామర్థ్యాలతో ఏఐ ఆధారిత వ్యవస్థలను ఏర్పాటు చేయనున్నారు అల్‌ఖైదా, ఖలిస్థాన్‌తో సంబంధం ఉన్న పలువురు ఉగ్రవాదులతో కూడిన పోస్టర్లు నగరమంతా పంపిణీ చేసి ప్రజలను అప్రమత్తం చేశారు.

## ఐఎన్ఎస్ అరిఘూత్ రెడీ..!

- అణుశక్తితో నడిచే బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గామి
- మరో రెండు, మూడు నెలల్లో అందుబాటులోకి

న్యూఢిల్లీ, ఆగస్టు 11: హిందూ మహాసముద్ర ప్రాంతంలో చైనా తన నావికా కార్యకలాపాలను వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో భారత్ అణు శక్తితో నిడిచే తన రెండో బాలిస్టిక్ క్షిపణి జలాంతర్గామి ఐఎన్ఎస్ అరిఘాత్‌ను ప్రారంభించేందుకు సిద్ధమైంది. విశాఖపట్నంలోని షిప్ బిల్డింగ్ సెంటర్ (ఎస్‌బీసీ)లో నిర్మించిన ఈ 6000 టన్నుల సబ్‌మెరైన్ అనేక తుది పరీక్షల తర్వాత ప్రారంభానికి పూర్తిగా సిద్ధంగా ఉంది. ఇది ఐఎన్ఎస్ అరిహంత్‌కు అప్‌గ్రేడెడ్ వెర్షన్. రెండు అణు క్షిపణులతో కూడిన ఐఎన్ఎస్ అరిఘాత్.. ఒకటి లేదా రెండు నెలల్లో అందుబాటులోకి రానుందని, ఐఎన్ఎస్ అరిహంత్‌తో కలిసి పనిచేయనుందని అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఐఎన్ఎస్ అరిఘాత్‌లో ఐఎన్ఎస్ అరిహంత్ తరహాలోనే 750 కిలోమీటర్ల పరిధిలోని లక్ష్యాలను ఛేదించగల కే-15 క్షిపణలు ఉన్నాయి.

# అతి వేగానికి ఐదుగురు బలి

- తమిళనాట ఘోర రోడ్డు ప్రమాదం
- ఎదురుగా వస్తున్న లారీని ఢీకొన్న కారు
- మృతుల్లో నలుగురు ఏపీ విద్యార్థులు
- తీవ్ర గాయాలపాలైన మరో ఇద్దరు
- తమిళనాడు విద్యార్థి కూడా దుర్మరణం



గాయపడిన విద్యార్థి



సంఘటనా స్థలం వద్ద అంబులెన్సు.. సహాయక చర్యలు

చెన్నై (ఆంధ్రజ్యోతి), ఒంగోలు (క్రైం), ఆగస్టు 11: వాళ్లు ఏడుగురూ ఇంజనీరింగ్ విద్యార్థులు. శని, ఆదివారాలు సెలవు కావడంతో తిరువణ్ణామలై, కాణిపాకం ఆలయాల దర్శనానికి వెళ్లారు. కారులో తిరుగు ప్రయాణమై అతివేగంగా వస్తుండగా.. లారీ రూపంలో ఎదురుగా దూసుకొచ్చిన మృత్యువు ఐదుగురి ప్రాణాలను కబళించింది. మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. కారు తమిళనాడు రిజిస్ట్రేషన్‌ది కావడంతో మృతులు తమిళనాడు వాసులని తొలుత భావించారు. కారులో లభించిన గుర్తింపు కార్డు ఆధారంగా నలుగురు మృతులను ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు చెందిన వారిగా, మరొకరిని తమిళనాడు వాసిగా గుర్తించారు. తమిళనాడు తిరుత్తణికి సమీపంలోని చెన్నై-తిరుపతి జాతీయ రహదారిలో ఆదివారం రాత్రి ఏడు గంటలకు ఈ ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. కారులో ఉన్న వారు చెన్నై శివారులోని ప్రముఖ ఎస్ఆర్ఎం కళాశాలలో చదువుకుంటున్నారు. రెండు రోజులు సెలవు కావడంతో కారులో తిరువణ్ణామలై, కాణిపాకం ఆలయాల దర్శనానికి వెళ్లారు. అనంతరం తిరుగు ప్రయాణం కాగా.. ఆదివారం రాత్రి తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపం చెన్నై-తిరుపతి జాతీయ రహదారిలో రామంజేరి వద్ద చెన్నై వైపు అతివేగంగా వెళుతున్న కారు.. ఎదురుగా చెన్నై నుంచి రాజస్థాన్ వెళ్తున్న సరుకుల లారీని ఢీ కొట్టింది. ప్రమాద తీవ్రత అధికంగా ఉండడంతో కారు ముందు భాగం నుజ్జునుజ్జయి కొందరు కారులోనే చిక్కుకుపోయారు. ఇద్దరు గాయాలపాలై రోడ్డుమీద పడ్డారు. స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాద సమయంలో కారులో ఏడుగురు ఉండగా వారిలో ఐదుగురు అక్కడికక్కడే మృతిచెందారు. మరో ఇద్దరు గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న కనకమ్మసత్రం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని కారు శిథిలాల్లో చిక్కుకున్న మృతదేహాలను వెలికి తీసి పోస్టుమార్టం నిమిత్తం తిరువళ్లూరు ఆసుపత్రికి తరలించారు. గాయపడిన ఇద్దరిని 108 సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. తిరువళ్లూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. మృతిచెందిన వారిలో చేతన్ (21), యుగేష్ (21) తిరుపతికి చెందిన వారిగా గుర్తించారు. వీరిలో యుగేష్ ఓ కళాశాలలో చదివి ప్రస్తుతం డిస్‌కంటిన్యూ చేసినట్లు సమాచారం. మిగిలిన ముగ్గురిని నితీష్ (21), నితీష్‌వర్మ (21), రామగోపాలన్ (21)గా గుర్తించారు. వీరిలో రామగోపాలన్ తమిళనాడులోని తిరువణ్ణామలైకు చెందిన యువకుడు. తిరుపతి జిల్లా గూడూరు న్యూ బాలాజీ నగర్‌కు చెందిన విష్ణు, ప్రకాశం జిల్లా పొదిలికి చెందిన చైతన్య గాయపడిన వారిలో ఉన్నారు. ఈ ఇద్దరు ప్రస్తుతం తిరువళ్లూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. విద్యార్థులు ప్రయాణించిన కారు అద్దెకు తీసుకున్నట్టు పోలీసులు గుర్తించారు.

## తప్పుడు వార్తలు ప్రసారం చేసే సంస్థలకు తాళం

- మీడియాకు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వం హెచ్చరిక

ఢాకా, ఆగస్టు 11: బంగ్లాదేశ్‌లోని తాత్కాలిక ప్రభుత్వం తప్పుడు సమాచారం వ్యాప్తికి అడ్డుకట్ట వేసేందుకు చర్యలు చేపట్టింది. తప్పుడు, తప్పుదోవ పట్టించే వార్తలను ప్రచురించినా, ప్రసారం చేసినా కఠిన చర్యలు చేపడతామని హెచ్చరించింది. ఆందోళనల్లో గాయపడి రాజర్‌బాఘ్‌సెంట్రల్ పోలీసు ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న పోలీసులను తాత్కాలిక ప్రభుత్వ హోంశాఖవ్యవహారాల సలహాదారు బ్రిగేడియర్ జనరల్(రిటైర్డ్) ఎం.సఖావత్ హొస్సేన్ ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పుదోవ పట్టించే వార్తలను ప్రసారం చేసే మీడియా సంస్థలను మూసివేస్తామని హెచ్చరించినట్టు ఢాకా ట్రిబ్యూన్ పత్రిక పేర్కొంది. మీడియా సత్యాలను ప్రసారం చేయడం లేదని ఆయన విమర్శించారు. 'మీడియా సత్యాన్ని నిలబెట్టనప్పుడు దేశం బలహీనపడుతుంది. నిజాయతీగా రిపోర్ట్ చేయడంలో మీడియా విఫలమైనప్పుడు దేశం దిగజారిపోతుంది' అని వ్యాఖ్యానించారు. కాగా, ఇటీవల దేశవ్యాప్త ఆందోళనల సందర్భంగా ఇంటర్నెట్ నిలిపివేతకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకుంటామని టెలికమ్యూనికేషన్లు, ఐటీ శాఖల సలహాదారు నహీద్ ఇస్లాం హెచ్చరించారు. ఆదివారం బాధ్యతలు చేపట్టిన ఆయన మీడియాతో మాట్లాడారు. ఇంటర్నెట్ పొందడం ప్రజల హక్కు అని, ఇంటర్నెట్‌ను నిలిపివేయడం మానవ హక్కులను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. కాగా, షేక్ హసీనా ప్రభుత్వాన్ని కూల్చివేసినందుకు బంగ్లాదేశ్ ప్రజలను అభినందిస్తూ అల్ కాయిదా ఉగ్రవాద సంస్థ తాజాగా 12 పేజీల ప్రకటన విడుదల చేసింది.

# పంటల బీమాపై పిల్లిమొగ్గలు!

- వైసీపీ హయాంలో ప్రీమియం బకాయిలు
- గత టీడీపీ ప్రభుత్వంపై జగన్ అబద్ధాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఉచిత పంటల బీమా అమలు చేస్తామని డాంబికాలు పలికిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తన పాలనలో పంటల బీమాను అస్తవ్యస్తం చేశారు. పైగా 2014-19లో టీడీపీ ప్రభుత్వం పంటల బీమా ప్రీమియం చెల్లించలేదంటూ అబద్ధాలు చెప్తున్నారు. గత ఐదేళ్లూ పంటల బీమా పూర్తిస్థాయిలో అమలు చేయకుండా సగం మంది రైతుల్ని నిర్లక్ష్యం చేసిన జగన్ సర్కార్.. 'దరఖాస్తు అక్కర్లేదు.. పంట సాగు చేసి, ఈ-క్రాప్‌లో నమోదైతే చాలు.. నేరుగా రైతుల బ్యాంక్ ఖాతాలకే బీమా పరిహారం సొమ్ము' అని చెప్పింది. రైతుకు పైసా భారం లేకుండా ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందని ప్రకటించింది. కానీ 2019 ఖరీఫ్‌లో రైతుల నుంచి రూపాయి వసూలు చేసి, కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే పంటల బీమా అమలు చేసింది. 2020-22 మధ్య కేంద్ర ప్రయోజిత పథకం ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను పక్కన పెట్టింది. పైగా సొంతంగా బీమా కంపెనీ పెడతామని చెప్పి.. అభాసుపాలైంది. తీరా రైతుల పక్షాన సకాలంలో ప్రీమియం చెల్లించకపోవడంతో నాడు అసెంబ్లీలో ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబునాయుడు నిలదీశాక.. అర్ధరాత్రి జీవో జారీ చేసి, ప్రీమియం సొమ్మును విడుదల చేసింది. కేంద్ర పథకాన్ని వదిలేసి, రాష్ట్ర ప్రభుత్వ ఖజానా నిధులతో కొంత మంది రైతులకే బీమా పరిహారం అందించింది. అది కూడా ఖరీఫ్ పంటలకు మాత్రమే బీమా అమలు చేసింది. గత ప్రభుత్వం మామిడి రైతులకు బీమా అమలు చేయలేదు. ఈ-క్రాప్‌లో 35-40లక్షల మంది రైతులు నమోదైనా.. సగం మందిని బీమా కిందకు తీసుకురాకుండా, నిర్లక్ష్యం చేసింది. 2022 ఖరీఫ్ పంటల బీమా పరిహారాన్ని సార్వత్రిక ఎన్నికల ముందు విడుదల చేశారు. 2023 ఖరీఫ్ పంటల బీమా ఎన్నికల తర్వాత ఇస్తామని జగన్ చెప్పారు. కానీ రబీ పంటల బీమా ఊసెత్తలేదు. గత ఐదేళ్లలో రబీ పంటలకు బీమా అమలు చేయకుండా ఎగనామం పెట్టారు. కాగా 2022-23 రబీలో పీఎంఎఫ్‌బీవై కింద రూ.105.8 కోట్లు, 2023 ఖరీఫ్‌లో పీఎంఎఫ్‌బీవై కింద రూ.319.8 కోట్లు, ఆర్‌డబ్ల్యూబీసీఐఎస్ కింద రూ.959కోట్లు కలిపి మొత్తం రూ.1,384.6కోట్లు బీమా కంపెనీలకు గత ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని సమాచారం. దీంతో బీమా కంపెనీలు రైతులకు రూ.1,251కోట్లు నిలిపివేశాయి.

### వచ్చే ఏడాది నుంచి కొత్త పథకం

రైతులకు మేలు జరిగేలా వచ్చే ఏడాది నుంచి ఖరీఫ్ నుంచి కొత్త పంటల బీమా పథకాన్ని అమలు చేస్తామని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించారు. బ్యాంకులు ఇప్పటికే రుణాలిచ్చేసి



నందున ఈ ఖరీఫ్‌కు ప్రస్తుత పథకాన్నే అమలు చేస్తామని చెప్పారు. 2019-24 మధ్య ప్రభుత్వం ప్రీమియం చెల్లించక రైతులు నష్టపోయారన్నారు. వాస్తవానికి 2016-19 మధ్య అమలు చేసిన బీమా విధానమే ఉత్తమమైందని, కేంద్ర ప్రభుత్వం సూచించిన విధానాల్లో ఉత్తమ విధానాన్ని అమలు చేస్తామని చెప్పారు. రైతులు తమ వాటా ప్రీమియం చెల్లిస్తే, మిగిలిన సొమ్మును కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో విపత్తులకు నష్టపోయే ప్రతి రైతుకూ బీమా పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం బీమా వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసినందున, మెరుగైన బీమా అమలు కోసం కూటమి ప్రభుత్వం మంత్రులు, ఉన్నతాధికారులతో నియమించిన కమిటీలో చర్చించి, విపత్తు సమయాల్లో రైతులకు న్యాయం జరిగేలా బీమా అమలు చేస్తామన్నారు. దిగుబడి, వాతావరణ పరిస్థితులను బట్టి బీమా అమలుపై కమిటీ చర్చించింది. మావిడి రైతులకు కూడా బీమా అమలు చేయాలని కమిటీలో నిర్ణయించారు.

## హోరాహోరీగా తైక్వాండో చాంపియన్‌షిప్

**విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 11:** నగరంలోని ఆంధ్రా లయోలా కళాశాల ఇండోర్ స్టేడియంలో ఆదివారం ఉమ్మడి కృష్ణా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో హోరాహోరీగా సీనియర్ మెన్, ఉమెన్ చాంపియన్‌షిప్‌లు జరిగాయి. ఈ పోటీలను జిల్లా అసోసియేషన్ సెక్రటరీ ఎం.అంకమ్మరావు ప్రారంభించారు. ఈ పోటీల్లో స్వర్ణాలు సాధించిన క్రీడాకారులు ఈ నెల 17,18న విశాఖపట్నంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్టు వివరించారు. రిఫరీలుగా శాప్ కోచ్ పి.గౌరీశంకర్, ఎన్ఐఎస్ తైక్వాండో కోచ్ ఎం వెంకటసాయి వ్యవహరించారు. అనంతరం విజేతలకు బహుమతుల ప్రదానం జరిగింది.

**విజేతలు వీరే: ఉమెన్ ఫైటింగ్‌లో..** 46 కిలోల విభాగంలో కె.పూజిత, 49 కిలోల్లో ఎస్.సంజన, 53 కిలోల్లో జి.బ్లెస్సీనేజ్, 57 కిలోల విభాగంలో వి.ప్రియ, 73 కిలోల్లో టి.కావ్య, 73 ప్లస్‌లో ఎ.ధరణి స్వర్ణాలను సాధించారు. **మెన్స్ ఫైటింగ్ విభాగంలో** 54 కిలోల్లో ఎం. మోన, 58 కిలోల్లో బి దినేష్, 63 కిలోల్లో ఎం.అభిలాష్, 68 కిలోల్లో పి.దుర్గాప్రసాద్, 74 కిల్లో డి. మహేష్ స్వర్ణాలను సాధించారు. **పూమ్‌సే వ్యక్తిగత విభాగంలో** ఎస్‌కే చాన్‌బాషా (స్వర్ణం), ఎస్ సంజన (స్వర్ణం) సాధించారు. **పూమ్‌సే ఫెయిర్‌లో** ఎస్.చాన్‌బాషా, ఎస్ సంజన (స్వర్ణం), **పూమ్‌సే పురుషులు:** ఎస్‌కే చాన్‌బాషా (స్వర్ణం), ఎస్ రోహిత్ (స్వర్ణం), సీహెచ్ సంతోష్‌బాబు (స్వర్ణం) సాధించారు.



## ప్రజాప్రతినిధుల రాకతో కోలాహలంగా జంక్షన్

**హనుమాన్‌జంక్షన్, ఆగస్టు 11:** విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు గృహంలో ఆదివారం నిర్వహించిన వేడుకతో జంక్షన్ సెంటర్ రాజకీయ ప్రముఖుల రాకపోకలతో సందడి నెలకొంది. చలసాని ఆంజనేయులు తన మనవరాలు సాన్వీకి వోణీలిచ్చే వేడుక స్థానిక ఎస్ఆర్ కన్వెన్షన్‌లో జరిగింది. ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, మండలి బుద్ధ ప్రసాద్, చింతమనేని ప్రభాకర్, బొండా ఉమా, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న, టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురాం, మాజీ ఎమ్మెల్యేలు దేవినేని ఉమామహేశ్వరరావు, దాసరి వెంకట బాలవర్ధనరావు, రావి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు చిరంజీవి సాన్వీకి శుభాశీస్సులు అందజేసి చలసాని కుటుంబ సభ్యులను అభినందించారు. సాన్వీ వోణీల వేడుకకు జిల్లా నలుమూల నుంచి టీడీపీ, వైసీపీ, జనసేన, బీజేపీ, సీపీఎం నేతలు కృష్ణా మిల్క్ యూనియన్ పాలక వర్గ సభ్యులు, పెద్ద ఎత్తున హాజరయ్యారు.

## విలక్షణ ప్రచురణకర్త పెరుమాళ్లు

- శతజయంతి సభలో సాహితీవేత్తలు

**అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 11:** విశాలాంధ్ర, ప్రజాశక్తి తరువాత ఆ స్థాయిలో ఉత్తమ రచనలను, సాహిత్యాన్ని తెలుగు పాఠకులకు అతి తక్కువ ధరలో అందించిన విలక్షణ ప్రచురణకర్త పెరుమాళ్లు అని సాహితీవేత్త పన్నాల సుబ్రహ్మణ్య భట్టు అన్నారు. గవర్నర్‌పేటలోని విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ లైబ్రరీలో ఆదివారం జయంతి పబ్లికేషన్స్ వ్యవస్థాపకుడు మువ్వల పెరుమాళ్ల శతజయంతి సభ జరిగింది. ఈ సందర్భంగా పెరుమాళ్ల తనయుడు, రచయిత మువ్వల సుబ్బరామయ్య భారత స్వాతంత్ర్య సంగ్రామంపై రాసిన రక్తతర్పణం పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం పల్లవి పబ్లికేషన్స్ అధినేత వెంకటనారాయణ, విరసం అధ్యక్షుడు అరసవల్లి కృష్ణ, విశ్వేశ్వరరావు, లక్ష్మయ్య, మనోహర్‌నాయుడు, గోళ్ల నారాయణరావు, మువ్వల సుబ్బరామయ్య తదితరులు ప్రచురణా రంగానికి పెరుమాళ్లు చేసిన సేవలను కొనియాడారు.

## వయనాడ్ ఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలి

**వన్‌టౌన్, ఆగస్టు 11:** కేరళలోని వయనాడ్‌లో సంభవించిన సంఘటనను జాతీయ విపత్తుగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వానికి ఏఐఎస్ఎఫ్ ఏపీ రాష్ట్ర కోశాధికారి ఎం. సాయికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. ఇదే సమయంలో అన్ని విద్యార్థి సంఘాలు తమ చేతనైనంత మేరకు బాధితులకు ఇతోధిక సహాయం చేయాలని కోరారు. వయనాడ్‌లో ఏఐఎస్ఎఫ్ నేతలు రెండురోజుల పాటు పర్యటించారన్నారు. శిబిరంలో ఉన్నవారికి 5 బాక్సుల్లో సాధారణ జలుబు, జ్వరం, దగ్గు, నొప్పులు వంటి వాటికి పనికొచ్చే మందులు, మాస్కులు, హ్యాండ్ గ్లవుజ్‌లు, సిలైన్ బాటిల్స్ ఇంజెక్షన్లు అందచేసినట్టు చెప్పారు. బాధితులను ఆదుకునేందుకు విద్యార్థి, యువజన సంఘాలు కదలిరావాలన్నారు.

# రాష్ట్రాన్ని క్రీడల హబ్‌గా తీర్చిదిద్దుతాం

● బ్రదర్ హుడ్ బ్యాడ్మింటన్ లీగ్ ప్రారంభోత్సవంలో మంత్రి రామ్‌ప్రసాద్ ● స్వచ్ఛంద సంస్థకు రూ.లక్ష విరాళం

**విజయవాడ స్పోర్ట్సు, ఆగస్టు 11:** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో రాష్ట్రాన్ని క్రీడల హబ్‌గా తీర్చిదిద్దుతామని మంత్రి మండిపల్లి రామ్ ప్రసాద్‌రెడ్డి హామీ ఇచ్చారు. బందరు రోడ్డులోని దండమూడి రాజగోపాలరావు స్టేడియంలో ఏర్పాటు చేసిన బ్రదర్ హుడ్ బ్యాడ్మింటన్ లీగ్‌ను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌తో కలిసి ఆదివారం మంత్రి ప్రారంభించారు. కొద్దిసేపు కోర్టులో బ్యాడ్మింటన్ ఆడి మంత్రి అలరించారు. ప్రభుత్వ సహకారం లేకుండా స్వచ్ఛంద సంస్థ ముందుకొచ్చి ఇలాంటి క్రీడలను నిర్వహించడం అభినందనీయమన్నారు. సీఎం సారథ్యంలో గ్రామ, పట్టణ స్థాయి వరకు క్రీడల ప్రోత్సహానికి మౌలిక సదుపాయాలను కల్పిస్తామన్నారు. రాష్ట్రంలో క్రికెట్ జట్టు ఏర్పాటుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మంత్రి తన జీతంలో రూ.



బ్యాడ్మింటన్ ఆడుతున్న మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి, ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

లక్షను ఈ సంస్థకు ఆర్థిక సహాయంగా అందించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ బ్రదర్ హుడ్ సంస్థ ముస్లిం విద్యార్థులను విద్యాధికులుగా తీర్చిదిద్దేందుకు మంచి సంస్థ ఏర్పాటు చేయడం ముదావహమన్నారు.

### రోడ్డు భద్రతా పోస్టర్ల ఆవిష్కరణ

**వన్‌టౌన్:** రోడ్డు ప్రమాదాలు అత్యంత విషాదకరమని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అన్నారు. నగరంలోని క్యాంపు కార్యాలయంలో ఆదివారం రోడ్డు సేఫ్టీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రోడ్డు భద్రతా పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు అత్యంత విషాదకరమైన సంఘటనలని వాటిని నివారించేందుకు ప్రజల్లో విస్తృతస్థాయిలో ప్రచారం జరగాలన్నారు. ఇందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడపరాదని, హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని, జాతీయ రహదారుల్లో లైన్ క్రమశిక్షణ పాటించాలని కోరారు. రోడ్డు సేఫ్టీ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర అధ్యక్షురాలు ఆర్‌కే దుర్గాప్రద్మజ, సభ్యులు వెంకటేశ్వరరావు, బంగారయ్య పాల్గొన్నారు.

# దుర్గమ్మ సన్నిధిలో సూర్యోపాసన సేవ

**వన్‌టౌన్, ఆగస్టు 11:** సప్తమి తిథిని పురస్కరించుకుని ఆదివారం దుర్గగుడిలో అర్చక బృందం సూర్యోపాసన సేవ నిర్వహించింది. వేద పండితులు, అర్చకులు సూర్యనారాయణ మూర్తికి ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ సంకల్పం చెప్పి అరుణ పారాయణ నిర్వహించారు. మరోవైపు సూర్యుడికి ప్రీతికరంగా సూర్యనమస్కారాలు నిర్వహించారు.

### స్వర్ణతాపడానికి విరాళం

దుర్గగుడి ఆలయ గోపుర స్వర్ణ తాపడం నిమిత్తం గుంటూరు జిల్లా, ఆచార్య నాగార్జున వర్సిటీ ప్రాంతానికి చెందిన కరణం అనంతలక్ష్మి, కుటుంబ సభ్యులు రూ.1,00,011 ఏఈవో రమేష్ ద్వారా దేవస్థానానికి విరాళంగా ఇచ్చారు. దుర్గమ్మ దర్శనానంతరం వారికి శేషవస్త్రం, ప్రసాదం, ఆశీస్సులు, చిత్రపటం ఇచ్చారు.

### ధర్మపథం వేదికపై నృత్య ప్రదర్శన

ధర్మపథం వేదికపై ఆదివారం నగరానికి చెందిన పి.శ్రావ్య గ్రీష్మ, శ్రీశావ్య బృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. శ్రీశ్రావ్య నర్తన, కూచిపూడి నృత్యాలయం ఆధ్వర్యంలో జరిగిన నృత్యప్రదర్శనలో పది కీర్తనలకు చక్కని హావ, భావ ప్రదర్శనలతో నృత్యం చేసి ఆహుతులను అలరించారు.

### సెల్‌ఫోన్ చెకింగ్

ఈనెల 7న అమ్మవారి అంతరాలయ దృశ్యాల వీడియో బయటకు వచ్చిన సందర్భంగా ఆలయంలో





సూర్యోపాసన పూజలు చేస్తున్న అర్చకుడు, ధర్మపథం వేదికపై నృత్య ప్రదర్శన



ఎంట్రన్స్ వద్ద సెల్‌ఫోన్ చెకింగ్ చేస్తున్న సిబ్బంది

భద్రతా లోపంపై ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనం మేరకు అధికారులు స్పందించారు. ఆదివారం భక్తులు ఆలయంలోకి సెల్‌ఫోన్‌లు తీసుకురాకుండా నిరోధించే యత్నంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ప్రతి భక్తుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్లను కౌంటర్‌లో డిపాజిట్ చేయించారు. ఇకపై ఏ భక్తుడూ ఆలయంలోకి సెల్‌ఫోన్లు తీసుకురాకుండా కట్టుదిట్టంగా చర్యలు తీసుకుంటామన్నారు. గేట్ల వద్ద విధులు నిర్వహించే సెక్యూరిటీ కూడా ప్రతి భక్తుడి వద్ద ఉన్న సెల్‌ఫోన్లను కౌంటర్‌లో డిపాజిట్ చేయించాల్సిందిగా ఆదేశించారు.

# నడిచే నిఘంటువు తుర్లపాటి: ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

**విజయవాడ కల్చరల్, ఆగస్టు 11:** పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు నడిచే నిఘంటువుగా కీర్తిగడించారని, ద్విసహస్ర సభా కేసరిగా గిన్నిస్ ఎక్కారని, పాత్రికేయుడిగా ఎన్నో శీర్షికలు నిర్భయంగా రాశారని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. తెలుగు కళావాహిని, శ్రీ కళాభారతి, కృష్ణ కళాభారతి, పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సమితి సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానంద కళావేదికలో పద్మశ్రీ తుర్లపాటి కుటుంబరావు జయంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన ము



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

ఖ్య అతిథిగా మాట్లాడుతూ నెహ్రూ, ఇందిరాగాంధీలాంటి వారు ప్రధానమంత్రులుగా ఉన్నప్పుడు వారికి స్వయంగా లెటర్లు రాసి సూచనలు చేసేవారన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ తుర్లపాటి గన్నవరం అల్లుడుగా నాకు బాగా పరిచయముందని, బాల్యంలో వారి పిల్లలతో కలిసి ఆడుకునేవాళ్లమని నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకొన్నారు. పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు సభకు అధ్యక్షత వహించారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ జి.సమరం, తెలుగు పండితుడు డాక్టర్ గుమ్మా సాంబశివరావు, కొప్పరపు బలరాం దంపతులు, చింతకాయల చిట్టిబాబు, శింగంశెట్టి చంద్రశేఖర్, మారుతి ప్రసన్న పాల్గొన్నారు. అనంతరం నిర్వహించిన సినీ సంగీతం అలరించింది.


## దుర్గగుడి ఈవో రామారావుకు తిరుపతి హథీరాంజీ మఠం బాధ్యతలు

**వన్‌టౌన్:** తిరుపతి హథీరాంజీ మఠం అదనపు ఈవోగా దుర్గగుడి ఈవో రామారావును నియమిస్తూ దేవదాయ శాఖ కమిషనర్ సత్యనారాయణ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం అక్కడ విధులు నిర్వహించిన ఈవో రమేష్ నాయుడిని ప్రభుత్వం తన మాతృసంస్థ రెవెన్యూ విభాగానికి బదిలీ చేసింది. దీంతో దుర్గగుడి ఈవో కేఎస్ రామారావుకు హథీరాంజీ మఠానికి బాధ్యతలు అప్పగించారు. ఆదివారం రామారావు తిరుపతి వెళ్లి మఠం బాధ్యతలు స్వీకరించారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల స్వీకరణ

**కృష్ణలంక:** జిల్లా కలెక్టరేట్‌లోని పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) ద్వారా ప్రజల నుంచి సోమవారం వినతులు స్వీకరించడం జరుగుతుందని కలెక్టర్ డాక్టర్ జి. సృజన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం ద్వారా చేపట్టనున్నట్టు తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మున్సిపల్, మండల కేంద్రాల్లో అధికారులు ఉదయం 10నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లోనూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విద్యార్థినికి హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్థికసాయం



**పాయకాపురం:** ఇంటర్ విద్యార్థినికి హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు వెంకట్ ఆదివారం ఆర్థికసాయం చేశారు. ఇంటర్ ఫస్టియర్‌లో 460 మార్కులు సాధించిన విద్యార్థిని హర్షిత తండ్రి కాలం చేశాడు. తల్లి టైలరింగ్ చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగా లేకపోవడంతో విద్యార్థిని ఇంటర్ సెకెండియర్ ఫీజు కోసం హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థను ఆశ్రయించారు. దీనిపై స్పందించిన వెంకట్ మొగల్రాజపురంలోని సంస్థ కార్యాలయంలో రూ.40వేలు ఆర్థిక సహాయాన్ని ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు వెంకట్ మాట్లాడుతూ ఈ ఏడాది సంస్థ నుంచి ప్రాజెక్ట్ విద్యాదాన్ పేరుతో 301 మంది విద్యార్థిని, విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేయడం జరిగిందన్నారు.

## నారా లోకేశ్ పేరుతో మోసం.. పోలీసు కేసు నమోదు

**పటమట:** టీడీపీ సామాజిక మాధ్యమం వాట్సాప్ గ్రూపులో ఒక గుర్తు తెలియని వ్యక్తి వాట్సాప్‌లో మంత్రి నారా లోకేష్ పేరును వాడుకుని ఆన్‌లైన్‌లో డబ్బులడుగుతున్నారని యువజన చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బెజవాడ నజీర్ పటమట సీఐ పవన్‌కిషోర్‌కు ఆదివారం లిఖిత పూర్వక ఫిర్యాదు చేశారు. వాట్సాప్‌లో ఆ వ్యక్తి తాను నారా లోకేష్ డైరెక్టర్ ఆఫ్ టెక్నికల్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌గా పరిచయం చేసుకుని ఆన్‌లైన్‌లో డబ్బులు అడుగుతూ మోసం చేస్తున్నాడని ఫిర్యాదులో తెలిపారు. సదరు గ్రూపులో వచ్చిన మెసేజ్ ప్రకారం ఆ వ్యక్తి 7246664662 అనే ఫోన్ నెంబర్ వాట్సాప్ క్రియేట్ చేసుకుని నాకు అత్యవసరంగా డబ్బులు కావాలి రూ.50వేలు పంపించు నేను తిరిగి 20 నిమిషాల్లో పంపిస్తానని మెసేజ్ పంపుతూ ఒక క్యూఆర్ కోడ్ కూడా షేర్ చేస్తున్నాడన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే యూపీఐడీ శివ 97735823 ఎట్‌ది రేట్ ఆఫ్ బరోడా ఎంపోపే అని వస్తుందని, నారా లోకేష్ పేరు వాడుకుని ప్రజల నుంచి డబ్బులు వసూలు చేస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలన్నారు. నజీర్‌తో పాటు శిరీష్, లీలాప్రసాద్ పాల్గొన్నారు.



వెంకయ్య జీవిత విశేషాల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అతిథులు

## రాజకీయాల్లో కువిమర్శలు తగదు

▸▸ కుటుంబ సభ్యులను విమర్శించినందుకే గత ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పారు

▸▸ 75 ఏళ్ల ఆత్మీయ సంగమంలో వెంకయ్య



పెనమలూరు (కృష్ణాజిల్లా), ఆగస్టు 11 : గత ప్రభుత్వంలో ప్రతిపక్ష నాయకుల కుటుంబ సభ్యులను విమర్శించారని, అందుకే ప్రజలు వారికి ఓట్ల రూపంలో బుద్ధి చెప్పారని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు అన్నారు. వెంకయ్యనాయుడుకు 75సంవత్సరాలు నిండిన సందర్భంగా పోరంకి మురళీ రిసార్ట్‌లో ఆదివారం ఆత్మీయ సంగమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడుతూ రాజకీయాల్లో కుటుంబ సభ్యులను విమర్శించే కుసంస్కృతి ఉండకూడదన్నారు. ప్రస్తుత విద్యావిధానంలో మార్పులు అత్యంత అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రతి ఒక్కరూ మాతృభాషపై మమకారంతో ముందుకెళ్లాలని, మాతృభాష కంటిచూపు వంటిదని, పరాయి భాష రేబాన్ కళ్లజోడులాంటిదని అభివర్ణించారు. తాను రాజకీయాల్లో మొదటిసారి పోటీ చేసినప్పుడు ఒక్క రూపాయి కూడా ఖర్చు చేయలేదని, ప్రజలే ఎదురు డబ్బు ఇచ్చిన పరిస్థితి ఉండేదని గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వం నుంచి కానీ, నాయకుల వద్ద కానీ ఒక్క రూపాయి ఆశించకుండా తన మిత్రుల సహకారంతో స్వర్ణభారత్ ట్రస్టు నడుస్తోందని వెంకయ్య తెలిపారు. కార్యక్రమంలో ప్రధాని మోదీ ఆవిష్కరించిన పుస్తకాలను అతిథులకు అందించారు. అనంతరం ఉమ్మడి కృష్ణాజిల్లా ప్రజాప్రతినిధులు ఆయన్ను ఘనంగా సత్కరించారు.

## మాణిక్కం ఠాగూర్‌తో షర్మిల భేటీ

▸▸ కాంగ్రెస్ కమిటీల నియామకంపై చర్చ

▸▸ నేడు, రేపు ఢిల్లీలోనే ఏపీ చీఫ్ మకాం



న్యూఢిల్లీ, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాలని అధిష్ఠానం భావిస్తోంది. ఈ నేపథ్యంలోనే ఏపీలో అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికలకు ముందు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుమార్తె వైఎస్ షర్మిలకు బాధ్యతలు అప్పగించింది. అయినప్పటికీ ఎన్నికల్లో ఎటువంటి ప్రభావం కనిపించలేదు. ఆ తర్వాత రాష్ట్రంలో పార్టీకి సంబంధించిన అన్ని విభాగాలను పార్టీ రద్దు చేసింది. పార్టీ సంస్థాగత నిర్మాణంలో భాగంగానే కమిటీల రద్దు నిర్ణయం తీసుకున్నామని, త్వరలో కొత్త కమిటీల నియామకం ఉంటుందని అప్పట్లో పార్టీ ప్రకటించింది. ప్రస్తుతం కొత్త కమిటీల నియామకంపై అధిష్ఠానం దృష్టి పెట్టింది. ఈ క్రమంలో ఏపీలో కాంగ్రెస్ వ్యవహారాలు, కొత్త కమిటీల ఏర్పాటుపై చర్చించేందుకు రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల మూడురోజుల ఢిల్లీ పర్యటనకు వచ్చారు. ఆదివారం మధ్యాహ్నం ఢిల్లీకి చేరుకున్న షర్మిల సాయంత్రం ఏపీ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్‌తో భేటీ అయ్యారు. సుమారు 45 నిమిషాల పాటు చర్చించారు. ఏపీలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి, కొత్త కమిటీల నియామకం తదితర అంశాలపై చర్చించినట్లు తెలిసింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, రాష్ట్రస్థాయిలో కీలక పదవులకు సంబంధించిన ఠాగూర్‌కు షర్మిల అందించినట్టు సమాచారం. అన్నీ పరిశీలించి కొత్త కమిటీలను ప్రకటించాలని ఆమె కోరినట్టు తెలిసింది. షర్మిల ఢిల్లీ పర్యటనలో భాగంగా సోమ, మంగళవారాల్లో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేతో సమావేశం కానున్నారు. ఏపీలో కూటమి ప్రభుత్వ పాలన, రాష్ట్రంలో సమస్యలు, కొత్త కమిటీల ఏర్పాటు తదితర అంశాలపై వారితో చర్చించనున్నట్టు ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

# సూపర్ డ్రామాలు

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు, వేధింపులకు గురయిన నేతలకు వీరి డ్రామాలు తేలికగానే అర్థమవుతున్నాయి. కానీ టీడీపీ అగ్రనేతలు మాత్రం వారి ఫేక్ ప్రచారాలను నమ్మి కోరుకున్న చోట పోస్టింగ్‌లు ఇస్తూ, వారికి ప్రభుత్వంలో ప్రాధాన్యం కల్పిస్తున్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో చంద్రబాబు అరెస్ట్ కోసం జరిగిన కుట్రలో తెరవెనక పాత్రధారిగా పనిచేసిన అధికారులను సైతం జగన్ బాధితుల కోటా కింద పరిగణించి అక్కున చేర్చుకోవడం విస్మయం కలిగిస్తోంది.

### భజన బృందాలకే ప్రాధాన్యం

ప్రభుత్వ అధికారులు రాజకీయ పార్టీలతో అంటకాగడం వైఎస్. రాజశేఖరరెడ్డి హయాంలోనే మొదలైంది. ఆయన మరణం తర్వాత రాష్ట్రాన్ని ఏలిన పార్టీలు ఈ సంస్కృతిని ప్రోత్సహించలేదు. కానీ 2019లో జగన్ అధికారంలోకి వచ్చాక మరోసారి గ్రూపుల విధానాన్ని తెరమీదకు తీసుకొచ్చారు. ప్రభుత్వంలో కీలకమైన స్థానాల్లో తన సామాజిక వర్గానికి చెందిన వారినే తెచ్చిపెట్టుకున్నారు. దేశంలో వారు ఏ సర్వీసులో ఉన్నా, అనుభవం లేకపోయినా తీసుకొచ్చి కీలక పదవులు కట్టబెట్టారు. గనుల వెంకటరెడ్డి, వాసుదేవరెడ్డి దీనికి ప్రత్యక్ష ఉదాహరణ. అఖిల భారత సర్వీసు అధికారుల్లో ప్రత్యేకించి టీడీపీ ప్రభుత్వంలో అత్యంత కీలక స్థానాల్లో పనిచేసిన వారిని జగన్ చేరదీశారు. రాష్ట్ర విభజనకు ముందు, ఆ తర్వాత చంద్రబాబు టీమ్‌లో పనిచేసిన వారిని దగ్గరకు తీసుకొని తన మనుషులుగా మార్చుకున్నారు. వారు కోరుకున్న పోస్టులు ఇచ్చారు. కొందరిని ఏకంగా ఐదారు పోస్టులకు ఇన్‌చార్జీలుగా నియమించారు. విభాగాధిపతిగా, ఆ శాఖ కార్యదర్శిగా ఒక్కరికే అవకాశం ఇచ్చిన ఉదంతాలు అనేకం ఉన్నాయి. జగన్‌తో మంచిగా ఉంటే చాలు... ఆయన కోరుకున్న సమాచారం ఉన్నదీ, లేనిదీ కల్పించి ఇస్తే చాలు... ఏ పోస్టు అయినా దక్కించుకోవచ్చన్న ధీమా కొందరిలో పెరిగిపోయింది. ఫలితంగా ఎవరూ ఊహించని పోస్టులు దక్కించుకున్నారు. జగన్ శిబిరంలో తొలి నుంచి ఉన్నవారికి కూడా దక్కని అవకాశాలు వీరికి లభించాయి. గ్రూప్-1, గ్రూప్-2 కేడర్ అధికారులు కూడా తమపై అధికారులు ఎంచుకున్న భజన కార్యక్రమాన్నే ఎంచుకున్నారు. జగన్, ఆయన సన్నిహితుల మనసెరిగి ప్రవర్తించారు. అడ్డగోలుగా నిర్ణయాలు తీసుకొని స్వామిభక్తిని చాటుకున్నారు. కీలకమైన పాలనా వ్యవహారాలను గాడితప్పేలా చేశారు. ఇందుకు రెవెన్యూ, గనులు, ఎక్సైజ్, పరిశ్రమలు, పురపాలక, వైద్య, ఆరోగ్య, పోలీసు శాఖల్లోని కొందరు అధికారుల నిర్వాకాలే నిదర్శనాలు. జగన్, వైసీపీ నేతల మెప్పుకోసం ప్రతిపక్ష నేతలంటేనే ఒంటికాలి మీద లేచిన పోలీసు అధికారులున్నారు. వైసీపీ కోసం ఆ పార్టీ కార్యకర్తల కంటే ఎక్కువగానే కొందరు పనిచేశారు. టీడీపీ, జనసేన నేతలే టార్గెట్‌గా అక్రమ కేసులు పెట్టారు. అవసరం లేకున్నా ప్రతిపక్ష నేతలను పదేపదే గృహనిర్బంధానికి గురిచేయడం, నోటీసు ఇవ్వకుండానే బలవంతంగా స్టేషన్‌కు తీసుకెళ్లడం, భూమి రికార్డులను మార్చేయడం, వ్యాపార లైసెన్సులు రద్దుచేయడం వంటి దుర్మార్గాలకు పాల్పడ్డారు. వాణిజ్యపన్నుల శాఖలో ఓ అధికారి వైసీపీ నేత మెప్పు కోసం ప్రతిపక్షాల వ్యాపారాలను తనిఖీలు చేస్తూ, కేసులు, అరెస్ట్‌ల పేరిట వేధించారు. గనుల శాఖలో ఇలాంటి ఉదంతాలు కోకొల్లలు.



### మాట వినకుంటే వేధింపులు

జగన్ పాలనలో అఖిల భారత సర్వీసు అధికారి స్థాయి నుంచి గ్రామస్థాయి ఉద్యోగి వరకు వేధింపులకు గురైన అధికారులు కూడా ఉన్నారు. వారికి పోస్టింగ్‌లు ఇవ్వకుండా వెయిటింగ్ లో ఉంచడం, ఏమాత్రం ప్రాధాన్యం లేని పోస్టులు ఇవ్వడం వంటి వేధింపులకు గురిచేశారు. జగన్ ప్రభుత్వంలో ఉద్యోగ సంఘాల నేతలకు గవర్నర్ అపాయింట్‌మెంట్ ఇచ్చారనే కారణంతో అప్పటి కార్యదర్శి ఆర్.పి. సిసోడియాను ప్రభుత్వం బదిలీ చేసింది. పోస్టింగ్ ఇవ్వలేదు. ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి హోదాలో ఉన్న ఆయనకు కనీసం వాహనం కూడా ఇవ్వలేదు. సీసీఎల్ఏగా ఉన్న నీరబ్‌కుమార్ ప్రసాద్‌ను కారణాలు లేకుండా పదేపదే బదిలీలు చేసి అటవీశాఖకు పరిమితం చేశారు. సర్వేలో ఝాన్సీ అనే అధికారిణి తీవ్ర వేధింపులకు గురయ్యారు. రీసర్వేలో తప్పులున్నాయని, టెండర్లు, ప్రొక్యూర్‌మెంట్‌లో లోపాలున్నాయని చెప్పినందుకు ఆమెను సర్వే బాధ్యతల నుంచి తప్పించారు. సర్వే, సరిహద్దుల చట్టానికి విరుద్ధంగా నిర్ణయాలు తీసుకోవద్దని, దానివల్ల రైతులకు సమస్యలు వస్తాయని చెప్పినందుకు ఆమెను సర్వే శాఖ నుంచి బయటకు పంపించారు. చివరకు రీసర్వేనే తప్పుల తడక అని నిరూపితమైంది. అలాగే వాణిజ్య పన్నుల శాఖలో రమామణి అనే ఐఏఎస్ అధికారి పనిచేశారు. ఆ శాఖ అధికారి కోరినట్లుగా వాహనాలు, బిల్లులు సమకూర్చిపెట్టడం సాధ్యం కాదన్నందుకు నాటి సీఎం పేషీలోని ప్రవీణ్ ప్రకాశ్‌కు చెప్పి ఆమెను బదిలీ చేయించారు. ఆ తర్వాత వారం రోజులకే ఆమె తీవ్ర అనారోగ్యంతో గుంటూరు ఆసుపత్రిలో కన్నుమూశారు. ఇలా ఎందరో అధికారులు వేధింపులకు గురయ్యారు. అయితే వీరెవరూ తాము జగన్ బాధితులమని చెప్పుకోవడం లేదు. బహిరంగ ప్రచారం చేసుకోవడం లేదు.

## గోడ మీద పిల్లి వాటం...

జగన్ ప్రభుత్వంలో అడ్డగోలు పోస్టింగ్‌లు, ప్రజావ్యతిరేక నిర్ణయాలతో చెలరేగిన అధికారులు కూటమి పాలనలోనూ ప్రాధాన్యతలు కోరుకుంటున్నారు. దీని కోసం తామూ వైసీపీ బాధితులమనే సాకు చూపిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో వేధింపులకు గురైన అధికారులకు తగిన ప్రాధాన్యం ఇస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు పలు వేదికల్లో భరోసా ఇచ్చారు. దీన్ని అడ్డంపెట్టుకొని కూటమి సర్కారులోనూ ప్రాధాన్య పోస్టులు పొందాలని గోడమీది పిల్లి వాటం ప్రదర్శించే అలవాటున్న అధికారులు కొందరు గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. ఇలా వైసీపీ బాధితులమని చెప్పుకొని ముగ్గురు ఐఏఎస్, ఐదుగురు ఐపీఎస్ అధికారులు చంద్రబాబుకు దగ్గరయ్యారు. అంతే వారికి కీలక పోస్టులు దక్కాయి. ఇందులో ఓ అధికారిని పోస్టు నుంచి తప్పించినట్లే తప్పించి మరో కీలక పోస్టు ఇచ్చారు. దీనిపైనే ఐఏఎస్‌లు గుర్రుగా ఉన్నారు. జగన్ పాలనలో ఆయన సొంత మనుషుల కంటే ఎక్కువగా లబ్ధిపొంది, ఎక్కువ పోస్టులు తీసుకొని ఇప్పుడు కూటమి సర్కారు రాగానే ప్లేటు ఫిరాయించారని ఆరోపిస్తున్నారు. గతప్రభుత్వంలో జగన్, విజయసాయిరెడ్డికి అత్యంత విశ్వసనీయంగా పనిచేసిన ఓ అధికారికి ఎన్టీఆర్ జిల్లాలో కీలక పోస్టు కట్టబెట్టారు. ఇక ఐపీఎస్‌ల పోస్టింగ్‌ల్లో జగన్ మనుషులకే ఎక్కువ ప్రాధాన్యం లభించిందన్న ఫిర్యాదులున్నాయి. చంద్రబాబుపై కేసులు పెట్టినవారిని, టీడీపీ నేతలను వేధించిన అధికారులకు కీలక పోస్టింగ్‌లు ఇచ్చారని బాధిత వర్గాలు వాపోతున్నాయి. జగన్ ప్రభుత్వంలో తాము బాధితులమని నమ్మించేందుకు, ఆ తర్వాత కీలక పోస్టులు దక్కించుకునేందుకు కొందరు మధ్యశ్రేణి అధికారులు కొత్త ఎత్తుగడ వేశారు. ఎప్పుడో జగన్ ప్రభుత్వంలో ఉండగా, వైసీపీ నేతలు తమపై టీడీపీ పార్టీ ముద్రవేసి, ఆ పార్టీ కోసం పనిచేస్తున్నారన్న అభియోగాలు మోపుతూ చర్యలు తీసుకోవాలని కోరినట్లుగా పాత తేదీలతో ఫేక్ లేఖలు సృష్టిస్తున్నారు. వాటిని తమకు పరిచయం ఉన్న టీడీపీ నేతలకు చూపించి ఆ తర్వాత అవి చంద్రబాబు, లోకేశ్, ఇతర ముఖ్యనేతలకు చేరేలా ప్లాన్ వేస్తున్నారు. తద్వారా తమకు కావాల్సిన పోస్టులు దక్కేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అనంతపురం జిల్లాకు చెందిన ఓ పోలీసు అధికారి కూటమి ప్రభుత్వంలోనూ కీలక పోస్టు దక్కించుకున్నారు. రెవెన్యూ శాఖలో కొందరు డిప్యూటీ కలెక్టర్లు తాము వైసీపీ బాధితులమని చెప్పుకుంటూ టీడీపీ నేతల సిఫారసు లేఖలు తీసుకొస్తున్నారు. అయితే ప్రజాసేవే పరమావధిగా పనిచేసే వారికే ప్రాధాన్యం ఇవ్వాలని, అంతే తప్ప ఇలాంటి అధికారులను నమ్మకూడదని సీనియర్ అధికారులు చెబుతున్నారు. పనితీరు, నిజాయితీనే మెరిట్‌గా తీసుకోవాలని సూచిస్తున్నారు.



దేవదాయ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపడుతున్న ఆనం రామనారాయణరెడ్డి

## దేవుని ఆస్తులకు రక్షకుడిగా ఉంటా!

▸▸ నదీ హారతులను కొనసాగిస్తాం: మంత్రి ఆనం

అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): దేవుడి ఆస్తులకు రక్షకుడిగా, భక్తులకు భగవంతుడి ఆశీస్సులు అందించడం బాధ్యతగా, ప్రథమ కర్తవ్యంగా పని చేస్తానని దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చెప్పారు. దేవుని ఆస్తుల అన్యాక్రాంతంపై చిన్న వార్త వచ్చినా.. నివేదికలు తీసుకుని, తప్పు చేసినవారు ఎంతటి వారైనా వదలమని స్పష్టం చేశారు. ఆదివారం అమరావతి సచివాలయంలోని తన చాంబర్‌లో ప్రత్యేక పూజలు జరిపి, వేదపండితుల మంత్రోచ్చరణ మధ్య సీటులో ఆసీనులయ్యారు. ఈ సందర్భంగా ఆలయాల ధూప దీప నైవేద్యాలకు ఇచ్చే రూ.5వేలను రూ.10వేలకు పెంచుతూ ఫైలుపై మంత్రి సంతకం చేశారు. కామన్ గుడ్ ఫండ్‌తో జీర్ణమైన ఆలయాల పునర్నిర్మాణం చేసే ఫైల్‌పైనా సంతకం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. 'గత ప్రభుత్వంలో తిరుమల నుంచి అరసవిల్లి వరకు దేవుడి ఆస్తుల్ని కూడా అక్రమార్కులు వదల్లేదు. రెవెన్యూశాఖ నిర్వహించే సదస్సుల్లోనూ దేవాలయ భూములపై ఏవైనా ఫిర్యాదులొస్తే.. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. నెల్లూరు జిల్లాలో రెండు ఆలయాల విషయంలో విచారణ జరిపి, ఐదుగురు ఉద్యోగుల్ని సస్పెండ్ చేశాం. ఈవోలు, చిన్న ఉద్యోగులే కాదు.. తప్పు చేస్తే ఎంతటి వారినైనా వదిలిపెట్టం. మంత్రుల కమిటీలో చర్చించి, కృష్ణా, గోదావరి జల హారతులను కొనసాగిస్తాం. ఏజెన్సీ ప్రాంతంలోని 13 ఆలయాలతో సహా, రాష్ట్రంలోని 160 ఆలయాలను రూ.113కోట్ల సీజీఎఫ్ నిధులతో పునర్నిర్మాణం చేయాలని నిర్ణయించాం. తిరుమల తిరుపతి ఆలయాల గ్రూపులోకడప జిల్లా ఒంటిమిట్ట శ్రీరాముడి ఆలయాన్ని కూడా అభివృద్ధి చేస్తాం. రాష్ట్రంలో 1,234 ఆలయాలకు ట్రస్ట్‌బోర్డులు ఉండగా, కొందరు రాజీనామాతో కొన్ని ఖాళీలు ఏర్పడ్డాయి. ప్రస్తుతం ట్రస్ట్‌బోర్డులు వేయాల్సినవి 462ఉన్నాయి. ప్రభుత్వ నిర్ణయం మేరకు త్వరితగతిన నియామకాలకు చర్యలు తీసుకుంటాం' అని మంత్రి ఆనం వివరించారు.

### దుర్గమ్మ మూలవిరాట్టు వీడియో తీసిన వారిపై చర్యలు

బెజవాడ దుర్గామల్లేశ్వర దేవస్థానంలో ఈ నెల 7న ఓ వ్యక్తి తన సెల్‌ఫోన్ ద్వారా అంతరాలయ దృశ్యాలను వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన ఉదంతంపై చర్యలు చేపట్టినట్లు మంత్రి రామనారాయణరెడ్డి చెప్పారు. అర్చకులు తప్ప మరెవరూ మూలవిరాట్‌ను తాకకూడదని, వీడియో, ఫొటోలు తీయకూడదని చెప్పారు. మూలవిరాట్‌ను వీడియో తీసి ఓ వ్యక్తి సోషల్ మీడియాలో పెట్టారని, దీనికి సంబంధించిన సీసీ టీవీ ఫుటేజీని పోలీస్ కమిషనర్‌కు అందించామని తెలిపారు. విచారణ నివేదిక రాగానే చర్యలు చేపడతామని తెలిపారు. కాగా, ఈ ఘటనపై ఇప్పటికే దుర్గగుడి ఈవో కేఎస్ రామారావు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## నీ పాలనలోనే రైతులకు చీకటి రోజులు

▸▸ నువ్వు పెట్టిన బకాయిల్ని మేం తీరుస్తున్నాం

▸▸ జగన్ వ్యాఖ్యలపై మంత్రి అచ్చెన్న ఫైర్



అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడు పరదాలు అడ్డుకట్టుకుని, పోలీసు బలగాల మధ్య తిరిగిన జగన్ ఒక్కసారైనా రైతుల మధ్యకు వెళ్లి ఉంటే.. కచ్చితంగా ఆయనకు దేహశుద్ధి చేసి ఉండేవారని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు. ఆదివారం 'ఎక్స్'లో వైఎస్ జగన్ చేసిన వ్యాఖ్యలపై అదే వేదికగా మంత్రి స్పందించారు. 'నీ పాలనలో రైతులందరికీ పంటల బీమా, రాయితీపై విత్తనాలు, సూక్ష్మపోషకాలు, ఎరువులు, బిందు సేద్య పరికరాలు, వ్యవసాయ యంత్ర పరికరాలు, ఉద్యాన పంటలకు ప్రోత్సాహకాలు అందించావా? కేవలం ఖరీఫ్‌లోనే మాత్రమే పంటల బీమా ఇచ్చి, రబీ సీజన్‌కు ఒక్క రూపాయి చెల్లించకుండా రైతుల్ని నట్టేట ముంచిన నీచ చరిత్ర నీది. రాష్ట్ర చరిత్రలో లేని విధంగా నీ పరిపాలన కాలమంతా రైతులకు చీకటి రోజులే. సిద్ధం సభల ఫ్లెక్సీలపై చూపించిన శ్రద్ధ అయినా.. రైతుల పట్ల చూపించావా? రైతులకు పథకాలు నిలిపివేసి, నీ దిష్టి బొమ్మ వేసిన పాసుపుస్తకాలు, సమాధి రాళ్ల లాంటి సర్వే రాళ్లు వేశావు. నీ హయాంలో పెట్టిన బీమా బకాయిలు, బిందు సేద్య బకాయిలు ఇప్పుడు కూటమి ప్రభుత్వం చెల్లించింది. వ్యవసాయ అనుబంధ రంగాల్లో రూ.2,384కోట్ల బకాయిలు పెట్టావు. వ్యవసాయానికి తోడ్పాటు అందించే బిందు సేద్యం అమలు చేయకుండా, కంపెనీలకు రూ.1,167కోట్లు, ధాన్యం రైతులకు రూ.1,600 కోట్లు బకాయి పెట్టి, అన్నదాతల్ని ఇబ్బంది పెట్టావు. అదే అన్నదాతలకు ఆపన్నహస్తం అందిస్తూ.. విత్తనం నుంచి మార్కెట్ వరకు ప్రతి సమస్యకూ పరిష్కారం చూపే చంద్రబాబు నాయకత్వంలోని ప్రభుత్వం మాది. కౌలురైతులకు, మత్స్యకారులను నిర్లక్ష్యం చేసి, పనికిమాలిన చట్టాలు తెచ్చావు. 2014-19మధ్య చంద్రబాబు రూ.లక్ష లోపు సున్నా వడ్డీ రుణాలు, రూ.3లక్షల వరకు పావలా వడ్డీ రుణాలిస్తే.. పావలా వడ్డీకి మంగళం పాడి, రూ.లక్ష రుణానికి వడ్డీతో సహా వసూలు చేసి, ఎప్పుడో రీయింబర్స్‌మెంట్ చేశావు. అసెంబ్లీ సమావేశాలకు వస్తే, నీ చేతకాని తనం స్పష్టంగా నీకే తెలుస్తుంది' అని మంత్రి విమర్శించారు.

## రాజ్యాంగానికి జగన్ అవమానం

▸▸ అంబేడ్కర్ పేరెత్తే అర్హత కూడా జగన్‌కు లేదు: బుద్దా వెంకన్న



విజయవాడ (వన్‌టౌన్), ఆగస్టు 11: అంబేడ్కర్ రాజ్యాంగాన్ని మాజీ సీఎం జగన్ అనేక రకాలుగా అవమానించాడని, అంబేడ్కర్ పేరెత్తే అర్హత కూడా ఆయనకు లేదని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న మండిపడ్డారు. ఆదివారం ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో కేవలం 11 సీట్లకే పరిమితం కావడంతో కేవలం 2 నెలల వ్యవధిలోనే జగన్‌కు మతి భ్రమించిందని, ఏం చేస్తున్నాడో తెలియటం లేదని ఎద్దేవా చేశారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని కాదని రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేసిన జగన్‌రెడ్డి.. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహం పెట్టి ఆయన పేరు కంటే తన పేరును పెద్దగా పెట్టించాడని, దీంతో అంబేడ్కర్ అభిమానులు ఆయన పేరును తొలగించి ఉండవచ్చని అభిప్రాయపడ్డారు. అయితే, వైసీపీ నాయకులు ఏదో జరిగిపోయినట్లుగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారన్నారు.

## రెండేళ్లలో భోగాపురం ఎయిర్ పోర్టు పూర్తి

▸▸ పౌర విమానయాన మంత్రి రామ్మోహన్ నాయుడు

భోగాపురం, ఆగస్టు 11: విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మిస్తున్న అంతర్జాతీయ ఎయిర్ పోర్టుతో ఉత్తరాంధ్ర రూపురేఖలు మారుతాయని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. 2026 జూన్ నాటికి ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణం పూర్తవుతుందన్నారు. మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యే లోకం మాధవితో కలిసి ఆయన ఎయిర్‌పోర్టు నిర్మాణ పనులను ఆదివారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో కూటమికి అఖండ మెజార్టీ ఇచ్చిన ప్రజల విశ్వాసం నిలబెట్టుకునే బాధ్యత తమపై ఉందని, ఇందుకు అనుగుణంగానే ఎయిర్‌పోర్టు నిర్మాణం వేగవంతంగా పూర్తి చేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ సూచనలు, సలహాలతో ప్రతి నెలా పనులపై సమీక్షిస్తామన్నారు. దేశంలో విమానయాన రంగం ఏటా 16శాతం వృద్ధి చెందుతోందన్నారు. దేశ వ్యాప్తంగా విమానాశ్రయాలు ఏర్పాటు చేయాలన్న డిమాండు పెరుగుతోందని వెల్లడించారు. మూలపేట, దగదర్తి, నాగార్జునసాగర్, కుప్పంలో విమానాశ్రయాల ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నట్లు తెలిపారు. అనంతపురం, ఒంగోలులో కూడా విమానాశ్రయాల ఏర్పాటుకు అక్కడ ప్రజలు డిమాండు చేస్తున్నారని తెలిపారు. ముంబై సమీపంలో నవీ ముంబై, నొయిడా సమీపంలో జీవన్ ఎయిర్‌పోర్టులను ఏప్రిల్ నాటికి పూర్తి చేసేందుకు కృషి చేస్తామని మంత్రి తెలిపారు.



భోగాపురం విమానాశ్రయం పనులను పరిశీలిస్తున్న కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రులు గుమ్మడి సుధారాణి, కొండపల్లి శ్రీనివాస్

# ఆర్టీఏలో దుష్ట చతుష్టయం

▸▸ అవినీతికి మాస్టర్ ప్లాన్ సిద్ధం

▸▸ కేంద్రం చెక్ పోస్టులు తీసేయించినా..

చెక్‌పాయింట్ల పేరుతో ఆ నలుగురి స్కెచ్

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

అవినీతిని అరికడతాం, రాష్ట్ర సంపదను కాపాడతాం, ప్రభుత్వ ఖజానాకు నష్టం రానివ్వం అని రవాణా మంత్రి చెబుతుంటే.. దానికి విరుద్ధంగా ఆ శాఖలోని నలుగురు కీలక అధికారులు చక్రం తిప్పుతున్నారు. చంద్రబాబు ప్రభుత్వ సంస్కరణలు, కేంద్రంలోని మోదీ ప్రభుత్వ నిర్ణయాలు వీరి చేతివాటానికి గండి కొట్టాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఎడాపెడా దోచుకున్న ఈ అవినీతి అధికారులకు డబులింజన్ సర్కార్‌లో షాక్ తగిలింది. అయినా, ఎత్తుగడలతో మంత్రి ద్వారానే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి డీపీడీకి తెరతీయబోతున్నారు. రవాణా శాఖలో చర్చనీయాంశమైన ఈ తతంగం వెనుక రాయలసీమ రెడ్డి ఒకరు స్టీరింగ్ తిప్పుతుంటే, సచివాలయంలో రవాణా శాఖను చూసే కీలక అధికారి మార్గం చూపిస్తున్నారు. పలు అవినీతి కేసుల్లో ఉన్న గోదావరి జిల్లా అధికారి అవినీతి బండి ఆగకుండా తీసుకెళ్లే బాధ్యత నాది అంటుంటే జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థలా పనిచేసి మంత్రిని మేనేజ్ చేసే బాధ్యత నాది అంటూ జలవనరులశాఖ నుంచి రవాణాపేషీలో చేరిన యువ ఉద్యోగి ధీమాగా చెబుతున్నారు. దీంతో మంత్రిని భ్రష్టు పట్టించేందుకు ఈ నలుగురు చాలంటూ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. కోటిన్నర వాహనాల కండిషన్ చూస్తూ, ప్రజలకు 83 రకాల సేవలు అందిస్తూ, ప్రభుత్వానికి 4.5వేల కోట్ల ఆదాయాన్ని తెచ్చిపెడుతోంది రవాణా శాఖ. అలాంటి శాఖలో అవినీతి కూడా ఎక్కువే. గత వైసీపీ ప్రభుత్వంలో చెక్‌పోస్టుల్లో పోస్టింగ్ కోసం 20-25లక్షల ముడుపులు ఇచ్చిన చరిత్ర రాష్ట్రంలోని ఎంవీఐల సొంతం. దీనికితోడు అక్రమ మైనింగ్, ఇసుక లారీల నుంచి నెలవారీ మామూళ్లు, రవాణా వాహనాలను రోడ్డుపై ఆపి తనిఖీల పేరుతో చేసే వసూళ్లు, ఇలా రశీదు రాసి ప్రభుత్వ ఖజానాకు చేర్చే దానికన్నా ప్రైవేటు సహాయకుడితో వసూలు చేయించి ఇంటికి తీసుకెళ్లే అవినీతి సొమ్మే ఎక్కువ. కేంద్రం గతేడాది దేశవ్యాప్తంగా టోల్ గేట్ల వద్ద ఫాస్టాగ్‌లు తెచ్చి.. రాష్ట్రాల సరిహద్దు చెక్‌పోస్టులను రద్దు చేసింది. జీఎస్టీ వసూలు చేస్తున్నప్పుడు ఇవెందుకు? తీసేయండంటూ రాష్ట్రాలకు లేఖలు రాసింది. దక్షిణాదిలో అన్ని రాష్ట్రాలు పాటించినా జగన్ ప్రభుత్వం నాన్చుడు ధోరణి అవలంబించింది. అయితే, ఎన్నికల కోడ్ అమల్లోకి రాగానే కేంద్రం ఒత్తిడితో రవాణా శాఖ కమిషనర్ మనీష్ కుమార్ సిన్హా తొలగింపు ఆదేశాలిచ్చారు. దీంతో షాక్‌కు గురైన కొందరు అధికారులు రాయలసీమలో పెద్దిరెడ్డి ప్రోద్బలంతో మొత్తం రవాణా శాఖనే నడిపించిన ఒక రెడ్డిద్వారా రంగంలోకి దిగారు. చిత్తూరు డీటీసీగా పదోన్నతి పొంది, రాష్ట్ర ప్రధాన కార్యాలయంలో జేటీసీగా పనిచేసేందుకు రానంటూ సీమలోనే కొత్తగా రీజనల్ జేటీసీ పోస్టు సృష్టించుకున్న ఆ రెడ్డిగారు ఎలాగైనా మంత్రిని బుట్టలో వేయిస్తానంటూ నడుం బిగించారు. ఆయనకు తోడుగా సచివాలయంలో రవాణాశాఖను చూసే మరో రెడ్డి జతకూడారు. 'నేను నేరుగా భారతి(మాజీ సీఎం భార్య)తోనే మాట్లాడతా' అంటూ గత ఐదేళ్ల చక్రం తిప్పిన ఆయన ఇప్పుడు కొత్త ఎత్తుగడ వేశారు. తనకు బాగా నమ్మకస్తుడైన యువ ఉద్యోగి(జలవనరుల శాఖ)ని రవాణా మంత్రి పేషీలోకి పంపి ప్రతి అడుగు తెలుసుకొనే పనిలో పడ్డారు. ఆ ఉద్యోగి ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తూ ఏమి చేయాలో సచివాలయంలోని రెడ్డి గారిని అడుగుతూ వసూళ్ల పర్వానికి తెరలేపారు. మంత్రి కోసం ఎవరు వచ్చి ఏది అడిగినా.. పైసల గురించే మాట్లాడుతున్నాడంటూ ఎంవీఐలు నిట్టూరుస్తున్నారు. మంత్రి ఎక్కడికి వెళితే అక్కడి ఆర్టీఏ అధికారులకు ఫోన్లు చేసి వచ్చి కలవండి అంటున్నాడట. 'ఏంటి ఉత్తి చేతులతో వచ్చారా? సరే మంత్రి గారు హోటల్ ఖాళీ చేస్తున్నారు.. బిల్లు చూడండి' అంటూ నేరుగా అడిగేస్తున్నారని రవాణా శాఖ కోడై కూస్తోంది.

### చెక్ పోస్టుల కోసం ఒత్తిళ్లు..

ఆర్టీఏ చెక్‌పోస్టులంటేనే అవినీతికి ఏటీఎంలు. అలాంటి చెక్ పోస్టులు సరిహద్దుల్లో మూతపడటంతో ఆదాయం లేక బ్రేక్ ఇన్‌స్పెక్టర్ నుంచి డీటీసీ వరకూ విలవిల్లాడుతున్నారు. వాటిని తిరిగి తెరిపించేందుకు రాయలసీమలో పెద్దిరెడ్డికి కుడి భుజంలా పేరొందిన ఒక రెడ్డిగారికి ఉభయ గోదావరి జిల్లాల్లో మాజీ అమాత్యుడికి రెండు నెలల క్రితం వరకూ ప్రతినెలా ముడుపులు అప్పగించిన అధికారి తోడయ్యారు. గత ప్రభుత్వంలో పెద్దిరెడ్డి ద్వారా పదోన్నతి తెప్పించుకుని కొత్త అధ్యాయానికి తెరతీసిన ఆ అధికారి ఇప్పుడు ఎలాగైనా కొత్త మంత్రిని ఆ రొచ్చులోకి దించేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. గోదావరి జిల్లాల్లో ఏసీబీ కేసులో అరెస్టు, సస్పెండై, వైసీపీ ప్రభుత్వంలో రవాణా మంత్రిని సంతృప్తి పరిచి, తిరిగి అదే చోట పోస్టింగ్ తెచ్చుకున్న అధికారి కూడా ఇటువైపు నుంచి ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు సమాచారం. చెక్ పోస్టులు తిరిగి ప్రారంభిస్తే ప్రతి నెలా రాయలసీమ నుంచి పాతిక, కోస్తా నుంచి పాతిక, ఉత్తరాంధ్ర నుంచి పదిహేను లక్షలు ముట్టజెబుతామంటూ ప్రతిపాదించినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

### ప్రతినెలా లక్షల్లో మామూళ్లు అంటూ ఎర..

రాష్ట్రాల సరిహద్దుల్లో చెక్ పోస్టులు తీసేయడం జాతీయ స్థాయి నిర్ణయం. పొరుగు రాష్ట్రాల్లోని కాంగ్రెస్, డీఎంకే, కమ్యూనిస్టు పార్టీల ప్రభుత్వాలూ దీన్ని అమలు చేస్తున్నాయి. ఇక రాష్ట్రంలోని డబులింజన్ సర్కారు ఎలా పునరుద్ధరిస్తుందనే ప్రశ్న వినిపిస్తోంది. అయితే రాష్ట్రానికి ఆదాయం తగ్గుతోందంటూ ప్రభుత్వాన్ని ఒప్పించి మళ్లీ చెక్‌పోస్టులు పునరుద్ధరిస్తే ప్రతి నెలా లక్షల్లో మామూళ్లు వస్తాయంటూ రాయలసీమ రెడ్డి, సచివాలయంలో రెడ్డి, గోదావరి జిల్లాల్లో అవినీతి కేసుల్లో ఉన్న అధికారి మంత్రి వద్ద ఉన్న వారికి నూరి పోశారు. ఈ నెల 9న రవాణా మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి సమీక్షలోనూ ఈ ప్రస్తావన రావడంతో సీఎం దృష్టికి 12న తీసుకెళ్లి తుదినిర్ణయం తీసుకుందామని బదులిచ్చారు. చెక్ పాయింట్లు పెట్టించేందుకు కొత్తగా మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డిని ఒప్పించేందుకు ఆ నలుగురు మాస్టర్ ప్లాన్ వేశారు. రాష్ట్ర సంపద మొత్తం తరలిపోతోందంటూ ముఖ్యమంత్రికి చెబితే చెక్ పోస్టులు పెట్టేందుకు అంగీకరిస్తారని సూచించినట్లు తెలిసింది. కేంద్ర నిర్ణయానికి భిన్నంగా వద్దని చెబితేగనుక ఎన్‌ఫోర్స్‌మెంట్ బలోపేతం చేస్తామంటూ అనుమతి తీసుకోవాల్సిందిగా మంత్రికి నూరి పోశారు. చంద్రబాబు ఎన్‌ఫోర్స్‌మెంట్ బలోపేతానికి అంగీకరిస్తే చెక్ పాయింట్ల పేరుతో రాష్ట్ర సరిహద్దుల్లో వసూళ్లకు తెరలేపుతారు. అయితే, గతేడాది చెక్ పోస్టులు ఉన్నప్పుడు మొదటి త్రైమాసికంతో పోల్చితే ఈ ఏడాది వాటిని తొలగించాక రాష్ట్ర ఆదాయం ఏ మాత్రం తగ్గలేదని రవాణా శాఖ వసూళ్లు స్పష్టం చేస్తున్నాయి.

## హోం మంత్రి అనిత కారుకు ప్రమాదం



స్వల్ప మరమ్మతు అనంతరం సిద్ధం చేసిన కారు

ఉంగుటూరు, ఆగస్టు 11: ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం కైకరం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం జరిగిన హోం మంత్రి వంగలపూడి అనిత ప్రయాణిస్తున్న కారు స్వల్ప ప్రమాదానికి గురైంది. మంత్రి అనిత విజయవాడ నుంచి తాడేపల్లిగూడెం వెళుతుండగా ఎస్కార్ట్ వాహనం డ్రైవర్.. ముందు వెళుతున్న మోటారు సైకిల్‌ను తప్పించే క్రమంలో సడెన్ బ్రేక్ వేశాడు. వెనుక ఉన్న మంత్రి వాహనం (బుల్లెట్ ప్రూఫ్ కారు) ముందు భాగం ఎస్కార్ట్ వాహనాన్ని తాకడంతో బానెట్ స్వల్పంగా దెబ్బతింది. దీంతో మంత్రి మరో కారులో నారాయణపురంలో జరిగిన ఒక ఫంక్షన్‌కు వెళ్లగా భద్రతా సిబ్బంది సంఘటనాస్థలిలోనే కారును స్వల్ప మరమ్మతుతో సిద్ధం చేశారు. మంత్రి అనిత మీడియాతో మాట్లాడుతూ భగవంతుని దయ, ప్రజల ఆశీర్వాదాలతో తనకు తనకు ఎలాంటి ప్రమాదమూ జరగలేదన్నారు. ఫోన్ చేసి యోగక్షేమాలు అడిగిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

## పని ఇక్కడ.. అధికారులు అక్కడ!

▸▸ రవాణా శాఖలో నలుగురు జేటీసీల తీరు

▸▸ ప్రధాన కార్యాలయానికి రాకుండా జిల్లాల్లోనే మకాం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ప్రయాణికులు ఉన్న ప్రాంతానికి వాహనం వెళ్లాలి. పని ఉన్న చోటుకు ప్రభుత్వ అధికారి వెళ్లాలి. కానీ రవాణా శాఖలో అంతా మా ఇష్టం అంటున్నారు కొందరు అధికారులు. ప్రధాన కార్యాలయంలో జేటీసీలకు కావాల్సినంత పని ఉంటే, అదంతా మాకెందుకంటూ జిల్లాల్లోనే తిష్ట వేసుకు కూర్చుంటున్నారు. 'జిల్లాల్లో మీకేం పని? ఇక్కడికి రండి' అంటూ ఆదేశాలిచ్చిన రవాణా శాఖ కమిషనర్‌పై గత వైసీపీ ప్రభుత్వంలో మంత్రి పెద్దిరెడ్డితో ఒత్తిడి తెప్పించి తిరిగి జిల్లాలకు వెళ్లిపోయారు. దీంతో ఇటు పని జరగక, అటు అదనపు భారంతో రవాణా శాఖ ఇబ్బంది పడుతోంది. రవాణా శాఖలో ప్రభుత్వ పరంగా ముఖ్య కార్యదర్శి ఉంటే, ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌తో పాటు ఒక అదనపు కమిషనర్, ముగ్గురు జేటీసీలు, జిల్లాకొక డీటీసీ, ఆ తర్వాత ఆర్టీవోలు, ఎంవీఐలు ఉంటారు.. కాగా, డీటీసీలుగా సీనియర్లం గనుక తమకు జేటీసీలుగా పదోన్నతి కావాల్సిందే అంటూ నలుగురు అధికారులు వైసీపీ ప్రభుత్వంలో అప్పటి చిత్తూరు జేటీసీ ద్వారా ప్రయత్నాలు చేశారు. రాయలసీమలో మాజీ మంత్రి పెద్దిరెడ్డికి కుడిభుజంగా పేరున్న ఆ అధికారి చక్రం తిప్పడం ద్వారా ఎట్టకేలకు నలుగురికీ పదోన్నతి సాధించారు. వీరు విజయవాడలోని రవాణాశాఖ ప్రధాన కార్యాలయంలో ఉంటూ పని చేయాలి. ఈ జేటీసీలు గతంలో ఎన్నడూ లేని విధంగా కొన్ని జిల్లాలను రీజియన్లుగా చేసి అక్కడే ఉండేలా ఎత్తుగడ వేశారు. తిరుపతి, గుంటూరు, విజయవాడ, విశాఖపట్నం కేంద్రంగా జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కార్యాలయాలు ఏర్పాటు చేయించి అక్కడ తెల్ల ఏనుగుల్లా కూర్చునేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. అయితే, 'పని ఇక్కడ ఉంటే.. అక్కడ మీరేం చేస్తారు? అనవసరంగా కార్యాలయం ఏర్పాటుకు అదనపు ఖర్చులు ఎందుకు?' అంటూ ఆ నలుగురినీ కమిషనర్ ప్రధాన కార్యాలయానికి రప్పించారు. అయినా.. అప్పటి మంత్రి పెద్దిరెడ్డి ద్వారా నాటి ప్రభుత్వ పెద్దలకు దగ్గరగా ఉన్న ఐఏఎస్ అధికారి(ప్రస్తుతం సీఎంవో)ని ప్రసన్నం చేసుకుని కమిషనర్ నిర్ణయాన్ని రద్దు చేయించారు. అంతే పెద్దిరెడ్డికి దగ్గర్లో ఉండేలా రాయలసీమ జేటీసీ బసిరెడ్డి తిరుపతిలో, కృష్ణవేణి గుంటూరులో, శివరామ్ ప్రసాద్ విజయవాడలో, సుందర్ విశాఖలో సెటిలయ్యారు. దీంతో ప్రధాన కార్యాలయంలో పనిభారమంతా ముగ్గురు జేటీసీ(రమాశ్రీ, వెంకటేశ్వరరావు, శ్రీదేవి)పై పడింది. పని ఒత్తిడి తట్టుకోలేక శ్రీదేవి ఇటీవలే దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారు. దీంతో ఆమె చూసిన ఐటీ విభాగం గందరగోళంగా తయారైంది. మిగతా పనుల భారమంతా రమాశ్రీ, వెంకటేశ్వర రావులపై పడింది. అదనపు కమిషనర్ ప్రసాద రావు ఈ నెలాఖరున పదవీ విరమణ చేయనున్నారు. ఆయన స్థానంలో రమాశ్రీకి పదోన్నతి లభించే అవకాశం ఉండటంతో ప్రధాన కార్యాలయంలో జేటీసీ వెంకటేశ్వర రావు ఒక్కరే మిగులుతారు. ఈ సమస్యను సోమవారం సీఎంతో సమీక్ష సందర్భంగా చర్చించి, జిల్లాల్లో పని లేకుండా ఉన్న నలుగురినీ ప్రధాన కార్యాలయానికి రప్పిస్తే ఇక్కడ పని ఆగదనే అభిప్రాయం రవాణా శాఖ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# 65 టీఎంసీలు కడలిపాలు


తుంగభద్ర డ్యాం 19 గేట్ కొట్టుకుపోవడంతో వృథాగా పోతున్న నీరు

(మొదటి పేజీ తరువాయి)

గేటు వద్ద ప్రవాహ ఉధృతి పెరిగి ప్రాజెక్టుకు మరింత ముప్పు వాటిల్లకుండా ఉండేందుకు గేట్లన్నీ ఎత్తి దిగువకు నీరు విడుదల చేస్తున్నారు. ఈసారి జూలైలోనే జలాశయాలన్నీ నిండిపోవడంతో రైతులంతా ఆనందంగా ఉన్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో సాగుకు, తాగునీటికి ఇబ్బంది లేదని అందరూ సంతోషించారు. ఆ ఆనందం అంతలోనే ఆవిరైపోయింది. తుంగభద్ర గేటు కొట్టుకుపోవడంతో ప్రాజెక్టు అధికారులు అప్రమత్తమైనా వరద ఉధృతి కారణంగా మరమ్మతులు చేయలేని పరిస్థితి. శాశ్వత మరమ్మతులు చేసేందుకు స్పిల్ లెవల్ వరకు డ్యాంను ఖాళీ చేయాలని నిశ్చయించారు. 65 టీఎంసీలు దిగువకు వదిలేస్తున్నారు. ఇప్పటికే శ్రీశైలం, సాగర్, పులిచింతల, ప్రకాశం బ్యారేజీ నిండిపోవడంతో.. తుంగభద్ర నుంచి వచ్చే నీరంతా సముద్రంలోకి వదిలిపెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. విషయం తెలిసిన సీఎం చంద్రబాబు కర్నూలు జిల్లా కలెక్టరు పి.రంజిత్‌బాషాను అప్రమత్తం చేశారు. నదితీర గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. అటు కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, అనంతపురం జిల్లా రాయదుర్గం ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, కర్నూలు జిల్లా ఆలూరు ఎమ్మెల్యే బి.విరుపాక్షి డ్యాంను సందర్శించి కొట్టుకుపోయిన గేటును పరిశీలించారు. మరమ్మతులకు సూచనలు చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన డ్యాం గేట్ల నిపుణుడు కన్నయ్యనాయుడు, కర్ణాటక నీరావరి నిగమ్ లిమిటెడ్ ప్రాజెక్టు నిపుణుడు రాజేశ్ సహా హైదరాబాద్, బెంగళూరుకు చెందిన ప్రాజెక్టు నిపుణులు అక్కడకు చేరుకున్నారు. డ్యాం ఖాళీ చేయకుండా గేటు మరమ్మతు చేయడంపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది. కర్ణాటక, ఏపీలో ఇప్పటికే ఆయకట్టు రైతులు వరి నాట్లు వేశారు. ఖరీఫ్ పంటకు సాగునీరు ఇబ్బంది లేకుండా చూసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. టీబీ డ్యాంకు వెళ్లి అక్కడి పరిస్థితులపై నివేదిక ఇవ్వాలని బాబు ఆదేశించడంతో ఏపీ నుంచి సీఈ శివకుమార్‌రెడ్డి, అనంతపురం సీఈ నాగరాజు వెళ్లారు. మంగళవారం డ్యాంను పరిశీలిస్తానని కర్ణాటక సీఎం తెలిపారు.


## సాగర్ క్రస్ట్ గేట్లు భద్రమేనా?

నాగార్జునసాగర్, ఆగస్టు 11: రెండు తెలుగు రాష్ట్రాల అన్నపూర్ణగా పేరొందిన నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ క్రస్ట్ గేట్లు భద్రమేనా? అని నీటిపారుదల శాఖ విశ్రాంత నిపుణులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. తుంగభద్ర ప్రాజెక్టు క్రస్ట్ గేటు వరద ఉధృతికి కొట్టుకుపోయింది. ఈ నేపథ్యంలో సాగర్ క్రస్ట్‌గేట్ల నిర్వహణపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2022, ఆగస్టు 11న వరద వచ్చి గేట్లు ఎత్తే సమయంలో ఒకటో నెంబరు గేటు 5అడుగులు ఎత్తేసరికి ఆగిపోయింది. గేటును పూర్తిగా (45 అడుగులు) ఎత్తడానికి ఇంజనీర్లు తంటాలు పడాల్సి వచ్చింది. అదే ఏడాది ఆగస్టు 15న 26వ నెంబర్ క్రస్ట్ గేటును ఎత్తే క్రమంలో మోటారు ఫ్యాన్ విరిగి అజ్మతుల్లా అనే ఉద్యోగికి గాయాలయ్యాయి. 2022 అక్టోబరులో సాగర్ కుడి కాల్వ 9వ నెంబరు గేటు కొట్టుకుపోయి 6నెలలు నీరంతా వృథాగా కిందికి పోయింది. ప్రాజెక్టు నిర్వహణను గాలికి వదిలేయకుండా సమర్థంగా చేపట్టాలని పలువురు నీటిపారుదల శాఖ విశ్రాంత ఇంజనీర్లు, నిపుణులు సూచిస్తున్నారు.

### మూడ్రోజులు పట్టే చాన్సు!

కర్ణాటకలో కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర డ్యాంకు వరద కొనసాగుతూనే ఉంది. 245 టీఎంసీల వరద చేరగా.. గేట్లెత్తి దాదాపు 135 టీఎంసీలు శ్రీశైలం జలాశయానికి వదిలారు. డ్యాం గేటు తెగే సమయంలో 104.182 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఇన్‌ఫ్లో 36,739 క్యూసెక్కులు వస్తుండగా.. 54,960 క్యూసెక్కులు నదికి వదులుతున్నారు. 33 గేట్లను అడుగు మేర ఎత్తి నదికి నీరు వదులుతున్న సమయంలో శనివారం రాత్రి 9వ క్రస్ట్‌గేటును మరో అడుగు ఎత్తేందుకు అధికారులు ప్రయత్నించగా.. దానికి ఉండే ఒక చైన్ లింక్ తెగిపోయింది. ఇదే సమయంలో వరద ఉధృతికి మరో చైన్ లింక్ కూడా తెగిపోయింది. గేటు కనిపించకుండా నీటిలో కొట్టుకుపోయింది. వెంటనే అధికారులు అప్రమత్తమయ్యారు. మిగిలిన 32 గేట్లను 2 నుంచి 3 అడుగుల మేర ఎత్తి 1.10 లక్షల క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. కొట్టుకుపోయిన గేటుకు శాశ్వత మరమ్మతులు చేయాలంటే స్పిల్ లెవల్ వరకు ఖాళీ చేయాల్సి ఉంటుంది. అంటే 65 టీఎంసీల వరకు దిగువకు వదిలేయక తప్పని పరిస్థితి. దీంతో ఇన్‌ఫ్లోతోపాటు డ్యామ్‌లోని నీరు అంతా నదికి వదులుతున్నారు. 65 టీఎంసీల నీరు కిందకు వెళ్లడానికి కనీసం మూడ్రోజులు పడుతుందని బోర్డు వర్గాలు తెలిపాయి. స్టాప్‌లాక్ ఏర్పాటు లేకపోవడమే తాజా పరిస్థితికి ప్రధాన కారణం. వీటి ఏర్పాటు సర్వే కోసం 2020లో నాటి ఎస్‌ఈ వెంకటరమణ ఇచ్చిన నివేదికను బుట్టదాఖలు చేశారు.

### తక్షణమే రంగంలోకి బాబు



తుంగభద్ర డ్యాం 19వ గేటు కొట్టుకుపోయిందని.. జలాశయాన్ని ఖాళీచేయాల్సిన దుస్థితి నెలకొందని తెలిసిన వెంటనే.. ముఖ్యమంత్రి చంద్రబాబు రంగంలోకి దిగారు. ఆదివారం ఉదయమే జల వనరుల మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జి.సాయిప్రసాద్, ప్రభుత్వ సలహాదారు ఎం.వెంకటేశ్వరావు, జలాశయాల గేట్ల యాజమాన్య నిర్వహణలో ప్రపంచ స్థాయి నైపుణ్యం కలిగిన కన్నయ్యనాయుడు తదితరులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కన్నయ్యనాయుడిని స్టాప్‌లాక్ బిగింపుపై దృష్టి సారించాలని.. తక్షణమే డ్యాం వద్దకు వెళ్లాలని కన్నయ్యనాయుడిని కోరారు. కర్నూలు సీఈ, డ్యాం డిజైన్ల చీఫ్ ఇంజనీర్‌కూ ఇదే సూచించారు. పోలవరం ప్రాజెక్టు క్రస్ట్ గేటు (60-20) సైజులో గేట్లు తయారు చేయడం ఇప్పటికిప్పుడు కష్టమైనందున.. 60-4 అడుగుల సైజులో ఐదు గేట్లను అమర్చి వరదను నియంత్రించే చర్యలు చేపడుతున్నామని నిమ్మల సీఎంకు తెలిపారు. ఇప్పటికే జల వనరుల శాఖ అధికారులు డ్యాం వద్దకు చేరుకున్నారని తెలిపారు. తాజా ప్రమాదం కారణంగా తుంగభద్ర నుంచి కిందకు 90,000 క్యూసెక్కుల జలాలను వృథాగా వదిలేస్తున్నా.. హైలెవల్, లోలెవల్ కెనాళ్లకు సాగు నీటి సమస్య లేకుండా చూస్తున్నామని వివరించారు. కొట్టుకుపోయిన గేటు స్థానంలో స్టాప్‌లాక్ గేటును అమర్చుతామని చెప్పారు. ఎగువ నుంచి వరద కొనసాగుతున్నందున.. స్టాప్‌లాక్ గేటు బిగించాక తిరిగి 105 టీఎంసీల జలాలను నిల్వ చేసుకునే వీలుందని.. దీనివల్ల భవిష్యత్‌లో సాగు, తాగునీటి సమస్యలు తలెత్తకపోవచ్చన్న ఆశాభావం వ్యక్తం చేశారు. ఇక సీఎం చంద్రబాబు ఆదేశాలతో కర్నూలు జిల్లా కలెక్టరు పి.రంజిత్‌బాషా నదీతీర మండలాల అధికారులను, ప్రజలను అప్రమత్తం చేశారు. కర్నూలు జిల్లా కౌతాళం, కోసిగి, మంత్రాలయం, నందవరం, సి.బెళగల్, కర్నూలు రూరల్ మండలాల్లోని గ్రామాల్లో ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. దండోరాలు, మైక్ అనౌన్స్ చేయించారు. ఇదే క్రమంలో ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను కూడా అందుబాటులో ఉంచుకోవాలని ఎస్పీ బిందుమాధవ్‌ను ఆదేశించారు. రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ అధికారులు సమన్వయంతో కలసి పనిచేయాలని స్పష్టం చేశారు.

### రిస్కు తీసుకోవద్దు: జలసంఘం

డ్యాం గేట్లు పురాతనమైనవి కావడంతో పాటు మరమ్మతు చేసేందుకు పరిస్థితులు అనువుగా లేవు. ఆదివారం అప్పటికప్పుడు స్టాప్‌లాక్‌ను తయారుచేసి బిగించేందుకు అవకాశం లేకపోయింది. ప్రమాదకరంగా నది ప్రవహిస్తుండడంతో రిస్కు తీసుకోవద్దని జలసంఘం సూచించింది. నిర్దిష్టస్థాయి వరకు జలాలు వెళ్లిపోయేదాకా ఆగి.. అప్పుడు స్టాప్‌లాక్ గేటు ఏర్పాటు చేయాలని ఆదేశించింది. వచ్చే ఏడాది నీటిప్రవాహం తగ్గాక డ్యాం గేట్లు మొత్తం మార్చేలా కార్యాచరణ సిద్ధం చేయాలని బోర్డుకు స్పష్టం చేసింది. కాగా.. క్రస్ట్ గేటు తయారీ బాధ్యతను విజయనగరలోని తుంగభద్ర స్టీల్ తయారీ కంపెనీతోపాటు హిందుస్థాన్ స్టీల్ తయారీ కంపెనీ, నారాయణ స్టీల్ తయారీ కంపెనీకి అప్పగించినట్లు బోర్డు కార్యదర్శి ఓఆర్‌కే రెడ్డి తెలిపారు. విజయవాడ, హైదరాబాద్‌లోని అనుభవజ్ఞుల సూచనలు తీసుకుంటున్నట్లు చెప్పారు.


తుంగభద్ర డ్యాంను పరిశీలిస్తున్న డీకే శివకుమార్, ఎమ్మెల్యేలు కాల్వ శ్రీనివాసులు, బి.విరుపాక్షి తదితరులు

### వాటాలొచ్చే పనులపైనే దృష్టి

ఖరీఫ్‌కు ముందు మే నెలలో ప్రాజెక్టుల మరమ్మతుల్లో భాగంగా గేట్లు ఎత్తిదించడం, గ్రీస్ చేయడం, రబ్బర్ సీల్స్ పరిశీలన వంటి పనులు చేయాలి. తుంగభద్ర డ్యాం గేట్లకు రిపేర్లు చేశారా అని పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో కేటాయించిన బడ్జెట్ కంటే ఆరేడు రేట్లు అధికంగా దాదాపు రూ.615 కోట్లతో ఎల్లెల్సీ, హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులను అప్పగించారు. ఇప్పటికీ రూ.300 కోట్లకు పైగా బిల్లులు బకాయి ఉన్నాయంటున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక ఓటాన్ అకౌంట్‌లో తుంగభద్ర ప్రాజెక్టు నిర్వహణ కోసం రూ.10 కోట్లు నాన్-ప్లాన్ గ్రాంట్ కింద కేటాయిస్తే.. బోర్డులో పని చేస్తున్న ఉన్నతాధికారి, రాజకీయ పలుకుబడి కలిగిన కాంట్రాక్టర్లు.. ఆర్థిక శాఖలో పని చేసే ఓ అధికారిని ప్రలోభపెట్టి ప్లానింగ్ గ్రాంట్‌గా మళ్లించారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. దీంతో ఆపరేషన్, నిర్వహణకు నిధుల కొరత ఏర్పడిందని అంటున్నారు.

కర్నూలు, అనంతపురం, కడప జిల్లాలు, తెలంగాణలో జోగులాంబ గద్వాల జిల్లాలకు, కర్ణాటకకు సాగు, తాగునీరు అందించే జలజీవని తుంగభద్ర జలాశయం. ఈ డ్యాం నిర్మాణానికి స్వాతంత్ర్యానికి ముందే 1945 ఫిబ్రవరి 28న ఆనాటి మద్రాస్ గవర్నర్ ఆర్థర్ హోప్ శంకుస్థాపన చేశారు. స్వాతంత్ర్యానంతరం 1949 ఏప్రిల్ 15న భారత ఇంజనీరింగ్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య సారథ్యంలో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. 1955-57 నాటికి డ్యాం సహ కాలువలు ఎల్లెల్సీ, హెచ్చెల్సీ రాయచూరు మెయిన్ కెనాల్ నిర్మాణం పూర్తి చేసి ఆయకట్టుకు సాగునీటి విడుదలకు శ్రీకారం చుట్టారు. జలాశయం గరిష్ఠ నీటినిల్వ సామర్థ్యం

### తెలుగు రాష్ట్రాల వాటా 78 టీఎంసీలు..

135 టీఎంసీలు కాగా.. పూడిక చేరడంతో 105.788 టీఎంసీలకు కుదించారు. జూన్ 1 నుంచి మే 31 వరకు నీటి సంవత్సరంలో 212 టీఎంసీలు వినియోంచుకునేలా డిజైన్ చేశారు. కృష్ణా జలాల ట్రైబ్యునల్ అవార్డు-1 (బచావత్ అవార్డు) ప్రకారం.. కర్నూలు జిల్లాలో ఎల్లెల్సీ వాటాగా 24 టీఎంసీలు, కేసీ కాలువ వాటా 10 టీఎంసీలు, అనంతపురం జిల్లాలో హెచ్చెల్సీ కాలువ వాటాగా 35.5 టీఎంసీలు, తెలంగాణ ఆర్డీఎస్ కాలువకు 8.5 టీఎంసీలు కలిపి తెలుగు రాష్ట్రాల వాటాగా 78 టీఎంసీలు.. కర్ణాటక వాటాగా 134 టీఎంసీలు కేటాయించారు. డ్యాంలో చేరే వరదను అంచనా వేసి ఈ దామాషా ప్రకారం ఏ టా పంపిణీ చేస్తారు. ఎల్లెల్సీ, హెచ్చెల్సీ కేసీ కాలువ ద్వారా కర్నూలు, అనంతపురం, కడప జిల్లాల్లో దాదాపు 6.61 లక్షల ఎకరాలకు సాగునీరు, పలు గ్రామాలకు తాగునీరు అందుతుంది. తుంగభద్ర బోర్డు వాటర్ రివ్యూ కమిటీ ఈ ఏడాది 171 టీఎంసీల వరద చేరుతుందని అంచనా వేసి ఆయా కాలువలకు దామాషా ప్రకారం కేటాయింపులు చేశారు.

### గేటు పునరుద్ధరణకు తక్షణ చర్యలు: పయ్యావుల

సాధ్యమైనంత త్వరలోనే తుంగభద్ర డ్యాం గేటును పునరుద్ధరించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటోందని ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. ఢిల్లీలో ఉన్న ఆయన అక్కడి నుంచే స్పందించారు. గేటు కొట్టుకుపోయిన సమాచారం తెలియగానే సీఎం చంద్రబాబు ఆదేశాలతో ఉన్నతాధికారులను అప్రమత్తం చేసినట్లు ఓ వీడియో సందేశంలో చెప్పారు. 'ఉమ్మడి అనంతపురం, కర్నూలు జిల్లాలకు తుంగభద్ర గుండెకాయలాంటింది. ఈ డ్యాంను నమ్ముకుని రెండు ఉమ్మడి జిల్లాల్లో లక్షలాది మంది రైతులు వివిధ పంటలు సాగు చేశారు. దీనిని దృష్టిలో ఉంచుకుని సాధ్యమైనంత త్వరలోనే గేటును పునరుద్ధరించేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలని సీఎం ఆదేశించారు. డ్యాం పురాతనమైనది కావడంతో అక్కడ స్టాప్‌లాక్ గేటు అలైన్‌మెంట్ డిజైన్ లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. డ్యాంపై పరిపూర్ణమైన అవగాహన కలిగిన కన్నయ్యనాయుడు, అనుభవజ్ఞులను సంప్రదించాం. అత్యవసర గేటును తయారు చేసుకుని, తాత్కాలికంగా నీటిని నిలిపేందుకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నాం. ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషిస్తున్నాం. రబ్బర్ గేటును తక్షణమే అడ్డుపెట్టడం ద్వారా వరద నియంత్రించడంపైనా దృష్టి సారించారు. డ్యాం అధికారులకు రాష్ట్రం నుంచి సంపూర్ణ సహకారం అందించాలని సీఎం ఆదేశించారు' అని తెలిపారు. డ్యాం వద్ద కాల్వ శ్రీనివాసులు మీడియాతో మాట్లాడారు. గేటు కొట్టుకుపోవడం వెనుక మానవ తప్పిదం ఉందని తేలితే అది మన్నించరాని నేరమని, సంబంధిత అధికారులను వదిలేది లేదని తేల్చిచెప్పారు.



తెలుగు ఐఏఎస్ అధికారికి

## డిస్టింగ్విష్డ్ ఫెలో పురస్కారం

» ప్రదానం చేసిన కేంద్ర మంత్రి మేఘవాల్

అమరావతి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): దేశంలో అత్యుత్తమ సేవలు అందించే బ్యూరోక్రాట్లకు ఇనిస్టిట్యూట్ ఆఫ్ డైరెక్టర్ (ఐవోడీ) అందించే ప్రతిష్ఠాత్మక విశిష్ట అధికారి (డిస్టింగ్విష్డ్ ఫెలో) అవార్డును భారత ఆహార భద్రత, ప్రమాణాల సంస్థ సీఈవో, కేరళ కేడర్‌లో పనిచేస్తున్న సీనియర్ తెలుగు ఐఏఎస్ అధికారి జి. కమలవర్ధనరావు అందుకున్నారు. శనివారం ఢిల్లీలో నిర్వహించిన ఐవోడీ 34వ వార్షికోత్సవంలో కేంద్రమంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ ఆయనకు అవార్డును ప్రదానం చేశారు. గతంలో కేంద్ర టూరిజం కార్పొరేషన్ ఎండీగానూ, ప్రస్తుతం ఎఫ్ఎస్ఎస్ఏఐ సీఈవోగా చేసిన సేవలకు గాను ఆయనకు ఈ పురస్కారం దక్కింది. 1990 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన కమలవర్ధనరావు గతంలో పొగాకు బోర్డు చైర్మన్‌గా, పురందేశ్వరి వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేశారు.

## షార్‌లో సందడి..!

» ఇటు ప్రయోగం.. అటు స్వాతంత్ర్య దినోత్సవం

» స్పేస్ వేడుకలకు రేపు డిప్యూటీ సీఎం పవన్ రాక

ఈవోఎస్-08 ఉపగ్రహం



సూళ్లూరుపేట, ఆగస్టు 11: శ్రీహరి కోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం (షార్)లో సందడి వాతావరణం నెలకొంది. ఒకపక్క జాతీయ అంతరిక్ష దినోత్సవ వేడుకలు, మరోవైపు ఎస్ఎస్ఎల్వీ-డీ3 ప్రయోగం, స్వాతంత్ర్య దినోత్సవాలతో కోలాహలంగా మారింది. దీనికితోడు ఈ నెల 13న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ షార్‌లో జరిగే అంతరిక్ష దినోత్సవ వేడుకలకు హాజరు కానున్నారు. స్పేస్ డే వేడుకలు, స్వాతంత్ర్య దినోత్సవం, రాకెట్ ప్రయోగం రెండు రోజుల వ్యవధిలోనే జరగనున్నాయి. దీంతో ప్రయోగ ఏర్పాట్లలో ఇస్రో శాస్త్రవేత్తలు బిజీబిజీగా ఉన్నారు. పవన్ కల్యాణ్ పర్యటన నేపథ్యంలో అధికారులు షార్ ఉన్నతాధికారులతో సమావేశమై భద్రత ఏర్పాట్లపై చర్చిస్తున్నారు. 15న స్వాతంత్ర్యదినోత్సవ వేడుకల అనంతరం షార్ వేదికగా ఎస్ఎస్ఎల్వీ-డీ3 రాకెట్ ప్రయోగం చేపట్టేందుకు ఇస్రో సిద్ధమైంది. ఈ రాకెట్ ద్వారా ఈవోఎస్-08 ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు. 175.5 కిలోల బరువుగల ఈ శాటిలైట్ తాజాగా ఇస్రో రూపొందించిన భూపరిశీలన ఉపగ్రహం ఇది. రక్షణ రంగానికి కూడా ఉపయోగపడుతుంది. ఎస్ఎస్ఎల్వీ ప్రయోగ పరంపరలో ఇది మూడోది కావడం విశేషం. అన్నీ సజావుగా సాగి వాతావరణం అనుకూలిస్తే ఈ 15న ఉదయం 9.17 గంటలకు షార్ నుంచి ఎస్ఎస్ఎల్వీ-డీ3 రాకెట్ ద్వారా ఈవోఎస్-08 ఉపగ్రహాన్ని రోదసీలోకి పంపనున్నారు.


కృష్ణ, వరిణి, వర్షిత(ఫైల్)

## రైలు పట్టాలపై ఘోరం

» రైలు ఢీకొని ఇద్దరు కూతుళ్లతో సహా రైల్వే ట్రాక్‌మెన్ మృతి

» భర్త, కన్నబిడ్డలను కళ్లెదుటే కోల్పోయిన భార్య

» తెలంగాణ మేడ్చల్‌లోని గౌడవెల్లి రైల్వేస్టేషన్‌లో దుర్ఘటన

మేడ్చల్ టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పట్టాలపై దూరంగా రైలు వస్తోంది. విధి నిర్వహణలో ఉన్న ఓ ట్రాక్‌మెన్ పట్టాల సమీపంలో పెరిగిన గడ్డిని తొలగిస్తున్నాడు. ఆ ట్రాక్‌మెన్ చిన్న కూతురు.. నాన్నా అంటూ.. తండ్రి కోసం పరిగెడుతూ పట్టాలు దాటుతోంది. ఇది చూసిన ట్రాక్‌మెన్ పెద్ద కుమార్తె చెల్లెలను ఆపేందుకు పరుగెడుతూ కేకలు వేసింది. ఆ అరుపులు విన్న ఆ తండ్రి తన బిడ్డలను కాపాడుకునేందుకు యత్నిస్తుండగా రైలు రూపంలో దూసుకొచ్చిన మృత్యువు ఆ ముగ్గురిని కబళించింది. మేడ్చల్ జిల్లా కేంద్రంలోని గౌడవెల్లి రైల్వేస్టేషన్‌లో ఆదివారం జరిగిన ఈ దుర్ఘటనలో కృష్ణ(42) అనే ట్రాక్‌మెన్, అతని కుమార్తెలు వర్షిత(12), వరిణి(7) ప్రాణాలు కోల్పోయారు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. గౌడవెల్లి రైల్వేస్టేషన్‌లో ట్రాక్ మెన్‌గా పని చేసే కృష్ణ ఆదివారం విధులు ముగిసిన తర్వాత కుటుంబంతో కలిసి బయటికి వెళ్లేందుకు భార్యాబిడ్డలను రైల్వే స్టేషన్‌కు తీసుకొచ్చాడు. భార్యాపిల్లలను ప్లాట్‌ఫామ్‌పై ఉంచిన కృష్ణ పట్టాల వద్ద పని చేసుకుంటున్నాడు. మరోపక్క ప్లాట్‌ఫామ్‌పై ఆడుకుంటున్న వరిణి తండ్రిని చూసి అతని వద్దకు వెళ్లేందుకు పరుగు తీసింది. ప్లాట్‌ఫామ్ చివరికి వెళ్లి పట్టాలు దాటే యత్నం చేసింది. గమనించిన కృష్ణ పెద్ద కుమార్తె వర్షిత చెల్లెలను ఆపేందుకు ఆమె వెంట పరుగెత్తింది. మరోపక్క పిల్లలున్న ట్రాక్‌పై రైలు వస్తుండడాన్ని గమనించిన కృష్ణ వారిని కాపాడేందుకు పరుగుతీశాడు. అయితే, ఆ ట్రాక్‌పై సికింద్రాబాద్ వెళుతున్న రాయలసీమ ఎక్స్‌ప్రెస్ వారిని ఢీకొట్టగా చెల్లాచెదురుగా ఎగిరిపడ్డ ఆ ముగ్గురు అక్కడికక్కడే మరణించారు. కళ్ల ముందే తన ఇద్దరు పిల్లలు, భర్తను కోల్పోయిన కవిత ఒక్కసారిగా కుప్పకూలిపోయింది. ఈ ప్రమాదంపై రైల్వే అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### పద్మావతి ఎక్స్‌ప్రెస్‌కు తప్పిన ముప్పు

» జనగామ జిల్లాలో తెగిపడ్డ హైటెన్షన్ విద్యుత్ తీగ

చిలుపూర్, ఆగస్టు 11: సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళుతున్న పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలుకు జనగామ జిల్లాలో ఆదివారం పెను ప్రమాదం తప్పింది. పద్మావతి ఎక్స్‌ప్రెస్ రైలు జనగామ జిల్లా వంగాలపల్లి రైల్వేగేటు సమీపంలోకి రాగానే పైనున్న హైటెన్షన్ విద్యుత్ వైర్ తెగిపోయింది. దీంతో రైలు ఒక్క ఉదుటున ఆగిపోయింది. ఈ ఘటనలో ప్రయాణీకులకు ఎలాంటి ముప్పు వాటిల్లలేదు. సమాచారమందుకున్న రైల్వే అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ వైర్లకు మరమ్మతులు చేసి రైలును కాజీపేట వైపు పంపించారు. ఈ క్రమంలో 40 నిమిషాలకుపైగా రైలు రాకపోలకు అంతరాయం ఏర్పడింది. రైలు గేటు వద్ద నిలిచిపోవడంతో పరిసర గ్రామాల ప్రజలు కూడా ఇబ్బంది పడ్డారు.

## యోగాలో అవినీతి ఆసనం

» రూ.200 టీ షర్ట్ 450కు కొనుగోలు

» ఆయుష్‌లో బయటపడ్డ అక్రమాలు

» మొన్న ప్రింటింగ్ మెటీరియల్‌లో నొక్కేశారు

» ఇప్పుడు యోగా దినోత్సవంలో గోల్‌మాల్

» అధిక ధరలకు యోగా కార్యక్రమ మ్యాట్లు

» అల్పాహారానికే రూ.లక్షకుపైగా బిల్లు

» విచారణ చేస్తే మరిన్ని వెలుగులోకి

(అమరావతి, ఆంధ్రజ్యోతి)

ఆయుష్ విభాగంలో ఏ టెండర్ ముట్టుకున్నా.. ఏదిటచ్ చేసినా అక్రమాలే వెలుగులోకి వస్తున్నాయి. మొన్న ప్రింటింగ్ మెటీరియల్ పేరుతో రూ. కోట్ల అవినీతికి పాల్పడ్డారు. ఇప్పుడు యోగా డే నిర్వహణ పేరుతో రూ. లక్షల్లో నొక్కేశారు. ప్రింటింగ్ మెటీరియల్ టెండర్లలో అధికారులే ఒక కంపెనీని ఎంపిక చేసి, ఆ కంపెనీకే టెండర్ మరొక మార్గంలో వచ్చేలా చేసి భారీగా జేబులు నింపుకున్నారు. ఆ విషయాన్ని మరిచిపోకముందే ఆయుష్ విభాగంలో మరొక అవినీతి బాగోతం వెలుగులోకి వచ్చింది. గత నెల 21వ తేదీన అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా.. విజయవాడ బందర్ రోడ్డులో ప్రముఖ కన్వెన్షన్ సెంటర్‌లో ఆయుష్ విభాగం అధికారులు రాష్ట్రస్థాయి యోగా డే కార్యక్రమాన్ని నిర్వహించారు. దీని కోసం ఆయుష్ అధికారులు చేసిన ఖర్చు చూస్తే కళ్లు బయర్లు కమ్ముతాయి. యోగా డే పేరుతో కొనుగోలు చేసిన వస్తువులు చూస్తే ఆశ్చర్యపోవాల్సిందే. యోగా డేలో పాల్గొనే ప్రతి ఒక్కరికి ఆయుష్ విభాగం తరఫున ఒక టీ షర్ట్, ఒక యోగా మ్యాట్, అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమంలో ఆ రోజు 200 నుంచి 250 మంది పాల్గొనగా, అధికారులు మాత్రం ఒక్కో వస్తువును 500 మందికిపైగా ఉన్నట్టు లెక్కలు వేసి, కొనుగోలు చేశారు. అది కూడా మార్కెట్‌లో ఎక్కడ లేనంత అత్యంత ధరకు కొనుగోలు చేశారు. ఉదాహరణకు టీ షర్ట్‌లను 1100 వరకు కొన్నారు.దీనికోసం ప్రతి టీ షర్ట్‌ను రూ.450 వెచ్చించారు. కానీ, దాని విలువ రూ.200లకు మించదని చెబుతున్నారు. బల్క్ మీద కొనుగోలు చేశారు. కాబట్టి ఇంకా తగ్గే అవకాశం ఉంది. యోగా మ్యాట్లను 400 దాకా కొనుగోలు చూసినట్లు పుస్తకాల్లో చూపించారు. అది కూడా కేవలం రూ.450 ఉన్న మ్యాట్ ధరను రూ.750కు కొన్నట్టు చెప్పుకొన్నారు. యోగా డేకు వచ్చిన వీఐపీల కోసం కొనుగోలు చేసిన జ్ఞాపికల్లోనూ కక్కుర్తి పడ్డారు. రూ.25 వేల నుంచి రూ.30 వేలు ధర చేసే మెమొంటోలకు లక్షల రూపాయిలు బిల్లులు చెల్లించారు.

MINISTRY OF AYUSH

### 'అల్పాహారం'లో ఆరగించారు

ఒక ఇడ్లీ, ఒక వడ, చిన్న ప్లేట్‌లో పొంగలి.. యోగా డేకు వచ్చిన వారికి అందించిన అల్పాహారం ఇది. కానీ, ఈ మాత్రానే ప్లేట్‌కు అధికారులు రూ.250 చెల్లించడం విస్తుగొలుపుతోంది. హోటల్‌లో రూ.70 లేదా రూ.80లకు ఈ మాత్రం పెడతారు. మహా అయితే రూ.100 ఉంటుంది. కానీ, అధికారులు 'ఖరీదైన' టిఫిన్‌కే రూ.లక్షకుపైగా చెల్లించారు. నిజానికి, ఈ కార్యక్రమం కోసం వచ్చినవారికి ఆయుష్ అధికారులతోపాటు మంతెన సత్యనారాయణ రాజు ఆశ్రమం వారు కూడా టిఫిన్లు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ తరఫున కొంత మొత్తాన్ని విడుదల చేశారు. ఇదంతా చూస్తే యోగా డేలో అధికారులు భారీఎత్తున అవినీతి ఆసనం వేసినట్లు కనిపిస్తోంది. దీనిపై ఆయుష్ విభాగం ఉన్నతాధికారులను సంప్రదించేందుకు 'ఆంధ్రజ్యోతి' ప్రయత్నించగా, ఎవరూ అందుబాటులోకి రాలేదు.

## వైసీపీతో అంటకాగితే 'ఉత్తములే'!

» దేవదాయ శాఖ కీలక అధికారి సిఫారసుతో సేవాపతకం

» పంద్రాగస్టు రోజున లోకేశ్ చేతులమీదుగా సత్కారం

» బాపట్ల జిల్లా ఇంకొల్లులో ఫిబ్రవరిలో చంద్రబాబు సభ

» దానిని అడ్డుకునేందుకు పై అధికారి, ఓ ఈవో యత్నం

» కూటమి ప్రభుత్వం వచ్చినా ఆ అధికారిదే హవా

» సామాజిక వర్గం పేరు చెప్పి సిబ్బందిపై పెత్తనం

» ఓ మంత్రి అండ ఉందంటూ అనర్హులకు అందలం

» ఉత్తమ సేవా పతకాల ఎంపికలో చేతివాటం!

గుంటూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంతో అంటకాగిన దేవదాయ శాఖ అధికారుల హవాయే కొత్త సర్కారు హయాంలో కూడా నడుస్తోంది. ఆ శాఖలో ఇప్పటికీ వైసీపీ నేతల మాటలు, ఆదేశాలే అమలవుతున్నాయి. జగన్ హయాంలో దేవదాయ శాఖలో ఆ అధికారులు చేయని అరాచకాలు లేవు.. గుంటూరులో మూడు జిల్లాల దేవదాయ అధికారి, ఓ ఈవో కలిసి నాటి విపక్ష నేత చంద్రబాబు బహిరంగ సభను సైతం అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఆ సభకు పొలాలు ఇచ్చిన కౌలు రైతులను ఎన్నో విధాలుగా వేధించారు. అలాంవారికే ఇప్పుడు ఆగస్టు 15వ తేదీన ఉత్తమ సేవా పథకాలు ఇవ్వాలని నివేదిక సిద్ధం చేయడంపై ఉన్నతాధికారులు సర్వత్రా విమర్శలు ఎదుర్కొంటున్నారు. బాపట్ల జిల్లా ఇంకొల్లులో ఈ ఏడాది ఫిబ్రవరి 2న అప్పటి ప్రతిపక్ష నేతగా ఉన్న చంద్రబాబు 'రా.. కదలిరా' పేరిట బహిరంగ సభ తలపెట్టారు. ప్రధాన రహదారి పక్కన ఉన్న గుంటూరు అన్నసత్రం భూముల్లో సభ నిర్వహించేందుకు కౌలు రైతులు ముందుకొచ్చారు. దీనిని అడ్డుకునేందుకు పై ఇద్దరు అధికారులు విఫలయత్నం చేశారు. ఆ భూములను కౌలుకు చేస్తున్న రైతులను బెదిరించి భూములివ్వకుండా చేయాలనుకున్నారు. అది కుదరకపోవడంతో తర్వాత ఆ రైతులపై కత్తిగట్టారు. వారిపై కేసులు పెట్టించారు. అప్పటి సీఎం జగన్ మెప్పు కోసం టీడీపీ సానుభూతిపరులైన అన్నదాతలను వేధింపులకు గురిచేశారు. పై 3 జిల్లాల ఉన్నతాధికారి (డిప్యూటీ కమిషనర్) వైసీపీకి వీరాభిమాని. 2019లో జగన్ ప్రభుత్వం వచ్చీరాగానే.. అప్పటి మంగళగిరి ఈవో (ప్రస్తుతం అసిస్టెంట్ కమిషనర్)ను వెంటపెట్టుకుని ఉమ్మడి గుంటూరు జిల్లాలో గెలుపొందిన 15 మంది వైసీపీ ఎమ్మెల్యేలను ఘనంగా సత్కరించారు. వేదపండితులతో ఆశీర్వచనాలు కూడా ఇప్పించారు. దీనిపై అప్పట్లోనే పెద్దఎత్తున విమర్శలు వచ్చాయి. ఇంతటి ఘన చరిత్ర కలిగిన ఆ ఉన్నతాధికారి సిఫారసుతో.. రైతులపై కేసులు నమోదు చేసిన ఈవోకు ఈ నెల 15న స్వాతంత్ర్యదిన వేడుకల్లో గుంటూరులో ఉత్తమ సేవా పతకం అందజేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇదే జరిగితే జిల్లా ఇన్‌చార్జి మంత్రి లోకేశ్ చేతుల మీదుగా ఈ సత్కారం జరుగుతుంది. జిల్లాలో మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డికి ముఖ్య అనుచరుడిగా పేరుపొందిన మరో ఈవోకు ఉమ్మడి గుంటూరు జిల్లాలో ప్రత్తిపాడు, తాడికొండ, చావలి, పెరవలి సహా పలు చోట్ల 70 ఆలయాల ఇన్‌చార్జి బాధ్యతలను అప్పట్లో అప్పగించారు. సదరు ఆలయాల ఇన్‌చార్జిగా వైసీపీ నాయకులకు కావలసిన పనులను చక్కబెట్టారు. ఈయన కూడా సేవాపతకం జాబితాలో ఉన్నట్లు తెలిసింది.

### శాఖలో ఆ అధికారే కీలకం..

వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగోన్నతి పొంది, తన సామాజిక వర్గం పేరు అడ్డం పెట్టుకుని హవా సాగించిన మూడు జిల్లాల దేవదాయ అధికారి.. ఇప్పుడు కూడా అదే సామాజిక వర్గం పేరిట తన కింది స్థాయి అధికారులపై పెత్తనం సాగిస్తున్నారు. ఓ మంత్రి పేరు చెప్పుకొని.. లేని సాన్నిహిత్యాన్ని, బంధుత్వాన్ని ఉన్నట్లుగా చెప్పుకొని.. తనను అడ్డుకునేవారు లేరన్న రీతిలో వ్యవహరిస్తున్నారు. ఆ ధీమాతోనే అనర్హులకు అవార్డులు ఇవ్వాలని సిఫారసు చేశారు. ఉత్తమ సేవా పతకాల ఎంపికలో ఆయన పెద్ద ఎత్తున చేతి వాటానికి పాల్పడినట్లు కూడా ఆరోపణలు వస్తున్నాయి.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.